

ఓం భూర్భువః స్వః తత్సవితుర్వరేణ్యం భర్గోదేవస్య ధీమహి ధియోయోనః ప్రచోదయాత్



# యుగశక్తి  గాయత్రి



ఓం వందే భగవతీం దేవీం శ్రీరామంచ జగద్గురుం
పాదపద్మే తయోః శ్రిత్వా ప్రణమామి ముహుర్ముహుః

ప్రఖర ప్రజ్ఞ సజల శ్రద్ధ


సంకల్పం - సంరక్షణ
వేదమూర్తి, తపోనిష్ఠ, పండిత
**శ్రీరామ శర్మ ఆచార్య**
శక్తి స్వరూపిణి
**మాతా భగవతీ దేవి శర్మ**

ప్రధాన సంపాదకులు
డాక్టర్ ప్రణవ్ పండ్యా

సంపాదకులు
**కందర్ప రామచంద్ర రావు**

సంపుటి 8 - సంచిక 4
**ఆగస్టు 2007**
సర్వజిత్ ఆషాఢం-శ్రావణం
**విడిప్రతి రూ॥ 8.00**
**సం॥ చందా రూ॥ 90**
**3 సం॥ చందా రూ॥ 250**
**10 సం॥ చందా రూ॥ 750**
**శాశ్వత చందా రూ॥ 1800**

Please send drafts in favour of
SRI VEDAMATA
GAYATRI TRUST
BUSINESS DIVISION,
HYDERABAD

సలహాలు, సూచనలకు :
శ్రీ అశ్విని సుబ్బారావు
040-32986922


## కర్తవ్యపాలన ఒక శ్రేష్ఠ ఉపాసన

ప్రతిరోజూ ఉపాసన చేయాలి. సూర్య చంద్రులను సృష్టించిన, ఫలాలను పండించిన, పుష్పాలను వికసింపజేసిన, ప్రాణులను సృజించిన ప్రభువు సమీపంలో కూర్చొనకపోతే - విశ్వంలోని నిజం ఎలా తెలుస్తుంది? విశుద్ధ హృదయంతో భజన, కీర్తనలలో పాల్గొనడం ప్రభువును స్తుతించడమే. దానివల్ల మన శరీరంలో, మనస్సులో, బుద్ధిలో ఉన్న సూక్ష్మ వ్యవస్థలు మేలుకొంటాయి, మనిషికి సద్గుణాలూ, సాఫల్యాలూ అందుతాయి.

మనం కర్మతో కూడ భగవంతుణ్ణి ఉపాసన చేస్తాము, భగవంతుడు మనిషి కాదు. అతడు సర్వవ్యాపకమూ, సర్వశక్తిమంతమూ, క్రియాశీలమూ అయిన సత్తా. కనుక - ఉపాసన లోపించినా, తన కర్తవ్య కర్మను నిర్వహించే మనిషి ఆత్మజ్ఞానాన్ని పొందుతాడు. కట్టెలు కొట్టడం, రాళ్ళు పగలగొట్టడం, ఇంటిని శుభ్రపరచడం వంటి పనులన్నీ భగవంతుని స్తుతులే. ఈ పనులన్నింటిద్వారా విశ్వాత్మకు కళ్యాణం జరుగుతుందనే భావనతో మనం వీటిని చేయాలి. కర్తవ్య భావనతో చేసే కర్మలకు భగవంతుడు ప్రసన్నుడు అవుతాడు. స్వార్థంకోసం కాక - ఆత్మసంతోషంకోసం చేసే కర్మను మించిన భగవద్భక్తి లేదు.

పూజ చేస్తూన్నపుడు మనం ఇలా అంటాము - 'ఓ ప్రభూ! నన్ను ఉద్ధరించు. నాకు శుభం కలిగించు. నా శక్తులను పెంపొందించు.' కర్మ చేసేటపుడు మనం ఇలా భావన చేస్తాము - 'ఓ ప్రభూ! తక్కువ వికాసం పొందిన ప్రాణులకు సేవ చేయడానికై నాకు శక్తినీ, జ్ఞానాన్నీ, వైభవాన్నీ ఇవ్వు.'

ఈ భావనలలో ఎంతో శక్తి ఉంది, ఆత్మ కళ్యాణ నిశ్చితత్వం ఉంది. కనుక, భజనయే కాక - ఆ పరమేశ్వరుని ఆదేశాలను పాలించడం కూడ నిజమైన ఉపాసనయే.

★★★

నిరాశవల్ల అమూల్య అవకాశాలు చేజారిపోతాయి.

# విషయ సూచిక

ముఖచిత్రం : శ్రీ అరవిందులు


1. **సంపాదకీయం :** కర్తవ్య పాలన ఒక శ్రేష్ఠ ఉపాసన 1
2. **విషయ సూచిక** 2
3. **సద్గురు వచనామృతం :** మిత భాషణ,హిత భాషణ 2
4. **వేద మంత్రం :** శుభం పలుకు, శుభం చెయ్యి 3
5. **ధారావాహిక : పతంజలి యోగదర్శనం-6** 4
6. **స్వావలంబన :** శ్రమ, విద్య, సమయముల సద్వినియోగం 7
7. **ఆచరణలో అధ్యాత్మ :** ఉద్రేకం కాదు-సమన్వయం 8
8. **శ్రావణ పౌర్ణమి వ్యాసం :**
ఋషిత్వాన్ని పెంపొందించే పావన పర్వం 9
9. **ధారావాహిక : దేవ సంస్కృతి సౌరభం-4**
వర్ణాశ్రమ ధర్మం అపురూపం,నిరుపమానం 11
10. **ధారావాహిక : ప్రగతికి ప్రాతిపదిక ఆదర్శ కుటుంబం-7**
కుటుంబ సామరస్యానికి పంచశీల 13
11. **శ్రీ అరవింద జయంతి వ్యాసం :**
పూర్వభారత వైభవ ఆవిష్కరణ 15
12. **ఆచరణలో అధ్యాత్మ :** ఆనందం మన గుప్పిట్లో 17
13. **జీవించే కళ :**
కర్మవీరులం కావాలి - విజయమాల ధరించాలి 18
14. **మనం-మన ఆరోగ్యం :**
ఆహార విహారాలకు పది నియమాలు 23
15. **గాయత్రి మహిమ :** నేయిగా మారిన గంగ నీరు 26
16. **బోధ కథ :** నిరాశ్రయుల ప్రవక్త 27
17. **సాధన విజ్ఞానం :** పంచీకరణ విద్య 29
18. **ధారావాహిక : గాయత్రీ మహావిజ్ఞానం-22**
తన్మాత్ర సాధన 31
19. **ఆచరణలో అధ్యాత్మ :** శుభ ఆకాంక్షద్వారా సద్బుద్ధి 33
20. **బోధ కథ :** పాదుషాకు ప్రాణ భిక్ష 34
21. **ధారావాహిక : నా స్మృతిపథంలో గురుదేవులు-13**
ఆలోచనను మార్చిన గురుదేవులు 37
22. **ధారావాహిక : దివ్యజీవన దర్శనం - 42**
విశ్వానికి ఆశ్రమం ఆ ఆశ్రమం-2 39
23. **నావారితో నా మాట : నాలుగేండ్లలో శతజయంతి-5**
ఈనాటి అవసరం - పర్యావరణ విప్లవం 42
24. **పాఠకుల స్పందన** 44
25. **శాంతికుంజ్ సమాచారం** 45
26. **వార్తలు** 46
27. **సద్గురులీలామృతం** 48


## సద్గురు వచనామృతం



## మిత భాషణ, హిత భాషణ

చివరి తీర్పు రోజున మనిషి తాను మాట్లాడిన ప్రతి మాటకూ సంజాయిషీ ఇవ్వవలసి ఉంటుంది. మౌనం ద్వారానే మనం చెడు మాటలనుండి రక్షింపబడగలుగుతాము.

సహజ మౌనమే మన జ్ఞానానికి గీటురాయి. విజ్ఞుడు మాట్లాడడు. మాట్లాడేవాడు ఏమీ తెలియని వాడు. ఈ సామెతను మనం గుర్తుంచుకోవాలి. సూక్ష్మ రహస్యాలు తెలిసినప్పుడు మన నోరు మూగబోవాలి. జ్ఞానం ఉన్నత స్థాయికి చేరితే-సహజ మౌనం దానికదిగా జన్మిస్తుంది.

స్థిరంగా ఉన్న నీరు లోతుగా ఉంటుంది. అలాగే-మౌనం మనిషి జ్ఞాన గాంభీర్యానికి చిహ్నం. వాచాలత పాండిత్యానికి గీటురాయి కాదు. లోతయిన, గంభీరమైన మౌనమే పాండిత్యానికీ, జ్ఞానానికీ ప్రమాణం. మనిషికి ఆపదలో అసలైన తోడు మౌనం. అది అతడిని అనేక కష్టాలనుండి గట్టెక్కిస్తుంది.

ఆత్మయొక్క స్వరాన్ని వినాలన్నా, జీవిత రహస్యాలనూ, ప్రపంచ రహస్యాలనూ తెలుసుకోవాలన్నా, తగాదాలనూ వాదోపవాదాలనూ పరిహరించాలన్నా, మాటలద్వారా చేసే పాపాలనుండి రక్షించబడాలన్నా, మాటలతో తపస్సు చేయాలన్నా, ఇతర సత్ఫలితాలు కలగాలన్నా-మనం మౌనాన్ని ఆశ్రయించాలి. నిత్య జీవితంలో మిత భాషణనూ, హిత భాషణనూ అలవరచుకుంటే-ఇహంలో, పరంలో ప్రగతిని సాధించవచ్చు.

★★★

### రాష్ట్రమంతటా యోగ చికిత్సా శిబిరాలు

ఈ సంవత్సరం జూలై, ఆగస్టు, సెప్టెంబరు నెలలలో రాష్ట్రమంతటా యోగ చికిత్సా శిబిరాలు నిర్వహించబడుతాయి. దేవ సంస్కృతి విశ్వవిద్యాలయంలో యోగ శాస్త్రంలో ఎమ్.ఏ. ప్యాసయిన యువతీ యువకుల బృందం ఆ శిబిరాలను నిర్వహిస్తుంది. బృందంలో యువకులు సత్యార్థప్రకాశ్ తివారీ, రాహుల్, గుడాకేశ్ వత్స్, యువతులు వందన, సీమ, అర్చన, చారు సభ్యులుగా ఉన్నారు. బృందం జూలై 16న హైదరాబాదు చేరుతుంది. 5 లేక 7 రోజులు జరిగే శిబిరాలలో యోగ, ప్రాణిక్ హీలింగ్, ఆక్యుప్రెషర్, ప్రకృతి వైద్యముల ద్వారా వివిధ రోగాలకు చికిత్స జరుగుతుంది. తమ స్థలాలలో శిబిరాలను నిర్వహించగోరే గాయత్రీ పరివార్ శాఖల ప్రముఖులు హైదరాబాదు గాయత్రీ చేతనా కేంద్రానికి వీలైనంత త్వరగా ఉత్తరాలు వ్రాయగలరు.

★★★

**సమయమే జీవనం.**

వేద మంత్రం

# శుభం ఆలోచించు, శుభం చూడు,శుభం పలుకు,శుభం చెయ్యి

సత్యం చ మే శ్రద్ధా చ మే జగచ్చ మే ధనం చ మే
విశ్వం చ మే మహశ్చ మే క్రీడా చ మే మోదశ్చ మే
జాతం చ మే జనిష్యమాణం చ మే సూక్తం చ మే
సుకృతం చ మే యజ్ఞేన కల్పన్తామ్

**(యజుర్వేదం 18/15)**

**భావార్థం:** నా సత్యము, శ్రద్ధ, మిత్రత, ధనము, విస్తరణ, క్రీడ, వినోదము, వచనము, శుభకర్మలు-అన్నీ సమున్నత మయ్యేటటువంటివే నేను చేస్తాను.

**సందేశం:** ఈ సురదుర్లభమైన మానవ శరీరం లభించినందుకు మనం ఎంతో సౌభాగ్యవంతులం. మనం దీనిని పశు ప్రవృత్తిలో నష్టపోవటం ఎంతటి దుర్భాగ్యం ! జీవితాన్ని సదుపయోగం చేసుకోవటమే మనకు అన్నింటి కంటే ముఖ్యమైన సమస్య. దానికి తగు సమాధానం పొందటంలోనే దూరదృష్టి పొందటం, ఈశ్వరుని ఇచ్ఛను పూర్తి చేయటం ఉంటుంది.

ఈశ్వరుడు మనకు ఏ శక్తిభండారం ఇచ్చాడో, ఏ ప్రతిభ, సామర్థ్యం, యోగ్యత, వివేకబుద్ధి ఇచ్చాడో-అవికేవలం మన శరీరం కొరకేనా, కుటుంబ నిర్వహణ కొరకేనా? మనం మన సామర్థ్యాన్ని గుర్తిస్తే, వాస్తవం తెలిసివస్తుంది. మన అవసరాలను పూర్తి చేసుకొన్న తర్వాత కూడా మన వద్ద ఎంతో సమయం, ధనం, బలం మిగిలితే, వాటిని సదుపయోగపరచకుండా, దురుపయోగం చేసి మనం పతనమనే గోతిలో పడుతున్నాము. వ్యాపారంలో కార్యాలయాలలో మనుష్యుడు ఎక్కువలో ఎక్కువ పది గంటలు సామాన్యంగా వ్యయం చేస్తున్నాడు. 6-7 గంటలు నిద్రకు, నిత్య కర్మలకు భోజనానికి మరో 3-4 గంటలు పోగా ప్రతిరోజూ 4 గంటల సమయం మిగిలిఉంటుంది. దానిని ఎలా ఉపయోగిస్తున్నామో ఏదో ఒక రోజున ఆలోచించాలి.

మనం మన ఆధ్యాత్మిక ప్రగతిని కూడా గుర్తుపెట్టుకోవాలి. ప్రపంచాన్ని భగవంతుని విరాట్ రూపంగా అంగీకరించి, దానిని అధిక సుందరంగా, సుగంధితంగా, సువికసితంగా చేయడానికి మన మిగిలిన సామర్థ్యాన్ని వినియోగించాలి. మన దోష-దుర్గుణాలను, దుష్ప్రవృత్తులను, దురాలోచనలను, దుష్ట సంస్కారాలను వెదికి పారద్రోలే కృషి చేసినపుడే ఇది సాధ్య మవుతుంది. దానితోపాటు గుణ, కర్మ, స్వభావాలలో ఉత్కృష్టతను, ఆదర్శవాదాన్ని మన వ్యక్తిత్వంలో అధికంగా పెంచుకోవడంలో మనం నిమగ్నమై ఉండాలి. లోక కల్యాణం కొరకు నియోగించిన పరమార్థ ప్రయోజనాలను నిజమైన ఈశ్వర పూజగా భావించాలి. నలువైపులా వ్యాపించిన వెనుకబాటుతనాన్నీ. అజ్ఞానాన్నీ, అనాచారాలనూ తొలగించేందుకు పడే కష్టాలను ఉత్తమమైన తపస్సుగా మనం అర్థం చేసుకోవాలి. ఈ విషయాలపట్ల ఎంత శ్రద్ధ వహిస్తే-అదే నిష్పత్తిలో ఆత్మప్రగతి, ఆత్మశక్తి వృద్ధి అవుతాయి. మనం మన అంతఃకరణలో కూర్చున్న భగవంతుని స్వరాన్ని వినాలి. దాని ఆదేశానుసారం కర్తవ్యాలను నిర్ధారించుకోవాలి. లేకపోతే-ఆత్మహితాన్ని కాలితో తొక్కివేస్తూ, మనస్సునంతా శరీర మాయకే సమర్పించుకొనే అలవాటు చివరికి మూర్ఖత్వమని తెలిసివస్తుంది. అప్పటికే అధిక మూల్యం చెల్లించి ఉంటాము.

శుభ కర్మలలో నిమగ్నంకావడంలోనే జీవిత సార్థక్యం ఉన్నది. మనో వాక్కాయ కర్మలలో ఎల్లప్పుడూ శుభమే ఆలోచించాలి, శుభమే చూడాలి, శుభమే మాట్లాడాలి, శుభమే చేయాలి. నలువైపులా పవిత్ర వాతావరణాన్ని కల్పించి, మన ఇంద్రియాలన్నిటినీ శుభకర్మలలో ప్రేరేపిస్తూ ఔన్నత్య పథంలో పురోగమించాలి.

వ్యక్తిత్వ సంపన్నులైనవారు ఆదర్శ జీవనాన్ని స్వీకరించి యశస్వు లవుతారు.

★★★

**చెడ్డ పుస్తకాలను చదవడం విషం త్రాగడమే.**

ధారావాహిక : పతంజలి యోగదర్శనం-6

# స్వాధ్యాయాన్ని అశ్రద్ధ చేయకు

శాస్త్రమునకు మూడు (ఆజ్ఞలు) నియమాలున్నవి- (1) సత్యంవద, (2) ధర్మంచర, (3) స్వాధ్యాయ న ప్రమది తవ్య అనగా సత్యమును వచించుట, ధర్మమును ఆచరించుట, స్వాధ్యాయంలో పొరపాట్లు రానివ్వకుండుట అని అర్థము. ఈ నిర్ధారణను బట్టి సత్యం, ధర్మములతో సమానంగా స్వాధ్యాయానికి ప్రాముఖ్యం ఇవ్వబడిందని తెలుస్తోంది.

దీనికి ఉన్న మరొక నిబంధన పవిత్రతా క్రమం, మనస్సు, వాక్కు, కర్మ- ఈ మూడింటినీ అత్యంత పవిత్రంగా ఉంచుకొనవలసి ఉంది. ఈ నిర్ధారణలో మనస్సు యొక్క పవిత్రత ప్రముఖమైనదిగా భావించబడినది. దీని తర్వాత వచనం, కర్మల వరుస వస్తుంది. మానసిక పవిత్రత స్వాధ్యాయంలో, వాక్కు పవిత్రత సత్యంలో, క్రియల వర్చస్సు ధర్మాచరణలో వెల్లడవుతుంది. జీవితంలో పాటించినా పాటించకపోయినా- సత్యం, ధర్మముల మహిమను అందరూ ఎరుగుదురు. కాని స్వాధ్యాయం విలువ తెలిసినవారు చాలా తక్కువ మంది ఉంటారు. దాని మహిమ సత్యపాలన, ధర్మపాలన కంటే ఏవిధంగాను తక్కువ కాదు. సత్య ధర్మముల పట్ల ఉదాసీనతవల్ల కలిగే హాని దీని ఉపేక్షవల్లా కలుగుతుంది.

భూతలంపై దేవ మానవుల సంఖ్య హెచ్చుగా ఉన్న కాలంలో ప్రతివారూ సత్యపాలన-ధర్మపాలన శ్రద్ధతో జరుపుతూ ఉండేవారు. వాటితోపాటు స్వాధ్యాయానికి కూడా సముచిత స్థానం ఉండేది. దాని మహిమ కూడా ఉన్నతంగా భావించబడేది. ప్రతి ఆలోచనాపరుడూ దానిపట్ల శ్రద్ధ చూపేవాడు.

స్వాధ్యాయమనగా అర్థం- తనంత తాను స్వయంగా అధ్యయనం చేయడం. ఈ పని విద్యార్థులకు శాస్త్రాల నియమిత అధ్యయనం ద్వారా సమకూరుతుంది. ఆత్మ సత్తా మహిమను తెలియజేసి, కర్తవ్య పథాన్ని చూపించి, ప్రేరణ కలిగించే గ్రంథాలు శాస్త్రగ్రంథాలు. ఈ రోజుల్లో ఇతిహాసాలు-పురాణాలు శాస్త్రాల పేరుతో ప్రచారమవుతున్నాయి. వాటిలో ఏదో కాలానికి సంబంధించిన సంఘటనల వివరణ, లేదా అభూత కల్పనలతో నిండిన పుక్కిటి పురాణాలు నిండి ఉంటాయి. తలాతోక లేని ఆ విషయాలకు అర్థం పర్థం లేని వాక్యాలతో లింకులు పెడుతూ, వాటిని వివేచిస్తూ ఉంటారు. అది వక్రమార్గం. చిక్కుముడి వంటిది. ఎవరికీ అర్థం కాదు. అందుచేత అర్థమయ్యేలా చెప్పలేరు కూడా. విలక్షణమైన తెలివితేటలు ఉన్నవారు మాత్రమే ఆ విశాల సముద్రాన్ని మథించి ఎక్కడో దాగి ఉన్న రత్నాలను వెలికి తీయగలుగుతారు. జిజ్ఞాసువులకు ఉపయోగపడే యోగ్యమైన సామగ్రిని ప్రదానం చేయగలుగుతారు.

శృతి-స్మృతి, ఉపనిషత్‌లు, ఆరణ్యకాల వంటి తత్వజ్ఞానాన్ని వివేచన చేయగల గ్రంథాలే మూల ప్రయోజనాన్ని పూర్తి చేయగలవు. శరీరం ప్రత్యక్ష రూపం గలది. అదే మన కవసరమైన పనులన్నింటిని పూర్తి చేస్తుంది. ఇంద్రియాలకు గల సంవేదనల ద్వారా రసాస్వాదన అదే చేస్తుంది. మానావమానములు, లాభ నష్టాలు దాని అనుభవంలోకే వస్తాయి. అంద చందాలు, అలంకారాలు దానికి సంబంధించే ఉంటాయి. పేరు-రూపం దానికే వినడానికి, చూడడానికి వీలవుతుంది. అందువల్ల సామాన్య స్థాయికి చెందిన జ్ఞానం దేహమే అన్నిటికి మూలమని, అన్నిటికీ ఆధారమని భావిస్తుంది. దాని సంతోషం కోసం, దాని సుఖం కోసం కట్టుబాట్లను కూడా అతిక్రమించడానికి సిద్ధపడుతూ ఉంటుంది. అంతేకాని

**శ్రమయే వైభవం.**

కనిపించే ఈ దేహంవెనుక ఒక చైతన్యవంతమైన ఆత్మ ఉన్నదనీ, దానికీ కొన్ని అవసరాలు ఉంటాయనీ, ఆత్మకూ సంతోషం–ఉల్లాసం కావాలనీ ఆలోచించదు. ఈ విస్మృతి వల్ల అత్యంత ప్రభావశాలి అయిన ఆత్మసత్తా శరీరం వరకే పరిమితం అయిపోతుంది. దాని కోసమే స్వార్థసాధనల ప్రయత్నాలు సాగుతుంటాయి. జీవశక్తి మొత్తం దిగదుడుపు అయిపోతూ ఉంటుంది.

ఆత్మ కల్యాణం కోసం, చేతనాత్మక ఉత్కర్ష కోసం ఎంతో కొంత కృషి–సాధన చేయాలన్న స్మరణ కూడా రానివ్వదు ఈ ఏకపక్ష దృష్టికోణము చాలా పెద్ద పొరపాటు. దాని మూలాన మనిషి దారి తెన్నూ కానరాక చిక్కుల్లో పడతాడు. అనర్థాలను కొనితెచ్చుకుంటాడు. భవిష్యత్తును అంధకారమయంగా చేసుకుంటూ ఉంటాడు. ఈ ఇబ్బందులనుండి తప్పించుకోవడానికి ఒకే ఒక ఉపాయం స్వాధ్యాయం. దాని సహకారంతో ఆత్మచేతన యొక్క సత్తాను–మహత్తును, దాని ప్రగతి క్రమానికి సంబంధించిన సమగ్ర జ్ఞానాన్ని ప్రతిరోజు మననం చేసుకుంటూ ఉండాలి. శరీరం తన కదలికల ద్వారా తన అవసరాలను తీర్చుకుంటూ ఉంటుంది. కానీ ఆత్మకు అటువంటి క్రియాత్మక వ్యవహారం నడుపగల అవకాశం లేదు. విస్మృతిని సజీవ స్మృతిగా మార్చుకొనగలిగే సాధనాలు లేవు. ఈ కార్యం స్వాధ్యాయము ద్వారానే సంపన్నం కాగలదు. ఇంతకంటే మరొక అవకాశము లేదు దానికి. మనిషికున్న జ్ఞాపకశక్తి క్షణికమైనది. సంఘటనలు మారుతున్న కొద్దీ గడచిన విషయాలు మరపున పడిపోతుంటాయి. కనుక ఆత్మక్షేత్రాన్ని ఎండిపోకుండా స్వాధ్యాయమనే నీటితో ప్రతిరోజూ తడుపుతూ ఎప్పుడూ పచ్చగా ఉండేలా చేసుకోవాలి.

సాధారణంగా శాస్త్రాల పఠనం మాత్రమే స్వాధ్యాయంగా లెక్కించబడుతుంది. పూర్వకాలంలో జీవిత స్వరూపం చిన్నది. దానికుండే సమస్యలు పరిమితమే. వాటిని శ్రద్ధాళువులు శాస్త్రవచనాల ద్వారా పరిష్కరిస్తూ ఉండేవారు. కానీ ఇప్పటి పరిస్థితి వేరు. ఆలోచనా క్షేత్రం మునుపటి కంటే ఎంతో విశాలతను సంతరించుకొన్నది. ప్రపంచంలోని అనేక తత్వశాస్త్ర దర్శనాలను ఒకటిగా గుదిగుచ్చటానికి, ఒకరి ఆలోచనలను మరొకరు తెలుసుకొనగలగటానికి అవకాశం లభిస్తుంది. ప్రతి విషయంలో తర్కం, వాస్తవం, ప్రమాణం, ఉదాహరణ కోరబడుతున్నది. అభివృద్ధి చెందుతున్న భౌతిక వాదం యొక్క ప్రతిక్రియలు ప్రత్యక్షవాదాన్ని దృష్టికి తెచ్చాయి. ఈ దిశలో శాస్త్రవచనాలు శ్రద్ధాళువులకే పరిమిత మవుతున్నాయి. బుద్ధివాదులు వాటితో సంతుష్టులు కావడం లేదు. వారికి విశదమైన, సశక్తమైన సమాధానం కావాలి. ఆ కాలంలో ఆత్మ చేతన మీద లోతైన ప్రభావం

## నిర్భయత్వం

*పండిత ఈశ్వరచంద్ర విద్యాసాగర్ ఒక పర్యాయం ఎక్కడికో వెళ్తూ రైలు పెట్టెలోకి చొచ్చుకొని వెళ్ళారు. అక్కడ కూర్చునేందుకు స్థలం వెతకసాగారు. ఒక బర్త్ మీద ఇరువురు ఆంగ్లేయులు కూర్చొని ఉన్నారు. వారి ఇరువురి నడుమ ఒక వ్యక్తి కూర్చునే స్థలం ఉంది. విద్యాసాగర్‌జీ ఆ ఇరువురి ఆంగ్లేయుల నడుమ వెళ్ళి కూర్చున్నారు. అవి ఆంగ్లేయులు పరిపాలించే రోజులు. కనుక ఇది సాహసంతో చేసిన పనే. ఆ ఇరువురు ఆంగ్లేయులకు ఎంతో కోపం వచ్చింది. ఒకడు పళ్ళు పటపట కొరుకుతూ – 'మూర్ఖుడా!' అన్నాడు. రెండవవాడు కండ్లురిమి చూస్తూ – 'గాడిదా!' అన్నాడు. నిర్భయుడైన విద్యాసాగర్‌జీ ఇతనివైపు ఒకసారి, అతనివైపు ఒకసారి చూచారు. ఒక మందహాసం చేసి ఇలా అన్నారు – 'మిత్రులారా, నిజం, నేను ఆ ఇరువురి నడుమనే కదా కూర్చున్నాను.' ఆ ఇరువురు విద్యాసాగర్ ముఖం వైపు తేరిపార చూస్తూ ఉండిపోయారు.*

**ధైర్యం చేదుగా ఉంటుంది. దాని ఫలితం తీయగా ఉంటుంది.**

చూపిన మహామనీషులు ఈ కార్యాన్ని ఎంతవరకు చేయగలిగారన్నదానికి నిరూపణ, ప్రమాణము లేకుంటే- నేటి జిజ్ఞాసకు తృప్తి కలుగదు. అందువల్ల శాస్త్రశబ్దాలకు విస్తృత వ్యాఖ్య చేస్తూ, అందులో భౌతిక ప్రతిపాదన సమ్మిళతం చేయవలసి ఉంటుంది. ఇప్పుడు అటువంటి సాహిత్యాన్నే స్వాధ్యాయ ప్రయోజనాలకు ఎన్నుకోవడం సముచితం.

మరొక పెద్ద ప్రశ్న. ప్రపంచం మొత్తం మీద చదువుకున్నవారు నాల్గో వంతుకన్నా తక్కువ సంఖ్యలో ఉన్నారు. మూడు వంతులపైగా నిరక్షరాస్యులే. చదువురానివారు శాస్త్రాలనుగానీ, ఇతర సాహిత్యంలనుగానీ ఎలా చదువగలరు? ఒక వేళ అటువంటి వారికి చదివి వినిపించడం అనే ప్రక్రియ గురించి ఆలోచించినా అటువంటి సత్సంగాలు ఎక్కడ లభిస్తాయి? వినేవారి తెలివితేటలకు తగినట్లు ఆత్మ కల్యాణానికి కావలసిన దూరదృష్టి, వివేకశీలత వైపు ధ్యానముంచి చేసే సంత్సంగాలు ఎవరూ నెలకొల్పలేదు గదా? ఇప్పుడు సంత్సంగాల పేరుతో ఎక్కడ చూచినా వినోద కార్యకలాపాలే సాగుతున్నాయి. వాటిని వినడం వల్ల మూఢ నమ్మకాలు, భ్రాంతులు తగ్గకపోగా, మరింత పెరిగే అవకాశాలే ఎక్కువ. అవి కూడా ఈ క్లిష్ట పరిస్థితిలో దుర్లభమే. పరమార్థ భావంతో ఉచ్చస్థాయి తత్వజ్ఞానాన్ని సామాన్య ప్రజలకు సులభసాధ్యం చేయడానికి తమ సమయాన్ని కేటాయించగల త్యాగధనులు ఎవరున్నారు? ఇలా అన్నీ ప్రశ్నలే ఎదురవుతాయి ఈ విషయంలో.

ఇటువంటి పరిస్థితిలో భావన-చింతన ఈ ఆవశ్యకతను పూర్తి చేయగలవని కనుగొన్నారు. సౌకర్యాన్ని బట్టి ఒక ఏకాంత ప్రదేశంలో కూర్చొనాలి. ఏకాగ్రతతో ఆత్మ స్థితిని సమీక్షించుకుంటూ ఉండాలి. ఆదర్శవాద నిరూపణలో తన జీవన క్రమం ఎంత వెనుకబడి ఉన్నది- అని తనలోని లోపాలను నిష్పక్షపాతంగా చురుకైన బుద్ధితో స్వయంగా వెతికి పట్టుకోవడం "మననము" అనబడుతుంది. ఈ ఆత్మ సమీక్ష కోసం ప్రతి ఒక్కరూ రోజు మొత్తం మీద ఏదో ఒక సమయాన్ని ఎన్నుకోవాలి. అభివృద్ధి పథంలో వెనకబడేలా చేసిన లోపాలు దృష్టికి వస్తుంటే, వాటిని సంస్కరించుకునే ప్రయత్నం సాగుతూ ఉంటే- మననం సార్థక స్థాయిలో ఉన్నట్లు భావించవచ్చు.

మననం యొక్క రెండో పక్షం చింతన. చింతన అనగా అర్థం- దుష్ప్రవృత్తుల నిర్మూలనకు, సత్ప్రవృత్తుల పెంపునకు మార్గాలను నిర్థారించుకొనుట. దినచర్యలోని దోషాలను తగ్గించుకుంటూ సద్గుణాలను అభివృద్ధి పరుచుకొనే వ్యవహారం కార్యరూపం దాల్చాలి. ప్రతిరోజూ ఆవగింజంత దోషం తగ్గించుకుంటూ నువ్వుగింజంత సద్గుణం పెంచుకుంటూ పోతుంటే- కొన్నాళ్ళకు శరీర సేవవలెనే ఆత్మసాధన కూడా చక్కగా కుదురుతుంది. అలాగే స్వాధ్యాయం యొక్క వాస్తవిక ప్రయోజనము నెరవేరుతుంది.

★★★

## సత్యదర్శనం

*మహాత్మా ఆనందస్వామి జీవితంలో హృదయాన్ని కదలించే ఒక సంఘటన ఇది. ఒకసారి ఆయన అనేక సంవత్సరాల తరువాత కరుణామూర్తి, జన్మధాత్రి అయిన తన తల్లిని కలుసుకునేందుకు వచ్చాడు. స్వామీజీ వాకిలి దగ్గరకు రాగానే వృద్ధురాలైన తల్లి, 'వచ్చావా తండ్రీ' అని అన్నది. ఆ మాట వింటూనే స్వామీజీ వృద్ధురాలైన తన తల్లిఓ ఇలా అన్నారు- 'అమ్మా, నీవు మరీ వృద్ధురాలవై పోయినావు. శరీరం కృశించిపోయింది. కళ్ళలో కాంతి సన్నగిల్లింది. అయినా చప్పుడును బట్టి నేను వచ్చినట్లు ఎలా గుర్తించావు?'*

*తల్లిచెప్పింది- 'నీ అడుగుల చప్పుడును బట్టి గుర్తించాను. ఆ చప్పుడు నా కన్నతండ్రిదే. అరే, నీకేం తెలుసు! నేను ప్రతిరోజూ నీకోసమే ఎదురుతెన్నులు చూస్తున్నాను. నువ్వుగొప్ప మహాత్ముడవై పోయినావటగా! అయినా నాకు తెలుసు. నీవు నాదగ్గరకు ఒక రోజున తప్పక వస్తావు. నేను నీకు పుణ్యక్షేత్రాన్ని గదా!' ఆనందస్వామి ఆమెతో ఇలా అన్నాడు - 'అమ్మా, నీవు ఏసుక్రీస్తు చెప్పిన మాటలే చెబుతున్నావు. నీ మాతృచరణాలలోనే నీ స్వర్గం ఉన్నదని ఆయన చెప్పాడు'*

*ఇది విని తల్లి చెప్పింది - 'ఏసుక్రీస్తు క్రొత్తగా చెప్పింది ఏముంది? సత్యము అందరికీ సత్యముగానే గోచరిస్తుంది కదా!'*

**సేవా మార్గం భక్తి మార్గం కన్న తక్కువది కాదు.**

స్వావలంబన

# శ్రమ, విద్య, సమయముల సద్వినియోగం

భారత్ వ్యవసాయ ప్రధానమైన దేశం. వ్యవసాయం మన ఆదాయానికి ప్రధాన వనరు. ఈ ప్రకృతి వనరును సద్వినియోగపరచితే- మన ఆర్థిక, సామాజిక రంగాలు సమృద్ధం అవుతాయి. సమున్నతం అవుతాయి.

కానీ వ్యవసాయాన్ని నిర్లక్ష్యం చేయడంవల్ల లెక్కలేనన్ని సమస్యలు పుట్టుకువచ్చాయి. నేడు వ్యవసాయాన్ని ఆధునికీకరించడం అవసరం. ప్రకృతిలోని ఇతర వనరులను సద్వినియోగపరచడం అవసరం. తద్వారా దారిద్ర్యాన్నీ, నిరుద్యోగాన్నీ నిర్మూలించవచ్చు. ఎందుకంటే- ఈ వనరులు మన ఆర్థిక వ్యవస్థకు ఆధారాలు; సామాజిక, సాంస్కృతిక వికాసానికి ఉత్తమ సాధనాలు.

సరళీకరణ ప్రక్రియలో వ్యవసాయం, వ్యవసాయ ఉత్పత్తులు ఉపేక్షకు గురి అయినాయి. అయితే- మన దేశ జనాభాలో మూడింట రెండు వంతులు వ్యవసాయంపై ఆధారపడి ఉంది. మొత్తం ఆంతరిక ఉత్పత్తిలో దాని వాటా సుమారు 20 శాతం ఉంది. కనుక, వ్యవసాయ రంగాన్ని తగువిధంగా అభివృద్ధిపరచితే, ఉపాధి అవకాశాలు పెరుగుతాయి, ప్రజల కొనుగోలు శక్తి పెరుగుతుంది. అయినా, వ్యవసాయ రంగం పరిస్థితి దయనీయంగా ఉంది. వ్యవసాయంలో శ్రమ, సమయం, సంపదల పెట్టుబడి హెచ్చు. ఆదాయం తక్కువ. ఫలితంగా- రైతులు రుణ భారంతో క్రుంగిపోతున్నారు. ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు.

వ్యవసాయ రంగం దిగజారిపోతూ ఉండడానికి మొదటి కారణం వ్యవసాయం వర్షాధారం కావడం. మన వర్షపు నీటిలో 75 శాతం నేటికీ నిరుపయోగంగా సముద్రంలోకి పోతోంది. కనుక- వర్షపు నీటిని నిలువ చేయడానికై స్థానిక చెరువులను పునరుద్ధరించాలి. నదుల అనుసంధానానికై భగీరథ కృషి జరగాలి. రాష్ట్రాల మధ్య జల వివాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి.

వ్యవసాయ రంగంలో వైవిధ్యం తేవడం కూడ అవసరం. పండ్ల తోటలు, పువ్వుల ఉత్పత్తి, పాల ఉత్పత్తి, పప్పు ధాన్యాల ఉత్పత్తి పెరగాలి.

ప్రతి రాష్ట్రంలో ఏదో ఒక ప్రకృతి వనరు అధికంగా ఉన్నది. ఈశాన్య రాష్ట్రాలలో తేయాకు, వెదురు, చేనేత మున్నగువాటి అభివృద్ధికి అవకాశాలు హెచ్చుగా ఉన్నాయి. అలాగే, ఉత్తరాంచల్‌లో వెదురు, తేయాకు, మసాలాలు, వన మూలికలు, ఫల పుష్పాలు మున్నగు వాటికి సంబంధించిన పరిశ్రమలను అభివృద్ధిపరచాలి. ఉత్తరాంచల్‌లోని 1800 వనమూలికలు ఔషధాల తయారీలో ఉపాధి కల్పిస్తాయి.

అలాగే, దక్షిణాది రాష్ట్రాలలో కొబ్బరి, మసాలా మున్నగువాటికి ఎన్నో అవకాశాలు ఉన్నాయి. పువ్వుల పెంపకంలో కర్ణాటక, తమిళనాడు, పశ్చిమ బెంగాల్, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, హర్యానాలకు ప్రముఖ స్థానం ఉంది.

దేశంలోని వివిధ రాష్ట్రాలలో పట్టు పురుగుల పెంపకం, తేనెటీగల పెంపకం వంటివి ఉపాధి కల్పిస్తాయి. ఖాదీ, గ్రామీణ పరిశ్రమలు కూడ ఉపాధి అవకాశాలను పెంచుతాయి. ఛత్తీస్‌గఢ్ మున్నగు రాష్ట్రాలలో అటవీ ఉత్పత్తులు ఆధారంగా అనేక పరిశ్రమలను స్థాపించవచ్చు.

దేశంలో వనరుల కొరత లేదు. వాటి సద్వినియోగమే కొరవడుతోంది. మొదట మన వనరులను గుర్తించాలి. పంటలను నమోదు చేయాలి. వ్యవసాయ దిగుబడిని పెంచడానికై నిపుణుల మార్గదర్శనాన్ని పొందాలి. పెట్టుబడులను సమకూర్చాలి. మార్కెట్ల పరిశోధన, సర్వే, మార్కెటింగ్ సమాచార నెట్‌వర్క్, ఎడ్వర్టైజింగ్ మెలకువలు- అన్నింటిపై దృష్టి పెట్టాలి.

వనరుల సద్వినియోగం కోసమై కొవ్వొత్తులు, అగరు వత్తులు, ఆట వస్తువులు, గృహోపకరణాలు మున్నగువాటి ఉత్పత్తి జరగాలి. వీటి ద్వారా స్వావలంబనకు కృషి జరగాలి. ఇందువల్ల నిరుద్యోగం తొలగిపోతుంది.

అయితే- దేశంలోని గ్రామీణ ప్రజలు, యువజనులు తమ శ్రమనూ, సమయాన్నీ, ప్రతిభనూ ఈ నిర్మాణాత్మక కృషిలో వినియోగించినపుడే ఇదంతా సాధ్యపడుతుంది. శ్రమ, విద్య, సమయములను పథకం ప్రకారం వినియోగించడం అవసరం.

★★★

**శాంతిని కోరుకునేవాడు తన చూపును తన లోపలికి మళ్లించాలి.**

ఆచరణలో అధ్యాత్మ

# ఉద్రేకం కాదు - సమన్వయం

ఎవరు ఎంత సహనశీలురు, ఎవరు ఎంత అసహనపరులు అనేది ఎవరు బలవంతులు, ఎవరు బలహీనులు అనే పరీక్షకు గీటురాయి కావాలి. కొద్ది వ్యతిరేకత ఎదురుకాగానే ఉద్రేకపడిపోయేవాడు, భయపడి వణకిపోయేవాడు బలహీనుడు. గాలికి ఎగిరిపోయే గడ్డిపరకలా-గాలి ఎటు వీచితే అటు మళ్లేవాడూ, తాకిడికి తట్టుకుని నిలువలేనివాడూ దయనీయమైన అంతఃచేతన కలిగినవాడు.

భారీ వస్తువులూ, బరువైన వస్తువులూ హెచ్చు ధర పలుకుతాయి, హెచ్చు కాలం మన్నుతాయి. ఆటంకాలను తట్టుకుని, అవి తమ దారిలో, తమ దిశలో సక్రమంగా పయనిస్తూ ఉంటాయి. రైలుబండీ, విమానమూ గాలి ఎటు వీచితే అటు సాగుతూ ఉంటే - వాటిలో కూర్చున్నవారి పని దైవాధీనమే.

ఒక్కొక మనిషికి ఒక్కొక ఆకారం ఉంటుంది, ఒక్కొక్క స్వభావం ఉంటుంది. ప్రతి మనిషి మనస్తత్వమూ ఒకేలా ఉండదు. ప్రతి మనిషి ఆలోచనా విధానమూ వేరుగా ఉంటుంది. ప్రతి మనిషి నిర్ణయించే విధానమూ వేరుగా ఉంటుంది. ఈ మానసిక స్థాయి జన్మ జన్మంతరాల సంస్కారాలపై, స్థాయిలపై ఆధారపడి ఉంటుంది. దానిలో సంస్కరణ జరుగుతుంది, మార్పు జరుగుతుంది. అయినా-ప్రతి వ్యక్తికీ దూరదృష్టీ, వివేకమూ ఉంటాయని చెప్పలేము. మనుషుల ఆలోచనా విధానాలూ, అభిరుచులూ, స్వభావాలూ, మనస్తత్వాలూ ఒకేవిధంగా ఉంటాయని చెప్పలేము. ప్రకృతి ప్రదానం చేసిన ఈ భిన్నతను, ఈ వైవిధ్యాన్ని మనం గుర్తించాలి. సమన్వయశీలతతో, సహనశీలతతో కూడిన విధానాన్ని అవలంబించి, సాధ్యమైనంతవరకు వీలైనంత హెచ్చు సమన్వయాన్ని సాధించగలగడంలోనే పాక్షిక సాఫల్యం అందుతుంది. పని జరుపుకునే ఆ మార్గం ఆధారంగానే జీవితంలో ముందడుగు వేయగలుగుతాము.

అందరూ మన ఆకారంలోకి, మన స్వభావంలోకి మారాలని అనుకోవడం నిరర్థకం. కుటుంబంలో, ఇరుగుపొరుగులో మన నియంత్రణయే, మన క్రమశిక్షణయే, మన సలహాయే శిరోధార్యం కావాలని ఆశించడం అహంకారాన్ని సూచిస్తుంది. మనం ఇతరులకు శ్రేయోభిలాషులము కావచ్చు, సలహాదారులము కావచ్చు. వారిని శ్రేష్ఠ మార్గంలో నడిపించడానికై మనం విజ్ఞతతో నిరంతరం ప్రయత్నించవచ్చు. మన పరిధి అంతవరకే. ఈ పరిధిలోపల ఉన్నపుడే మన పెద్దమనిషితరహా చెక్కుచెదరకుండా నిలుస్తుంది. ఆ పరిధిని దాటి, ఇతరులను ఒప్పించడానికై ఒత్తిడి తెస్తే, జబర్దస్తీ చేస్తే-అది మనిషి పరిధులను అతిక్రమించడం అవుతుంది. అవతలి వ్యక్తి ఆ ఆక్రమణను అడ్డుకోవడం ఆత్మరక్షణ దృష్ట్యా సరైన పనే. అయితే- తన అనుచరునిగా మారమని అవతలి వ్యక్తిని బలవంతపెట్టడం మానవ హక్కుల అపహరణతో సమానమే.

క్రోధానికీ, ఉద్రేకానికీ అర్థం ఏమంటే - మన ఇష్టా నిష్టాలకు అనుగుణంగా ఆలోచించాలనీ, పని చేయాలనీ ఇతరులను బలవంతపెట్టడం మన ఉద్దేశ్యమని. సున్నితమైన భావాలను వ్యక్తపరచడం, శ్రేయోభిలాషిగా సౌమ్యంగా, మృదువుగా సలహా ఇవ్వడం సముచితం. మనుషులందరూ మనలా ఆలోచించడం సాధ్యపడదు. ప్రతి పరిస్థితీ మనకు నచ్చడం సాధ్యపడదు. అలాంటి స్థితిలో సహనగుణాన్నే చూపవలసివస్తుంది. సమన్వయం సాధ్యపడకపోతే- ఆ పరిస్థితుల నుండి తప్పుకునే విధానాన్ని కాని, ఆ పరిస్థితులను తప్పించే విధానాన్ని కాని అవలంబించవచ్చు. కానీ, నిరంతర ఘర్షణవల్ల ప్రయోజనం ఉండదు. సంస్కరణ మన ఇష్టానిష్టాలకు అనుగుణంగా జరగడం సాధ్యపడకపోతే- దాన్ని దురదృష్టంగా పరిగణించడం, విసిగివేసారిపోవడం, సంయమనాన్ని కోల్పోవడం నిరర్థకమైన పనులు.

వ్యక్తుల, పరిస్థితుల వ్యతిరేకతను చూచి మనం ఉద్రేకపడకూడదు. కోపగించుకోవడం, హతాశుడు కావడం-రెండూ మనిషిలోని ఆంతరిక బలహీనతకు గుర్తులు. పరిస్థితులను ధైర్యంగా, సముచితంగా సంబాళించాలి. సాఫల్యం తప్పనిసరి అని భావించకుండా- మన ప్రయత్నం, కర్తవ్యం అనే పరిధిలో సంతృప్తిని అనుభవించాలి.

★★★

**హక్కులను మరచిపో, కర్తవ్యాలను గుర్తుంచుకో.**

శ్రావణ పౌర్ణమి వ్యాసం

# ఋషిత్వాన్ని పెంపొందించే పావన పర్వం

భూమి నిండా పరుచుకున్న పచ్చదనం. ఆకాశంలో పరుచుకున్న మబ్బుల గుంపులు. వీటి మధ్య శ్రావణ పౌర్ణమి సంస్కారాల, సంకల్పాల వెన్నెలను వెదజల్లుతోంది. భూమికీ, సూర్యునికీ మధ్య గల ఖగోళ సంబంధం, భూమిపై ప్రసరించే అనుగ్రహంయొక్క ప్రభావం శ్రావణ మాసానికి ఒక ప్రత్యేకతను సంతరిస్తాయి. శ్రావణ మాసం ప్రకృతి మొత్తాన్ని సంపూర్ణం చేస్తుంది. సమృద్ధం చేస్తుంది. బాహ్య ప్రకృతి, పర్యావరణం ఈ నెలలో విశేషమైన సంతులనాన్నీ, సమృద్ధినీ పొందుతాయి. మనిషిలోని ఆంతరంగిక ప్రకృతిలో కూడ సమృద్ధి, సౌందర్యం ఈ నెలలో మరింతగా వెల్లి విరుస్తాయి. కనుకనే- అధ్యాత్మవేత్తలు ఈ నెలలో అనేక ధార్మిక అనుష్ఠానాలను నిర్వహించాలని సూచించారు.

ఆధ్యాత్మిక జీవన సరళిని అనుసరించడంవల్ల ఈ నెలలోని ప్రతి క్షణం సాధకులను సంస్కారాలతో, సంకల్పాలతో నింపుతుంది. ఈ సంస్కారాలు ఎంత బలీయంగా ఉన్నాయి, ఈ సంకల్ప శక్తి ఎంతగా పెరిగింది-అనే పరీక్ష జరుగుతుంది శ్రావణ పౌర్ణమి పర్వదినాన. సంవత్సరం అంతటిలో అనుసరించే ఆధ్యాత్మిక అనుశాసనాలమధ్య సమన్వయం సాధించబడుతుంది ఈ రోజున. మహా సంకల్పాలు తీసుకోబడతాయి ఈ రోజున. ఆంతరిక చేతనలో శుభ సంస్కారాల కొత్త మొక్కలు నాటబడతాయి ఈ రోజున.

వ్యక్తిత్వంలో ఋషిత్వాన్ని వికసింపజేసే తత్వాలు- సంస్కారాలూ, సంకల్పాలూ. ఋషి జీవన విధానానికి మూల సూత్రాలు ఈ రెండూ. ఋషిత్వం లోపించడమే ఈనాటి పెక్కు విషమ సమస్యలకు ప్రధాన కారణం అవుతోంది. మానసిక రోగాల పెరుగుదల, పర్యావరణ సంక్షోభం, కొరతలు, వైఫల్యాలు-అన్నీ సంస్కారాల, సంకల్పాల ప్రాముఖ్యాన్ని విస్మరించడంవల్ల దాపురించినవే.

ఈనాడు బహుళ ప్రచారం పొందుతూన్న "ఆర్ట్ ఆఫ్ లివింగ్" (జీవించే కళ) సిద్ధాంతానికి ప్రాతిపదిక ఋషిత్వంలోని కర్తవ్య సూత్రమే. మనం ఈ మహత్తర వారసత్వాన్ని నేడు విస్మరించడం వేరే విషయం. మరోప్రక్క విజ్ఞానవేత్తలూ, సమాజ శాస్త్ర నిపుణులూ, మనస్తత్వవేత్తలూ సంస్కారాల, సంకల్పాల ప్రాముఖ్యాన్ని ఎలుగెత్తి చాటుతున్నారు.

సంస్కారాలు మన వ్యక్తిత్వంలో అద్భుత పరివర్తనను తీసుకువస్తాయి. వ్యక్తిత్వంలోని నిగూఢమైన, గుప్తమైన శక్తులు పెక్కింటిని సంస్కారాలు మేలుకొలుపుతాయి. ఈ శక్తులు సక్రమంగా వ్యక్తం కావడానికి మాధ్యమం సంకల్పం. మనిషి జీవితంలోని ఏ మలుపులో సంస్కారాలను జరిపినా- జీవితం కల్పవృక్షం అవుతుంది. బాల్యంనుండి ఋషి జీవన సూత్రాలకు అనుగుణంగా మలచబడిన వ్యక్తి పొందే అదృష్టం గురించి చెప్పేది ఏముంది? ఈ అదృష్టాన్ని ప్రదానం చేసే పావన పర్వం శ్రావణ పౌర్ణమి.

యజ్ఞోపవీతాన్ని మార్చుకోవడం, ప్రాయశ్చిత్తంగా హేమాద్రి సంకల్పం ఈ పర్వంలో అంతర్భాగాలు. ఈ పనులు రెండింటిలో సంస్కారవంతమూ, వ్రతశీలమూ, సంకల్పపూరితమూ అయిన జీవనానికి మూలసూత్రం ఇమిడి ఉంది. తప సాధనలో, వ్రత నిర్వహణలో మనం గత ఏడాది గడిపి ఉంటే- ఈ సంవత్సరం వాటికి కొత్త

**ఆత్మ సంతృప్తియే స్వర్గం.**

ప్రక్రియలను జోడించాలి, వీటిని మరింత శ్రద్ధగా, మరింత నిష్ఠతో నిర్వహించాలి. ఏ కారణంవల్ల అయినా గత ఏడాది అనుష్ఠానాలను సక్రమంగా నిర్వహించలేకపోతే - ఈ ఏడాది వాటిని ఉత్తమంగా నిర్వహిస్తామని సంకల్పం చేయాలి; మొక్కపోని విశ్వాసంతో, ప్రగాఢమైన నిష్ఠతో ఋషి జీవన మార్గంలో పురోగమించాలి.

శ్రావణ పౌర్ణమి సంస్కృతి రక్షణకు సంకల్పం చేసే పర్వ దినం; మహిళా జీవన మహిమనూ, గరిమనూ ప్రబోధించే పర్వ దినం. భోగవాదం ప్రబలిఉన్న ఈ రోజులలో మహిళకూడ ఒక భోగ వస్తువుగా, భోగ సాధనంగా మిగిలిపోయింది. కుత్సితమైన దృష్టి, కలుషితమైన భావాలు మహిళ మహిమను బ్రాండ్ వస్తువుగా చేసి వద్దిస్తున్నాయి. సంస్కారం, సంవేదన కాక- రూపం, సౌందర్యం మహిళకు అర్థం చెపుతున్నాయి. ఈ వికృతిని నిర్మూలించాలనే సందేశాన్ని ఇస్తోంది శ్రావణ పౌర్ణమి రోజున జరిగే రక్షాబంధన్ ఉత్సవం.

యువతీ యువకులలో జనిస్తూన్న కలుషిత దృష్టిని సోదరీ సోదరుల పవిత్ర బాంధవ్యమే క్షాళన చేయగలుగుతుంది. యువ శక్తి మహిళను గౌరవించాలి. మహిళ సంరక్షణలో, మహిళ వికాసంలో తన సహకారాన్ని అందించాలి. సోదరీమణులు ఈ విశ్వాసంతోనే సోదరుల చేతులకు రక్ష కడతారు. రక్షా సంకల్పాన్ని నింపుకున్న ఈ సూత్రాలు మన మాతృభూమి చరిత్రలో ఎన్నో పుటలను లిఖించాయి. మహారాణి కర్మవతి-సమ్రాట్ హుమాయూన్‌ల గాథ, మహారాణి ద్రౌపది-యోగేశ్వరుడు శ్రీకృష్ణుల మధ్య గల పవిత్ర భావన - ఇలా ఎన్నెన్నో అద్భుత ఘట్టాలు మన చరిత్రలో, పురాణాలలో నిండి ఉన్నాయి.

శ్రావణ పౌర్ణమి ప్రాధాన్యం నేడు మరింతగా పెరిగింది. ఎందుకంటే - వైజ్ఞానిక సమృద్ధి యుగంలో, సాంకేతిక అభివృద్ధి యుగంలో మనిషి జీవనం నీరసించిపోతోంది, శుష్కించిపోతోంది. ఈ స్థితిలో ఋషి జీవన విధానాన్ని తిరిగి నిర్మించవలసిన అవసరం ఎంతయినా ఉంది. వ్యక్తిత్వం వికసించాలి; సమాజం సంస్కార సంపన్నం కావాలి; పర్యావరణం సమృద్ధం కావాలి; మహిళా జీవన పవిత్రత సురక్షితం కావాలి - ఈ సందేశాలన్నీ శ్రావణ పౌర్ణమి పావన పర్వంలో ధ్వనిస్తున్నాయి. ఈ పండుగను జరుపుకోవడం అంటే ఈ సందేశాలను జీర్ణించుకోవడం. అలా జీర్ణించుకున్నప్పుడే మనం ఋషి జీవన మార్గంలో పురోగమించ గలుగుతాము.

★★★

## పెద్దల పట్ల గౌరవం

*1971 నాటి సంగతి. శ్రీగురూజీ (శ్రీగోళ్వల్కర్) ఇండోరు వచ్చారు. ఒక కార్యకర్త వారింటికి భోజనానికి ఆహ్వానించాడు. వారు వెళ్లారు. మొదటి అంతస్థులో బైఠక్ జరిగింది. రెండవ అంతస్థులో వంట. మూడవ అంతస్థులో భోజన వ్యవస్థ. అత్యంత ఆనందదాయకమయిన వాతావరణంలో భోజన కార్యక్రమం ముగిసింది. తిరిగివెళ్లేటప్పుడు క్రిందికి దిగిన తరువాత శ్రీగురూజీకి ఆ కార్యకర్త తల్లిగారికి నమస్కరించి రాలేదని గుర్తువచ్చింది. కార్యకర్త చెప్పాడు-'నేను ఇక్కడికే పిలుచుకొని వస్తాను, ఉండండి.'*

*శ్రీగురూజీ అందుకు అంగీకరించలేదు. ఆయన ఇలా చెప్పారు-'అరే, నమస్కరించవలసిన వారిని ఇక్కడికి పిలిపించి నమస్కరించడం వివేకం అవుతుందా?' ఇలా చెబుతూ వారే స్వయంగా త్వరితగతిని మూడవ అంతస్థుకు ఎక్కివెళ్లి ఆ మాతృమూర్తికి ప్రణామం చేసి వచ్చారు.*

**మానవత్వానికి మరోపేరు సజ్జనత్వం.**

# వర్ణాశ్రమ ధర్మం అపురూపం, నిరుపమానం

భారతీయ సంస్కృతి మనుష్యమాత్రులనేగాక జగత్తులోని సమస్త ప్రాణులను, బ్రహ్మాండమంతటినీ భగవంతుని యొక్క విరాట్‌రూపంగా భావిస్తుంది. పరమాత్మయొక్క ఈ విరాట్ రూపంలో విశ్వములోని సమస్త జీవ జంతువులు, స్థావర జంగమములు ఆత్మరూపంలో ఉన్నాయి. జీవితాంతం అందరిలో ఈ భావన నిశ్చలంగా ఉండడానికై అందరిలో వారివారి యోగ్యతలకు సమర్థతలకు అనుగుణంగా వివిధ కర్తవ్యాలు ఏర్పాటు చేయబడినాయి. కర్తవ్యాలలో తేడాలున్నా, ప్రేరణ అన్నింటికీ సమానమే. వాటికి కావలసిన నిష్ఠ, ఉద్దేశ్యములు సమానములే. ఆ ఉద్దేశ్యాన్నే "అధ్యాత్మ" అంటారు. ఈ అధ్యాత్మ ఎవరో నెత్తిన పెట్టిన బరువు కాదు. ఇది ప్రకృతి సిద్ధమైనది, స్వాభావికమైనది.

పరతత్వానికి రెండు భాగాలున్నాయి. ఒకటి అంతఃచైతన్యము, రెండవది బాహ్యాంగం. బాహ్యాంగానికి చెందిన అన్ని అవయవాలు తమ తమ పనుల దృష్ట్యా స్వతంత్ర సత్తా కలిగి ఉంటాయి. అవి చేయవలసిన పనులు ఉపయోగాన్ని బట్టి వేరువేరుగానే ఉంటాయి. ఐతే ఇవన్నీ ఆ విరాట్ లేక ప్రధాన అంగాలను కాపాడడానికే, దానిలోని చైతన్యాన్ని నిలపడానికే. ఈవిధంగా వేరు వేరయినా, వేరు వేరు పనులు కలవైనా, ఒకే చైతన్యము కోసమే అవన్నీ పనిచేయడం జరుగుతోంది. అందుకే హిందూ సంస్కృతికి ధర్మాన్ని జోడించడం జరిగింది. ఆ జోడింపు కూడా విడదీయడానికి వీలు లేని జోడింపు . ధర్మ, సంస్కృతులు రెండూ ఒకే అర్థంగల పదాలుగా కనబడతాయి.

## హిందూ ధర్మం మానవ ధర్మమే

'ధర్మము' అన్న మాటయొక్క వ్యుత్పత్తిని బట్టియే అది విస్తృతమైన లేక విరాట్‌కు సంబంధించిన ఏకాత్మ భావమని స్పష్టంగా తెలుస్తుంది. ఏది నిజమైనదో సత్యమైనదో దానిని పొందగోరడమే ధర్మము. అది వాస్తవమైనది, నిత్యమైనది. చైతన్యమయినది, నశించనిది, శాశ్వతమైనది. అన్ని ధర్మాలలోను ఆత్మయొక్క నిశ్చలత్వ శాశ్వతత్వాలు అంగీకరింపబడ్డాయి. కానీ అంగాంగాలలో వైవిధ్యం కనబడినా, వాటిలో ఏకత్వము కలదని గమనించి ఆ ఏకత్వాన్ని కాపాడుకోవడంపై దృష్టి పెట్టినందువల్ల వివిధ సంప్రదాయాల సృష్టి జరిగింది. హిందూ ధర్మంలో ఈ ఏకతను నిలిపిఉంచుకోవడానికి, జాగృతంగా ఉంచడానికి సంబంధించిన ప్రవృత్తి నేటికీ స్థిరమైఉన్నది. ప్రపంచంలో అనేక సంప్రదాయాలు, మతాలు సృష్టింపబడ్డాయి. కానీ నేడు వాటి పేర్లు మాత్రమే మిగిలిఉన్నాయి. హిందూ ధర్మం మాత్రమే తన విశాలత్వంతో జీవించిఉన్నది. హిందూ ధర్మమన్నది నిజానికి మానవ ధర్మం. మానవ సత్తా దేని వల్ల స్థిరముగా ఉంటుందో, దేనివల్ల అది విశ్వ చైతన్యానికి గొప్ప అంగం కాగలుగుతుందో-దానిని ఆదేశించేది హిందూ ధర్మం.

హిందూ ధర్మానికి గల అనేక విశిష్టతలలో దానిలోని ఉపాసనా పద్ధతి ఎంతో గొప్పది. విశ్వాత్మను ఉపాసించడానికి దానిలో ఒకానొక సమయమంటూ నిర్దేశించబడలేదు. ఉపాసనకు దేశ కాల విభజన లేదు. దానికి ప్రతి క్షణమూ ఉపాసనామయమే. వారు తమ విశ్వచైతన్యాన్ని ఒక్క క్షణం కూడా మరువరు. తమ వ్యవహారంలోని ప్రతిభాగాన్ని ఆ చైతన్యదేవునికే సమర్పించదలుస్తారు.

## వర్ణాశ్రమ ధర్మ విశిష్టత

ఉపాసన దృష్ట్యా విరాట్ పురుషుడు నాలుగు భాగాలుగా విడిబడినవాడయి ఉంటాడు. ఆ నాలుగు భాగాలూ రెండు కోణాలకు చెందినవి. హిందూ సంస్కృతిలో ఇవి వర్ణాశ్రమధర్మములన్న పేరుతో పిలువబడతాయి. బ్రహ్మాండమంతటిలో వర్ణధర్మం, ఆశ్రమధర్మం కనబడతాయి. ఐతే హిందూ సంస్కృతి వాటిని వేరువేరుగా ఉంచడాన్ని కోరుకోదు. దాని దృష్టిలో ఆ రెండూ తమ కార్యకలాపాల ద్వారా విరాట్ పురుష రక్షణకు పూనుకోవాలి. వేరే మాటల్లో చెప్పాలంటే-అవి విశ్వ చైతన్యంయొక్క సామంజస్యాన్ని స్థాపించడానికి వినియోగపడాలి. ఇతర సంస్కృతులకు గాని మతాలకు గాని చెందిన కార్యకలాపాలు విరాట్ పురుషునికి సంబంధించినవి కావు. అవి ఏదో ఒక భాగానికే పరిమితాలు ఐతే శరీరంలోని ఏదో ఒక అంగాన్ని గురించి మాత్రమే శ్రద్ధవహిస్తే, శరీరమంతటికీ రక్షణ కలుగదన్న విషయాన్ని విజ్ఞులందరూ అంగీకరిస్తారు. కనుక ఎవడైతే చైతన్యాన్ని మరిచి, ఏదో ఒక అంగాన్ని మాత్రమే ప్రధానమని భావిస్తాడో అతనికీ మాలో అంగాన్నే ప్రధానమని భావించే మరొకరికీ మధ్య విభేదా లేర్పడతాయి. వారు ఒకరికొకరు విరోధు లవుతారు. చివరకు వారిద్దరూ తమ శక్తిని పోగొట్టుకుంటారు.

**కోరికల నిషాలో వివేకం నశిస్తుంది.**

## బ్రహ్మలో చరించడం - బ్రహ్మచర్యం

ఇందుకే హిందూ సంస్కృతిలో ఈ విరోధాల నుంచి తప్పించుకోవడానికి జీవితారంభంలోనే ప్రతి ఒక్కనికీ తన స్వరూపంపై ధ్యానం నిలపాలని ఆదేశ మీయబడింది. చిన్మయ సత్తాతోను, విరాట్ తత్త్వంతోను వ్యక్తిని జోడించే ఈ ప్రక్రియ పేరు బ్రహ్మచర్యాశ్రమం. 'బ్రహ్మచర్యాశ్రమము' అన్న మాటలోనే వ్యక్తి బ్రహ్మలో లేక విరాట్ పురుషునిలో లేక విశ్వాత్మలో చరించడము అని, తనను బ్రహ్మకు సమర్పించుకోవడమని అర్థం. ధ్వనిస్తుంది. బ్రాహ్మణ, క్షత్రియ వైశ్య, శూద్రులన్న పేర్లతో పిలువబడే నాలుగు వర్ణములు, వాటిలో గల తేడా ఆవర్ణముల కార్య క్షమతను బట్టి ఏర్పడిన తేడాలు. చివరకు అవి దానిలోనే కలిసిపోతాయి. బ్రహ్మచర్యాశ్రమం ఈ నాలుగు వర్ణాలకు బ్రహ్మలో చరించే విద్యను నేర్పుతుంది.

శరీరంలోని ముఖము, బాహువులు, ఊరువులు, పాదాలు చేసే పనులు కేవలం తమకోసం చేయవు . మొత్తము శరీరం కోసం చేస్తాయి. అదేవిధంగా బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులు చేసే పనులు తమకోసం కాక విరాట్ పురుషునికోసం. ఈ దృష్టిని చివరి వరకూ నిలిపి ఉంచడానికి అవసరమైన శిక్షణ బ్రహ్మచర్యాశ్రమంలో ఇవ్వబడుతుంది.

ఆ తరువాత రెండవ స్థితి వస్తుంది. అది గృహస్థాశ్రమం ఇది కర్మప్రధానమైనది. తాను పొందిన జ్ఞానాన్ని జీవనంలో ఆచరించి చూపుకోవాలి. ఆ జ్ఞానం యొక్క క్రియాత్మకరూపం గృహస్థాశ్రమంతో ప్రారంభమౌతుంది. వానప్రస్థంలో అది పెరుగుతుంది. సన్యాసంలో అది పండుతుంది.

శరీరంలోనే ఉంటూ, శరీర రక్షణ కొరకే తమ ఉనికి ని తమ రక్షణను నిలుపుకుంటూ ఆ శరీరంకోసమే తమను సమర్పించుకునే పని శరీరావయవాల పని. అదేవిధంగా విశ్వాత్మకోసం తమ ఉనికిని నిలుపుకుంటూ పనిచేస్తూ చివరకు తమను తాము సమర్పించుకోవడమే వర్ణధర్మం యొక్క లక్ష్యం. చైతన్య శక్తిని ఒక్కక్షణం కూడా మరువనీయని హిందూ సంస్కృతి నిరంతరమూ ఆత్మవైపునకే అభిముఖమై ఉంటుంది. ఆవిధంగా ఉండడమే హిందూ సంస్కృతీ రక్షణకు సాధనం.

హిందూ ధర్మానికి ప్రధానమైనది అధ్యాత్మ ఆధ్మాత్మిక జీవనం దాని ప్రాణం. అధ్యాత్మ ప్రాప్తికోసం త్యాగం ఒక్కటే ప్రధానం కాదు. దానితోబాటు పూర్తి శక్తి కావాలి. ఆ రెంటివల్లనే ఆధ్యాత్మిక జీవనం కొనసాగుతుంది. కర్మ నాచరించడము, దానిని దివ్య చైతన్యంతో జోడించడమే యజ్ఞమయ జీవనం. ఈ జ్ఞానం ఆధారంగాగల సంస్కృతి, ఆ సంస్కృతి గౌరవించే జాతి అమరంగా నిలుస్తాయి. హిందూ జాతి ఎప్పుడూ ధనం వెనుక పరుగులుతీయలేదు. ఐశ్వర్యం, కీర్తి ప్రతిష్ఠలు, ధనం మొదలైనవి అన్నీ దానికి అత్యధికంగానే లభించాయి. ఈ ధన సంపదలు ఇతర దేశాలకన్న దీనికి ఎక్కువగానే ఉండేవి. కానీ భారతీయ సంస్కృతికి అర్థ లాభాలు, ధన విలాసాలు ఏనాడూ ఆధారాలుగా లేవు. యుగ యుగాలుగా భారతదేశం శక్తివంతమైన దేశంగా విలసిల్లింది. ఐనా శక్తి మాత్రమే దానికి ఎప్పుడూ ఆదర్శం కాలేదు. తన శక్తి నెప్పుడూ అది దురుపయోగం చేయలేదు. సామ్రాజ్యాన్ని విస్తరింప జేసుకోవడం, ఇతరులను అణిచివేయడం, హింస, హత్యలు, పదవిపై కాంక్ష వంటివాటికెప్పుడూ పాలుబడలేదు, లోబడలేదు. ధనం, పశుబలం దాని కెప్పుడూ ప్రేరకశక్తులు కాలేదు కాలేకపోయాయి.

ఈ సంస్కృతి ఒక్కటే జీవితంలో అత్యాశను ఎవరిలోనూ రేకెత్తించని సంస్కృతి. బాహ్యమైన తళుకు బెళుకుల మీద దాని కెప్పుడూ విశ్వాసం లేదు. ఈ ప్రాపంచిక జీవనం సత్యం కాదు. పరమాత్మ మాత్రమే సత్యం. మన లోపలగలది సాక్షాత్తూ ఈశ్వర స్వరూపమైన ఆత్మ. నిజమైన ఉన్నతి ఆత్మోన్నతియే ఈ ఉన్నతి వైపునకే మన ప్రవృత్తి కొనసాగాలి. దీనిలోనే మన సుఖ, దుఃఖా లుండాలి. ఇదే మన లక్ష్యం. భారతదేశం తన గత చరిత్రలో తన సంస్కృతికి, తన ధర్మానికి, తన ఉన్నత ఆదర్శాలకు ప్రథమ స్థాన మివ్వడం జరిగింది. హిందువు యొక్క ఆహారం ధార్మికం. నీళ్లు త్రాగడం ధార్మికం. నిద్రించడం ధార్మికం. వేషభాషలు ధార్మికాలు. అతని పెండ్లి, పేరంటాలు ధార్మికాలు. మరణం మొదలైనవన్నీ ధార్మికాలు. వీటిఅన్నింటి వెనుక పరమాత్మ, ఆత్మ, ధర్మాల ప్రేరణ కలదని అర్థం. ఇదే ఈ జాతి, ఈ దేశం సజీవంగా నిలబడడానికి ఒకే ఒక కారణం.

★★★

**మహనీయుని లక్షణం-సాదా జీవనం, ఉన్నత ఆలోచన.**

ధారావాహిక : ప్రగతికి ప్రాతిపదిక ఆదర్శ కుటుంబం-7

# కుటుంబ సామరస్యానికి పంచశీల

దుర్భావంతో కూడిన వాతావరణంలో పంచశీల సిద్ధాంతం అంతర్జాతీయ జగత్తులో సఫలం కాకపోయినప్పటికీ, కుటుంబ భావనా జగత్తులో సఫలత పొందుతూ వచ్చింది. కుటుంబపు పంచశీలను అమలు చేస్తే, ఇంట్లో శాంతి ఉంటుంది. పరస్పరం ఆదర భావం కలిగి ఉండాలి. పరస్పరం దోషాలను మాత్రమే చూచి విమర్శించడం అనుచితం. మనుషులందరిలో కొన్ని లోటుపాట్లు ఉంటాయి. తప్పులు చేయటం మనుష్యుని స్వభావం. ప్రతి వ్యక్తీ తన ఇంట్లో సభ్యుడు కావటం వలన అతనికి కూడా ఆ ఇంటిపై అధికారం ఉంటుంది. అభిరుచి వేరైనా అతని అభిప్రాయం వేరైనా, అతనిని నిరాదరణగా చూడవలసిన అవసరం లేదు. అందరి అభిప్రాయాలు ఒక్కటే అవటం సాధ్యం కాదు.

కటువైన మాట విషం కంటే ప్రమాదకరమైనది. మీ మాటలో మధురత లేకపోతే జీవితంలో కటుత్వం పెరిగిపోతూ ఉంటుంది. ఇంటిలోని ఒక సభ్యుని చెడు ఆలోచన భరింపశక్యం కాకపోవచ్చు. మీ తీవ్ర ధోరణి ఇతరులను తీవ్రంగా గాయపరచవచ్చు. అప్పుడు ఆ మాట చేసిన గాయాన్ని నయం చేయడం చాలా కష్టం. మనిషి కత్తి గాయానికి భయపడడు. అతడు దాన్ని నవ్వుతూ నవ్వుతూ సహించగలుగుతాడు. కాని నోటి మాట ద్వారా అయిన గాయం హృదయాన్ని గాయపరుస్తుంది. జీవితాంతం ప్రయత్నించినా ఆ గాయం మానదు.

## తప్పును ఒప్పుకోవడం

ఘర్షణ వచ్చే దుస్థితి రాకుండా మనం జాగ్రత్త పడాలి. వివాదానికి కారణమయ్యే మాటలను మనం ప్రయోగించరాదు. రాబోయే పోట్లాటను శాంతియుతంగా నివారించడమే విజ్ఞత. తాను చేసిన తప్పును వెంటనే ఒప్పుకోవాలి. ఈ నిష్కల్మషత్వం యొక్క, ఈ ఆదర్శ మనస్తత్వం యొక్క ప్రభావం ఇతరులపై తప్పకుండా పడుతుంది. మీరు తప్పుచేసి దాన్ని ఒప్పుకొనకపోతే ఇతరులు దాన్ని నిరసిస్తారు. క్షమకు బదులు మనస్సులో భ్రమ అలాగే మిగిలిపోతుంది.

తగాదా వస్తే ఒక మధ్యే మార్గాన్ని అవలంబించాలి. తరువాత అలాంటి పరిస్థితులు రాకుండా, సమస్య మరింత జటిలం కాకుండా జాగ్రత్త పడాలి. తగాదా త్వరగా అంతం కాకపోతే అది మెల్ల మెల్లగా భీషణ రూపం ధరిస్తుంది. అప్పుడు దానికి సమాధానం వెదకటం చాలా కష్టం అవుతుంది.

## అనవసర జోక్యం తగదు

ఆలోచనలు వేరు వేరుగా ఉండవచ్చు. మీ ఇంటిలోని ఒక సభ్యుని ఆలోచనలు మీ ఆలోచనలతో కలవకపోతే, అతడు తన కిష్టంవచ్చిన మార్గంలో తనకిష్టంవచ్చిన రీతిలో పనిచేస్తూఉంటే – అతని మార్గాన్ని ఆటంకపరచవద్దు. ఉదాహరణకు మీరు రాముని ఉపాసకులు. మీ పుత్రుడు శివభక్తుడు. అతడు రాముని నమ్మడు. అతనిని తన ఇష్టం వచ్చినట్లు చేయనివ్వండి. మీరు ఒక రాజకీయ పక్షానికి సభ్యులు. మీ పుత్రుడు మరో రాజకీయ పక్షానికి సభ్యుడు అవుతాడు. అప్పుడు కోపించకండి. మీరు అతని ఆలోచన పట్ల ఉదారంగా ఉంటే ఏ విధమైన కుటుంబ కలహాలకు అవకాశం ఉండదు.

## పక్షపాతం వల్ల సమస్యలు

ఇంట్లోవారి మధ్య పక్షపాతం చూపించటం తగాదాకు కారణమౌతుంది. మీకు ఇద్దరు కొడుకులు ఉన్నారు. ఒకరికి మంచి భోజనం వస్త్రాలు ఇస్తారు.

**నీ విలువను తెలుసుకో. అందుకు అనుగుణంగా నిన్ను నీవు మలచుకో.**

ఇంకొకరికి కూడా అలాగే ఇవ్వకపోతే ఆ పక్షపాతం తప్పనిసరిగా సమస్యలను సృష్టిస్తుంది. ఆయా పరిస్థితులను బట్టి ఒకరికి ఒక విధమైన సుఖ సౌకర్యాలు మరొకరికి మరో రకమైన సుఖ సౌకర్యాలు కలగచేస్తే అది మీ తప్పు కాదు. ఐనా ఈ పద్ధతి ఒకరికి మనస్తాపం కలిగిస్తే, దాన్ని తొలగించడానికి ప్రయత్నం చేయాలి.

## వివాదాలను నిష్పాక్షికంగా పరిష్కరించాలి

ఏదైనా విషయంలో మిమ్మల్ని మధ్యవర్తిగా పిలిస్తే మీరు ఉన్నదున్నట్లుగా సత్యం మాట్లాడండి. మీకు ఇష్టమైన వాడు అన్యాయం చేసినప్పటికీ అతని ద్వారా అన్యాయం జరిగిందన్న విషయం అందరి ముందు బయటపెట్టండి. ఎవరికైతే హాని కలిగిందో వారి మనస్సును సంతృప్తి పరచండి. మీరు నిష్పక్షపాతంగా వ్యవహరించకపోతే, దాని ద్వారా ఏర్పడే భయంకర పరిణామాన్ని మీరు అనుభవించవలసివస్తుంది.

మీరు అందరి విశ్వాసాన్ని చూరగొనండి. దానితోనే మీకు గౌరవం దొరుకుతుంది. మీరు అందరినీ ఒకే విధంగా చూస్తే, అర్థం చేసుకుంటే కుటుంబ సభ్యులందరూ మీ మాటను ఆనందంగా ఒప్పుకుంటారు. తెలియక మీ ద్వారా ఎప్పుడైనా పొరపాటు జరిగినా దాన్ని వారంతగా పట్టించుకోరు. మీ ప్రతిష్ట కూడా యథాతథంగా ఉంటుంది.

నాలుగు గిన్నెలు ఉన్నాయంటే చప్పుడు అవుతూ ఉంటుంది– అనేది సామెత. ఇంట్లో తగాదాలు పడే పరిస్థితి వచ్చినప్పుడు ఇది మానవ సహజంలే అని భావించి మరో తప్పు చేయకండి. వివాదాలను శాంతపరిచే పద్ధతి ఒకే ఒకటి. అదే త్యాగం. మీరు ఏ కొద్ది త్యాగాన్ని ప్రదర్శించినా, ఆ వివాదం అంతటితో సమాప్త మవుతుంది.

తగాదాలను యుద్ధంలో వలె సవాళ్లుగా భావించవద్దు. ఎదుటి పక్షం వారిని నాశనం చేసే ఆలోచన చేయవద్దు. వివాద కారణమేమిటో తెలుసుకోండి. ఆ కారణాన్ని తొలగించడానికి ప్రయత్నించండి. వివాదం సమసి పోవడానికి, గృహ కలహాలను రూపుమాపటానికి ప్రముఖ సిద్ధాంతం ఇదే. దీన్ని అనుసరించి చూడండి. మీకు సఫలత లభిస్తే దాన్ని గురించి ఇతరులకు కూడా ఉపదేశం చేయండి. మీరు మీ ఇంట్లోనే పంచశీల సూత్రాన్ని సఫలం చేయలేకపోతే, సమాజంలో దాని సఫలతను ఎలా ఆశించగలము.

★★★

## లింకన్ దయాగుణం

*అబ్రహం బాల్యం నుండి దయాస్వభావం కలవాడు. ఎవరైనా కష్టంలో ఉంటే సహించలేకపోయేవాడు. ఒక రోజున లింకన్ తన మిత్రులతో కలిసి తిరిగి ఇంటికి వస్తున్నాడు. త్రోవలో ఒక గుర్రం వస్తోంది. గుర్రం వీపుమీద జీను వుంది. కాని రౌతు లేడు. లింకన్ ఆలోచనలో పడ్డాడు. ' ఈ గుర్రపు రౌతు ఎక్కడ ఉన్నాడు? అతనిని వెతకాలి.' మిత్రులు హెచ్చరించారు– 'గుర్రపు రౌతు ఎవరో త్రాగుబోతు అయిఉంటాడు. త్రాగి ఎక్కడో స్పృహతప్పి పడిపోయి ఉంటాడు. వెంటనే ఇంటికి వెడదాం. చుట్టూ చీకటి క్రమ్ముకొని వస్తోంది, చూడు.'*

*అబ్రహం మిత్రులతో అన్నాడు – 'త్రాగుబోతు అయితే ఏమయింది? సహాయం అవసరమయిన వారికి సహాయం చేయవలసిందే. నేనతని కొరకు వెతుకుతాను.' వెతకటానికి బయలుదేరాడు లింకన్. త్రోవమధ్యలో ఆ వ్యక్తి పడిఉన్నాడు. అతడు నిజంగా త్రాగుబోతే. అబ్రహం అతనిని ఎత్తుకొని ఇంటికి తీసుకొని వచ్చాడు. అతడు ఒక కార్మికుని కుమారుడు. 15 సంవత్సరాల బాలుడు. ఒంటినిండా బురద. నోటినిండా సారాకంపు. అతనిని ఇంటికి తీసుకురాగానే అబ్రహం సోదరికి కోపం వచ్చింది. ఆమె మండిపడింది. – 'ఇతనిని ఇంటికెందుకు తీసికొని వచ్చావు? వీని మంచి చెడ్డలు నీకు ఏమీ తెలియవుకదా!' అతని సోదరి ఇంకా అతనిని నిందిస్తూనే ఉంది. అబ్రహం చెప్పాడు – 'అక్కా, తిట్టవద్దు. ఇతడు కూడా మనిషే. ఇట్టి కష్టదశలో ఇతనికి సేవచేయటం మన ధర్మం.' అబ్రహం ఆ త్రాగుబోతుకు స్నానం చేయించాడు. భోజనం పెట్టించాడు. తెల్లవారగానే ఇంటికి పంపించాడు. లింకన్ తన సద్గుణాలు కారణంగా అమెరికా సంయుక్తరాష్ట్రములకు రాష్ట్రపతి అయినాడు. ఇప్పుడాయనను ఆ దేశంలో 'లింకన్ మా తండ్రి' అని పిలుస్తారు.*

**సౌశీల్యం, సౌజన్యం అనే చెక్కులు ఎక్కడైనా చెల్లుతాయి.**

శ్రీ అరవింద జయంతి వ్యాసం

# పూర్వభారత వైభవ ఆవిష్కరణ

'మానవ పురోగమనంలో రానున్న గొప్ప దశలో భౌతికంగాకాక ఆధ్యాత్మికంగా, మానసికంగా ముందుకు సాగవలసిఉన్నది. విముక్తమైన ఆసియా ఖండమూ, స్వతంత్రమైన భారతదేశమూ ఈ ప్రగతికి నాయకత్వం వహించాలి. కాబట్టి ప్రపంచ శ్రేయస్సు కోసం మనం స్వాతంత్ర్యం కొరకు పోరాడవలసిందే. భారతదేశానికి స్వాతంత్ర్యం ప్రాణం. ఆమె సుఖంగా శోభామయంగా విలసిల్లగలగటానికి స్వాతంత్ర్యం అవసరం. ప్రపంచ శ్రేయస్సు కోసం జీవించటానికి ఆమెకు స్వరాజ్యం కావాలి. భౌతిక రాజకీయ ప్రయోజనాలు కోరుకునే బానిసల జాతిగా కాక – సమస్త మానవజాతికి ఆధ్యాత్మిక నైతకాభ్యుదయం సమకూర్చటంకోసం భారతీయులు స్వతంత్రులు కావాలి."

భారతీయ స్వాతంత్ర్య సంగ్రామపు తొలినాళ్ళలో అరవిందుడు చేసిన ప్రకటనమిది, ఆయన గురుతర బాధ్యత స్వీకరించవలసివచ్చింది. "ఆర్య" పత్రికలో ఎక్కువ పుటలను ప్రాచీన భారతీయుల నిర్మలమైన పారమార్థిక దృష్టినీ, వారి సాంస్కృతిక సాహిత్య సంపదల విశిష్టతనూ విశదీకరించటానికి వినియోగించారు. ఇప్పుడా రచనలు, గీతా వ్యాసములు, వేద విశిష్టత, భారతీయ సంస్కృతికి పునాదులు అనే సంపుటాలుగా క్రోడీకరించబడినవి.

జేమ్సు కజిన్సు "ఆంగ్ల సాహిత్యంలో నవ్య మార్గాలు" అనే గ్రంథం రచించగా, దానిని పర్యాలోకనచేస్తూ "భవిష్యత్కవిత" గ్రంథాన్ని వ్రాయటానికి పూనుకున్నారు అరవిందులు. విలియం ఆర్చర్ భారతీయ సంస్కృతిని చులకనచేయగా, సర్ జాన్ వుడ్రూఫ్ దానికి సమాధానం వ్రాశాడు. భారతీయ సంస్కృతిని గురించి విమర్శించటానికి ఆర్చర్‌కున్న అధికారం ఏమిటంటే –ఆత్మవిశ్వాసపూరితమైన ఘనతరమైన అజ్ఞానమే. ఆ గ్రంథ విమర్శన "భారతీయ సంస్కృతికి పునాదులు" అనే పుస్తకం వ్రాయటానికి దారితీసింది.

ఆర్చర్ దృష్టికి భారతీయులు తత్వచింతనలో, మతంలో, సాహిత్య చిత్రకళా శిల్పాదులలో, పవిత్ర గ్రంధాలలో సాధించిన మహోన్నత విజయాలు అల్పంగా తోచినవి. వాటిని మొత్తంగా కట్టకట్టి జుగుప్సాకరమైన అనాగరికతకు సూచనలుగా ఖండించివేశాడు. ఆర్చర్ అవివేకం వల్ల చేసిన పొరబాటును ఎత్తిచూపి అసలు విషయాన్ని శ్రీ అరవిందులు ఈ విధంగా పరశీలనచేశారు.

"భారతజాతి నాగరికమైనదా కాదా అనేది ప్రశ్న కాదు. మానవ నాగరికత ముందడుగు వేయటానికి ప్రాచీన భారతీయ సంస్కృతిని ప్రేరేపించిన సూత్రాలు తోడ్పడగలవా? అలనాడు ఐరోపా ఖండంలో విలసిల్లిన బుద్ధి ప్రధానమైన తత్వం, నేడు తలయెత్తిన భౌతికవాదం మానవ పురోగతికి దోహదం చేయగలవా? అని ప్రశ్నించుకుందాం. ఆత్మనూ బుద్ధినీ శరీరమునూ సమన్వయించే సూత్రం స్థూలమైన భౌతికతత్వం మీద ఆధారపడి అత్యల్పమైన నీరసమైన పారమార్థికతత్వంతో కూడి ఉండవలెనా? లేక ఆధ్యాత్మికశక్తి ప్రాధాన్యం వహించి మేధాశక్తినీ, శరీరమునూ, బుద్ధినీ సమన్వయించే సముదాత్త కృషిని ప్రేరేపించి విజయవంతమైన ప్రవర్ధమానమైన ప్రశాంతచిత్తమును సాధించవలెనా? తన ప్రాచీనాదర్శములను శక్తిమంతంగా సంపూర్ణంగా ప్రత్యక్షంగా ప్రకటించేవిధంగా భారతదేశం తన సంస్కృతీ స్వరూపాలను మలుచుకుంటూ నిలబడగలగాలి. భారతదేశం ఈ సమన్వయం ద్వారా సాధించిన విజయం తరంగాలుగా విస్తరించి ప్రపంచమంతటినీ ఆక్రమించుకోవాలి. పూర్వ యుగాలలో భారతదేశం ప్రపంచానికి జ్ఞానదీప్తి ప్రసరించి నాయకత్వం వహించింది. విభిన్నమైన సాంస్కృతిక విధానాల నడుమ సంఘర్షణ కొంతకాలం సాగుతుంది. కాని బాహ్యంగా మాత్రమే ఇది సంఘర్షణగా తోస్తుంది. పశ్చిమదేశాలనుంచి వెలువడుతున్న ఉత్తమ భావాలకు భారతదేశం నుంచి సహకారమే లభిస్తుంది. కాబట్టి ఉన్నత స్థాయిలో జరిగే సమన్వయానికి నాంది పలుకుతూ సమైక్యమునకు రంగం సిద్ధపరుస్తుంది."

భారతీయ సంస్కృతిలో ఉన్న గాఢమైన ఆధ్యాత్మిక స్వభావమునూ, చరిత్రలోని విఘాతములనూ కాలచక్ర పరిభ్రమణములనూ తట్టుకొని నిలబడగలిగిన వివిధాంశములనూ పరిశీలించారు అరవిందులు. "యుగయుగాంతముల నుంచీ వర్ధిల్లిన భారతదేశం గతించిపోలేదు. ఆమె సజీవవాణి అంతరించిపోలేదు. ఆమె జీవంతో తొణికిసలాడుతూ తనకోసమూ మానవకోటి కోసమూ మనగలుగుతున్నది. ఇప్పుడు మేలుకొలుపవలసినది ఆంగ్ల ప్రభావ వివశులైన ప్రాచ్యులను కాదు. వారు పాశ్చాత్యులకు విధేయ శిష్యప్రాయులై అక్కడి విజయ పరాజయములను పునరావృతం చేస్తారు. తన స్వరూపమును ప్రకటించగల గంభీరమైన అత్యంత ప్రాక్తనమైన శక్తిని

**మమకారం మితిమీరితే, కీర్తి తరుగుతుంది - రామాయణం.**

ఇప్పుడు మేలుకొలపాలి. ఆమె తన శిరస్సును ఎత్తి దివ్యకాంతిధామములను దర్శించాలి. తన ధర్మమునకున్న సంపూర్ణ పరమార్థమునూ విస్తృత స్వరూపమునూ ఆమె అవగాహనచేసుకోటానికి పూనుకోవాలి."

"భారతీయ సంస్కృతికి పునాదులు" అనే పుస్తకంలో వేదమును గురించి ఇలా అన్నారు.

"వేదం విశ్వంలో ప్రథమ పవిత్ర గ్రంథంగా విరాజిల్లుతున్నది. మానవుని గురించీ ఈశ్వరుని గురించీ విశ్వమును గురించీ వివరించటానికి జరిగిన మొట్టమొదటి ప్రయత్నం వేదం. అంతేకాక మొట్టమొదటి ఉదాత్తశక్తి సమన్వితమైన కవితాసృష్టిగా కూడా వేదమును భావించవచ్చును. శబ్దప్రయోగమూ రచనాస్వరూపమూ పరికిస్తే అది అనాగరికుల వ్రాత కాదని తేలుతుంది. వేదాలను రచించిన కవుల శిల్పకౌశలం అనల్పం. వారి ఛందస్సులు దేవతలకు స్యందనములు. విస్తారమైన దివ్యపక్షాంచలాల మీద అవి తేలుతూ ఉంటాయి. సూత్రప్రాయంగానూ తరంగమాలలుగానూ తూగుతూ ఉంటాయి. గంభీర గమనంతో సూక్ష్మమైన స్వరభేదాలతో అలరారుతూ భావకవితల తీవ్రతనూ మహాకావ్యాల ఉదాత్తగుణమునూ ప్రదర్శిస్తూ ఉంటాయి. స్వచ్ఛంగా, స్పష్టంగా, మహనీయంగా వినవచ్చే శక్తిమంతమైన వాగ్విలాసం అది, సూటిగా క్లుప్తంగా ఉంటాయి. భావంతో అర్థస్ఫురణతో నిండి తొణుకుతూ ఉంటాయి. ప్రతి పంక్తి తనకు తాను స్వతంత్ర ప్రతిపత్తిని నిలుపుకుంటూ పూర్వాపర సమన్వయంతో భావిస్తూ ఉంటుంది. పవిత్ర సంప్రదాయమును విధేయులై అనుసరించటంవల్ల వాటికి సారమూ స్వరూపమూ ఏర్పడినవి. కాని మానవాత్మ పొందిన అత్యంత గంభీరమైన ఆధ్యాత్మిక మానసికానుభూతులు వీటి వస్తువు. కాబట్టి వీటిలో కొత్తదనం లోపించదు. మూసలో పోసినట్లు ఒకేలాగా ఉండవు. కవి తాను లోపల అనుభవించి జీవించిన సత్యమునే ప్రతిపాదిస్తాడు. వ్యక్తిగతమైన అనుభూతివల్ల, ప్రకటనవల్ల ఈ అనుభూతులు ఒకప్పుడు సూక్ష్మంగానూ, సమున్నతంగానూ నిత్యనూతన శోభతో అలరారుతూ ఉంటాయి. విశ్వామిత్ర, వామదేవ, దీర్ఘతమస ప్రభృతి మహాద్రష్టల వాక్కులు అసాధారణమైన కవితా శిఖరాలను ఆరోహిస్తూ సముదాత్త భక్తికావ్యాల వైశాల్యమును కూడా ప్రదర్శిస్తున్నాయి. సృష్టిక్రమమును వర్ణించే పంక్తులు ఉన్నత భావనాశృంగాలమీద స్వచ్ఛంగా విహరిస్తున్నాయి. ఇటువంటి భాగాలు చాలా ఉన్నాయి. ఉపనిషత్కవులు ఇటువంటి సమున్నత భావవీధుల్లో నిరంతరం జీవించారు. తమ తత్త్వమునకూ, ధర్మమునకూ, సంస్కృతిలోని ముఖ్యాంశములకూ ద్రష్టలైన వేదకవుల వాక్కులే మూలాధారములని ప్రాచీన భారతీయులు తలపోయటంలో పొరబాటు లేదు. భవిష్యత్తులో వికాసం పొందిన భారతీయ తత్త్వసంపద అంతా వేదాలలో బీజరూపంలో ఒదిగిఉన్నది. తొలిసారిగా అవి వేదాలలో ప్రకటన పొందినవి."

"వేదమును గురించి" అనే పుస్తకంలో వేదాలలో ఇప్పటికీ వెల్లడికాని రహస్యమున్నదా అన్న ప్రశ్నతో మొదలుపెట్టి వేదస్వరూప వివరణచేసి ఎన్నో సూక్తములను వ్యాఖ్యానించాడు.

అనేకుల దృష్టిలో హిందూధర్మ గ్రంథాలలో అతి ముఖ్యమైనది భగవద్గీత. దీనిని గురించి వ్రాసిన గీతా వ్యాసాలు అరవిందుని రచనల్లో ప్రముఖంగా పలువురు భావిస్తున్నారు.

"మహాభారత కథలో అంతర్భాగంగా భగవద్గీత వెలసిననాటినుంచీ నేటి వరకూ కొత్తదనం కోలుపోకుండా నిలిచింది. నిత్యానుభవంలో ఎప్పటికప్పుడు నూతనంగా భాసించే వస్తువును అందిస్తున్నది. భారతదేశంలో ఇప్పటికీ మత సంబంధమైన ఆలోచనలను శాసించే సిద్ధాంతాల సమాహారంగా భగవద్గీతను ఆదరిస్తున్నారు. అన్ని శాఖలవారూ పూర్తిగా ఆమోదించకపోయినప్పటికీ గీతాబోధను అత్యున్నత ప్రమాణంగా అంగీకరిస్తున్నారు. గీతాప్రభావం తత్త్వ విద్యారంగాలకు పరిమితం కాదు. కాని ప్రభావం ప్రత్యక్షపూర్వకమైనది, సజీవమైనది. ఆలోచనలకూ కార్యకలాపాలకూ ప్రచోదనం కలిగించగలదు. జాతినీ సంస్కృతినీ పునరుద్ధరించి పునర్నిర్మాణంచేసే ఉద్యమం గీతాప్రబోధం నుంచి చాలా ప్రోత్సాహం పొందింది."

భగవద్గీత నుంచి మనం దేనిని కోరుతున్నాము? మనకు కావలసినదేమిటి? దివ్యబోధకుడెవరు? నరరూపంలోఉన్న శిష్యుడెవరు? భగవద్గీత బోధలో సారాంశ మేమిటి? గీతలోని పరమరహస్య మేమిటి? ఇటువంటి ప్రశ్నలకు గీతావ్యాసములలో సమాధానం చెప్పారు.

– మనోజ్ దాస్

★★★

**సమాజ సేవకు కావలసింది సంపద కాదు - ఉదార హృదయం.**

ఆచరణలో ఆధ్యాత్మ

# ఆనందం మన గుప్పిట్లో

"అక్షయమైన ఆనందాన్ని పొందే మార్గం ఏది?" అని సుమంతక శ్రేష్ఠి బుద్ధ భగవానుణ్ణి అడిగాడు. బుద్ధుడు ఇలా జవాబిచ్చాడు- "ఇచ్ఛలను, కోరికలను, త్యాగం చేయడం" శ్రేష్ఠి మళ్ళీ ఇలా అడిగాడు - "కోరిక లేకుండా ఏపనీ జరగదు. కోరిక లేకపోతే బద్ధకం అవరిస్తుంది. బ్రతుకుదెరువు సైతం కష్టమైపోతుంది." బుద్ధుడు ఇలా వివరించాడు - "కోరికను వదులుకోవడం అంటే అర్థం బుద్ధినీ, కర్మనూ వదులుకోవడం కాదు: వ్యక్తి గతమైన గొప్పతనాన్ని కోరకుండా ఆదర్శాల కోసం పనిచేయడం. శరీర రక్షణ, కుటుంబ పోషణ సమాజంలో సుఖశాంతులు అనే ఉన్నత ఆశయాలతో చేసే పనిలో గ్రుడ్డి స్వార్థం ఉండదు. వాటికోసం దుష్ట కర్మలు చేయవలసిన అవసరం ఉండదు. సామర్థ్యాన్ని పూర్తిగా వినియోగించి ప్రయత్నించినపుడు అందే సాఫల్యానికి సంతృప్తిపడుతూ, తర్వాతి ప్రయత్నాన్ని కొనసాగించాలి. కోరికల త్యాగం అంటే ఇదే. ఆదర్శాలు లేని పని, లోభ మోహాల తృప్తికోసం జరిగే పని హేయమైనది. విడువదగినది".

నిజాయితీగా, సదాశయంతో, అంకిత భావంతో శ్రమించడమే కర్తవ్యం. కర్తవ్య కర్మ చేసిన తర్వాత అందే ప్రతిఫలానికి సంతోషించడమే సంతృప్తి. ఉన్నది చాలని అనుకోవడం, మరింత ప్రగతికోసం మరింత సాఫల్యం కోసం ప్రయత్నించకపోవడం - ఇది సంతృప్తి కాదు. అలాంటి సంతృప్తి అకర్మణ్యత అవుతుంది. అలాంటి సంతృప్తివల్ల మనిషి దరిద్రుడుగా ఉంటాడు. సమాజాన్ని వెనుకబడినతనం ఆవరిస్తుంది. కార్యశూరతతో కూడిన సంపాదనవల్ల వ్యక్తిలోని ప్రతిభ వెలికివస్తుంది. సమాజంలో సమృద్ధి పెరుగుతుంది. "సంతృప్తి పేదల స్వంత బ్యాంకు. అందులో తగినంత ధనం నిండి ఉంటుంది"-అంటారు దార్శనికులు - జైరోల్డ్.

"అసంతృప్తిపరుడు ఎన్నడూ ధనికుడు కాలేడు సంతుష్టుణ్ణి పేదరికం సమీపించలేదు"- అంటారు జార్జ్ ఇవియట్.

ఉదారత, దూరదృష్టి కలిగిన మెదడులలో సంతృప్తి యొక్క వైభవం పొంగిపొరలుతుంది. సంతృప్తిలో తప్ప మరిదేనిలోనూ ఆనందం లభించదు. "సంతృప్తి పరమేశ్వరుడు ఇచ్చిన సంపద. తృష్ణ అజ్ఞానమనే అసురుడు మోపిన దారిద్ర్యం" - అంటారు సోక్రటీసు.

ఫలితాన్ని ఆనందానికి కేంద్రంగా పరిగణించకూడదు. పనిలోని ఉత్కృష్టతను ప్రతిష్టకు సంబంధించిన విషయంగా భావించాలి. అప్పుడు మనిషికి ఉత్సాహమే ఉత్సాహం, ఆనందమే ఆనందం. మనం ఏ పనినీ చిన్నదిగా పరిగణించకూడదు. చేతిలో ఉన్న పనిని ఏకాగ్రతతో పూర్తిచేయాలి. ఆ పనిలో పనిచేసిన వ్యక్తియొక్క వ్యక్తిత్వం ప్రకాశించాలి, మాట్లాడాలి. అంత ముఖ్యమైనది కాకపోయినా అలాంటి పని దాన్ని చేసిన వ్యక్తికి గౌరవాదరాలను సంపాదించిపెడుతుంది"- అంటారు కళాకారుడు బ్రౌనింగ్.

"సంతృప్తి అనే సువాసనను వెదజల్లనంతవరకూ పనిచేసే చెయ్యి తనను తాను అరగదీసుకోవాలి"- అంటారు మనీషి రస్కిన్.

"ఒక పనిని దాని బజారు ధర ఆధారంగా విలువకట్టకూడదు. దాన్ని చేసిన వ్యక్తి దృక్పథం, ఆపనిలోని ఏకాగ్రత ఆధారంగా విలువకట్టాలి"- అంటారు వాల్టేర్.

"మనం ఒక పనిలో ఎంత అభిరుచిని కలిగి ఉంటామో ఎంత ఏకాగ్రతను చూపుతామో అది అంత ఆనందదాయకం అవుతుంది"-అంటారు అబ్రహామ్ లింకన్.

ఆనందం కోసం ఏవేవో వస్తువులనూ పరిస్థితులనూ సంపాదించవలసిన అవసరం లేదు. మరొకరి అనుగ్రహం అవసరం లేదు. అది మన లోపల నుండి ఉదయించేది. ఫలితంలో సంతృప్తినీ, పనిలో ఉత్కృష్టతనూ జోడించడం ద్వారా ఆనందాన్ని ఎక్కడయినా, ఎప్పుడయినా, ఎంతయినా పొందవచ్చు.

★★★

**తిన్నది అరిగిన తర్వాతనే మళ్లీ తింటే-ఔషధం అనవసరం - తిరువళ్లువర్.**

# కర్మవీరులం కావాలి-విజయమాలలు ధరించాలి

ఇద్దరు తోటమాలీలు ఒకేసారి చెరొక పూలతోట వేస్తారు. కొద్దికాలంలోనే ఒకమాలి తోట చిగురు తొడిగి పూలుపూసి కనిపించింది. తోటంతా ఎటుచూచినా ఆకుపచ్చటి తివాసి పరిచినట్లుంది. అందంగా పరిమళం నిండిన వాతావరణంతో తోట కళకళలాడింది. ఆ తోట పక్కనుంచి ఎవరు వెళ్ళినా సరే చివరికి శత్రువులు కూడా పొగడకుండా ఉండలేరు. అనుకోకుండానే వారి నోటినుంచి ఆహా! ఈ తోట ఎంత అందంగా ఉంది, తోట ఎంత మనోహరంగా ఉంది– అనే మాటలు వెలువడుతాయి. పరుల నోటి వెంట ఈమాటలు విన్న తోటమాలి తనలో తాను అనిర్వచనీయమైన ఆనందాన్ని పొందుతాడు. తన శ్రమకు తగిన ఫలితం దొరికిందని, తన కృషి ఫలించిందని పొంగిపోతాడు.

ఇక రెండో తోటమాలి తోట ఒకచోట పచ్చగా ఉంటే మరోచోట ఎండిపోయింది. ఒక్కోకొమ్మ పూలు పూస్తే, ఒక్కోకొమ్మకి చిగురుకూడా లేదు. ఓ మొక్క నిటారుగా ఉంటే, ఒక మొక్క వంగిపోయి భూమి తల్లికి నమస్కారం పెడుతున్నది. ఒకచోట మొగ్గలు వికసించి పూలు ఉంటే మరోచోట వికసించకుండానే మొగ్గలు రాలిపోయాయి. ఒకవైపు పూల సుగంధం వ్యాపిస్తుంటే, మరొక చోట దుర్గంధం రాజ్యమేలుతున్నది. పాదులు సరిగా లేవు. సమయానికి చెట్టుని కత్తిరించడం లేదు. అంతా అస్తవ్యస్తంగా ఉంది. తోట అక్కడక్కడ అందంగా ఉన్నా చాలా భాగం చిందరవందరగా ఉండి కనిపిస్తోంది. అక్కడినుంచి పరిమళం వస్తుందా! చూపరులను అది ఆకట్టుకొంటుందా? ఏదీ లేదు. నిలబడి ఆతోటని చూడాలని ఎవరూ అనుకోరు. చూచినా ప్రశంసల వర్షం కురిపించరు. ప్రజలు దీనిని చూచి దాన్ని తోట అనుకోవాలో బంజరు బీడు అనుకోవాలో అని సంశయంలో పడతారు. కొందరు నిలబడి చూచి “తోటంతా చెత్తలా ఉంది– తోటమాలి ఏంచేస్తున్నట్లు? ఎందుకూ పనికిరాని వానిలా ఉన్నాడే? అని విసుక్కుంటారు.

అంతే. ఆ తోటమాలి శ్రమ అంతా వ్యర్థమయినట్లే గదా! ఎంత కష్టపడినా ఫలం లేకపోయింది కదా! గ్లానితో, లజ్జతో, క్షోభతో, నిరాశతో కృంగిపోతాడు ఆ మాలి. శ్రమంతా బూడిదలో పోసిన పన్నీరయింది అని వాపోతాడు. అదే అకర్మణ్యత. అదే అయోగ్యత.

తోటమాలులిద్దరూ మనుష్యులే! ఇద్దరి ఆశయం ఒకటే ఇద్దరూ ఒకేరకంగా తోటపెంచారు. ఇద్దరి సాధన ఒకటే. చక్కటి ఫలితం పొందాలనే ఇద్దరూ ప్రయత్నించారు. కాని ఒకరికి క్షోభ మిగిలింది. ఒకరికి సంతోషం కారణం ఏమిటంటే– ఒకరు కర్మయోగి, మరొకరు కర్మభోగి.

ఒకడు తమ పనిని కూలంకషంగా తెలుసుకొని ప్రతి విషయంపై శ్రద్ధ వహించి, తపస్సులా పనిచేశాడు. సకాలంలో విత్తనం నాటాడు. సమయానుకూలంగా తగినంత నీరుపోశాడు. మడులు కట్టాడు మొలకలని అరచేతులు అడ్డం పెట్టి రక్షించాడు. మొక్కపెరిగేదాక ఒకేధ్యాసతో పని చేశాడు. కలుపు మొక్కలెక్కడున్నాయి? ఎప్పుడు చెట్టుకు చీడపట్టే అవకాశం ఉంది? ఏ చెట్టయినా ఎండిపోతున్నదేమో! అని చూడడం, ఏవైపు నుంచైనా పశువులు వచ్చి నమిలిపోతాయోమోనని బందోబస్తు చేయడం–ఇవన్నీ ఒక్క విషయం నిర్లక్ష్యం చేయకుండా జాగ్రత్తపడ్డాడు. కలుపు మొక్కలు తీసేసాడు. పశువులు రాకుండా కంచెలు వేయించాడు. ఇతనిలా మెలకువలతో పని చేయడంతో, ఎప్పుడూ పని చేయడంలో బద్ధకించకపోవడంతో అతనికి ఫలితం అనే పండు చేతికి అందింది. పేరు వచ్చింది. ఎందుకంటే అతను కర్మయోగిలా బాధ్యత నిర్వహించాడు.

మరో తోటమాలి ఈవిషయాలేవీ ఆలోచించలేదు. నీటి సరఫరా సరిగా చేయలేదు. విత్తనాలు వేశాడు. అంతే! తిరిగి మొలకలు వచ్చాయాలేదా? అని మడుల దగ్గర

**పని లేకుండా క్షణం గడపడం దేవుణ్ణి దొంగిలించడం - గాంధీజీ.**

నిలబడి ఒక్కనాడూ గమనించ లేదు చెట్లు కుళ్ళిపోతున్నాయో - ఎండిపోతున్నాయో పట్టించుకోలేదు. పూలు వడిలిపోతున్నాయి. మొగ్గలు వికసించకుండా ఎండిపోతున్నాయి. ఆకులు పచ్చగా ఉన్నవి ఎండిపోతున్నాయి. ఇవేమీ అతను లక్ష్యపెట్టలేదు. కుదుళ్ళు చెదరిపోయి నీళ్ళు బయటికి పోతున్నాయని- నీళ్ళు ధార ఎక్కువయి బయటికి పోతున్నాయని చూడలేదు. భూమిని తవ్వాడు. గింజలు నాటాడు. కూర్చున్నాడు. అదృష్టం ఎలా ఉంటే అలా అవుతుందిలే అనుకొన్నాడు. వాటి శక్తితో పూలు పూస్తే, వాటి శక్తితో అవి వికసిస్తే చూసి సంతోషించాడు. ప్రకృతిసిద్ధమైన ఆపూల పూతకే, మనం సాధించాం అని ఇక ఏమీ చేయకుండా కూర్చున్నాడు.

మూడో నాలుగో పూల చెట్లు బాగా పూసినవి ఉంటే వాటిని చూస్తూ వాటి చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ అదే ప్రపంచం అనుకుంటాడు. తక్కిన మొక్కలు ఉన్నాయి. వాటికి పోషణ చేస్తే అవి పూలు పూస్తాయి- అనే మాటే లేదు. వాటిపట్ల ధ్యాస లేదు. పూలు ఎక్కువగా పూసిన చెట్టువంకే ధ్యాసపెట్టాడు. వాటిని చూసి గర్వించి వాటి పట్ల ఆప్యాయత ప్రకటిస్తూ వచ్చాడు. తక్కిన తోటంతా బీడు పడిపోయింది. తోటమాలి పనిచెయ్యడు. నిర్లక్ష్యం ఎక్కువఅని మాటలుపడ్డాడు. అశాంతి, అపజయం మిగిలాయి అనిపిస్తుంది ఈ కథ వింటుంటే.

మానవుడు జీవితాన్ని సార్థకం చేసుకోవాలంటే కర్మయోగి కావాలి. కర్మభోగిఅయితే విజయం సాధించలేడు. పేరు సంపాదించాలన్నా, ధనం సంపాదించాలన్నా మనిషి కర్మయోగి అయితేనే సాధ్యం. చేసే ప్రతి చిన్న పనిలోనయినా, పెద్దపనిలోనయినా మనశక్తి నంతా వినియోగించి ఏకాగ్రతతో కర్తవ్యనిర్వహణ చేయాలి. ఏదో లాభం వచ్చి ఒడిలో పడిపోతుందనుకొన్న పనిమీద ధ్యాసపెట్టడం - లాభం రాదనుకొన్న పని నిర్లక్ష్యంగా చేయడం - ఇది కుశల కార్యకర్తల పద్ధతి కాదు. అతిచిన్న పనిఅయినా సరే తత్పరతతో, చాకచక్యంతో, శ్రద్ధతో చేసి అందంగా, గొప్పగా చూపరుల నాకర్షించేలా తయారు చేయగలిగితే కర్త యొక్క కళాకౌశలం, నమ్మకం మనకి అవగతమవుతాయి. మన పనులే మన గుణాలకి స్వభావాలకి దర్పణం పడతాయి. దానివలననే మనల్ని గొప్పవారని కర్మయోగులని గుర్తించి గౌరవిస్తారు. తగిన విలువకట్టి పారితోషికం ఇస్తారు.

జీవితం అంటేనే కర్మకాండల గొలుసు. కర్మచేయకుండా లిప్తపాటు కూడా ఉండలేడు మనిషి. నిద్రపోవడం - లేవడం, కూర్చోవడం - నుంచోవడం, ఆఖరికి ఊపిరి పీల్చడం కూడా ఒక కర్మే. ఏపనయినా సరే శ్రద్ధతో, సద్భావంతో చేస్తే మనిషికి ఉత్సాహము, సంతోషమూ, శాంతి దొరకడమే కాక మహనీయమైన ఆలోచనలు కూడా కలిగి మనిషి ఎదుగుతాడు. ఒక మంచి పని చేస్తే బాహ్యదృష్టితో ఆలోచిస్తే గొప్ప లాభం కలుగక పోవచ్చు. కాని ఆంతరంగికంగా చూస్తే ఆత్మసంతోషం, శాంతి, మంచి గుణాలను గుర్తించే శక్తి, ఉత్తమ భావాలు తప్పక కలుగుతాయి. మనసులో తోచే భావతరంగాలను అణచివేయగల సత్తా కలుగుతుంది. యుక్తాయుక్త విచారణ కలిగి బౌద్ధిక స్థితి ఉచ్చస్థానాన్ని పొంది భౌతికంగా, ఆంతరంగికంగా విజయం లభిస్తుంది.

మనసు కోతి. వంకర భావాలు వంకర నడక దాని గుణం. చెడ్డ ఆలోచనల నుండి, చెడ్డ పనుల నుండి తప్పించుకోవాలంటే మనశక్తి నంతటినీ కేంద్రీకృతం చేసి నిర్మాణాత్మక కార్యక్రమాలను చేపట్టితేనే విముక్తి. ఏదో ఒక పనిలో మునిగిపోతే పిచ్చి పనులు చేసేందుకు సమయం దొరకదు. చెడ్డ ఆలోచనలు వచ్చినా వాటిని సంహరించే గుణం అలవడుతుంది. చేతులు ముడుచుకు కూర్చుంటే పనికిరాని ఆలోచనలు ఓహరిసాహరిగా పుట్టుకువస్తాయి. భూతాల్లా పెరిగిపోతాయి. ఏదోపనిలో మునిగిపోతే చెడ్డ ఆలోచనలు కూడా మంచి ఆలోచనలుగా మార్పుచెందుతాయి. మనం జాగరూకతతో వ్యవహరిస్తే మంచి-చెడు భావాల తారతమ్యం తెలుస్తుంది. పనిలో మునిగి ఉంటే చెడ్డభావాల ప్రభావం తగ్గి వాటిని గురించి ఆలోచంచే శక్తిని కూడా మంచి పనులు చేయడంలో వినియోగిస్తాం. కార్యసాఫల్యం కోసం శక్తిఅంతా ఏకమవుతుంది. అంతర్ ద్వంద్వయుద్ధం ఉత్పన్నం కాదు.

**మనస్సు నిర్మలం అయితే, దేవుని రహస్యం తెలుస్తుంది.**

ఎప్పుడూ ఏదో ఒక బెంగ, నిరుత్సాహం మనిషిని, మనసుని క్రుంగదీస్తూ ఉంటాయి. దాని నుంచి విముక్తి కావాలంటే పుట్టెడు పనితో మునిగిపోతూ ఉండాలి. క్రియాత్మక శక్తి పెరుగుతుంది. చెడ్డ భావాలను సంస్కరించుకోగలము. మన మనసుకి నచ్చిన పని ఏదో ఒకటి ఆధారం చేసుకోవాలి. బెంగలు, కోపాలు, శోకం వంటి పాశాలు చుట్టుకొంటే-కదలకుండా అకర్మణ్యంగా కూర్చుని వాపోతుంటే బాధలు పెరిగిపోతాయి కాని నివారణ కానేకావు. ఎలాగో రుచి పెంచుకొని కవిత్వం వ్రాయడమో, గృహాలంకరణ చేయడమో, ఏదో ఒక లలితకళ చేపట్టడమో, చదవడమో (డిగ్రీలకోసం) సమాజసేవ చేయడమో - ప్రయత్నించి వీటిలో ఒక దానిలో ఇష్టం పెంచుకొని ఇందులో పైకి రావడానికి కృషి సలుపవచ్చు. దీనికి మించిన మందు మరొకటి లేదు. వీటివల్ల మానసికమైన దుర్బలత్వం ఉద్వేగం, బెంగలు సమసిపోతాయి. ఏ పనిలోనూ మనసుపెట్టక ఆషామాషీగా పనులు చేయడం అలవాటయితే శాంతి దొరకనే దొరకదు. మనసును కేంద్రీకరించి ఎవరైతే పనిచేయగలుగుతారో వారే చింతల నుండి దూరం కాగలరు. ఇలా జరిగితే బాగుండేదేమో, ఈ పనిచేస్తే భవిష్యత్తులో నష్టం వస్తుందేమో, అదవుతుందో - ఇదవుతుందో అనుకుంటూ కూర్చుంటే పనిచేయలేము. వర్తమానకాలం కూడా చేతిలోంచి జారిపోతుంది. తిరిగిరాదు. వివేకవంతులు వర్తమానాన్ని బంగారుపంటలా భావిస్తారు.

పనిలో మునిగిపోయి ఉండే మనిషికి ఇతరుల తప్పొప్పులు ఎంచడానికి, ఇతరులను నిందించడానికి సమయం దొరకదు. అనవసరమైన ఆలోచనలకు తావివ్వడానికి క్రియాశీలురకు క్షణం కూడా మిగలదు. మన పని మనం సవ్యంగా చేసుకోవాలంటే మనచుట్టూ ఉన్న మనుష్యుల స్వభావాలను చూడడం-అర్థం చేసుకోవడం అవసరం. కానివాళ్ళ దోషాలను ఎత్తిచూపించే సమయం ఉండదు - ఇష్టమూ ఉండదు. ఏమీపని చేతిలో లేకపోతే ఎదుటివాళ్ళ దోషాలు ఎంచడం, వాళ్ళ పనుల్ని విమర్శించడం, వాళ్ళని దూషించడం -ఇదే కార్యక్రమం జరుగుతూ ఉంటుంది. చెత్తాచెదారం మహాప్రవాహంలో ఎలా కొట్టుకు పోతాయో కార్యశీలుని మదిలో చెడ్డ భావాలు అలా కొట్టుకుపోతాయి.

ఆదర్శాత్మకంగా, సద్భావంతో, ఉపయోగకరమైన పనులు చేస్తే, ఏదో ఒక రంగంలో నవీనమైన నిర్మాణాత్మక కార్యక్రమం చేయగలిగితే వచ్చే ఆనందం, తృప్తి మరేవిధంగానూ దొరకవు.

నిష్కామంగా లోభరహితంగా, ఉదాత్తమైన బుద్ధిలో ఆడుతూ - పాడుతూ ఎవరైతే పనిచేస్తారో వారి జీవితం ఆనంద మవుతుంది. ప్రపంచం అంతా సంతోషంగా ఉన్నట్లు కన్పిస్తుంది. కర్మయొక్క మహిమ ఇంతని చెప్పనలవి కాదు అందుకే దానిని యోగమని పిలుస్తారు. కర్మయోగ సాధన చేస్తే జీవితానికి పూర్ణత్వం సిద్ధిస్తుంది.

ఏ పుట్టలో ఏ పాము ఉందో అన్నట్లు ఏక్షణం ఏప్రణాళికని, గొప్పతనాన్ని తెచ్చి అందిస్తుందో తెలియదు. విత్తనం ఎంత చిన్నదయితేనేం. దానినుంచి ఉత్పన్నమయ్యే వృక్షం ఎంత పెద్దదయినా కావచ్చు. మనిషి ఎన్ని సంవత్సరాలు బతికాడు అన్నది లెక్క కాదు. ఏ మహత్కార్యాలు చేశాడు అన్నది లెక్క. అందుకని కర్మవీరులు పనినే జీవితం అనుకొంటారు. ఒక మహనీయు డన్నాడు- "ఓపనీ, నువ్వే నా కోరికవి. నా ఆనందం నువ్వే ! నా సంతోషం నువ్వే ! అని.

మామూలు వ్యక్తిని మహోన్నతుడుగాను, జడుని నిరక్షరాస్యుణ్ణి పండితుడుగాను, బీదవాణ్ణి రాజుగాను పరివర్తింపచేసే చిన్నపెద్ద పనులు సదా మన కళ్ళ ఎదుట ప్రత్యక్షమవుతూనే ఉంటాయి. కాని మనం ఏం చేస్తాం. ఎన్నో సాకులు చెప్పి, కర్మదేముణ్ణి అవమానం చేసి వెళ్ళగొడతాం. ఆయన వెళ్ళిపోయాక, మన అవకాశం జారిపోయాక పశ్చాత్తాపపడి నెత్తికొట్టుకుంటాం.

**అనుభవం, జ్ఞానం, వ్యక్తపరచే సామర్థ్యం కావాలి నిర్ణయించడానికి- సోక్రటీసు.**

ఏదైనా పని ఇచ్చి చేయవయ్యా అంటే "ఇదా ఇంత చిన్నపనా ! నాతాహతుకి నా హోదాకి ఇలాటి హీనమైన పనులు చేస్తానా నేనిలాంటి పనులుచేయను" అని వదిలేస్తారు. జీవితమంతా వేటాడినా వారికి పని దొరకక పోవచ్చు. నది ఉద్గమ స్థానంలో సన్నగా – పసివాడు కూడా దాటగలిగిన వెడల్పుతో ఉంటుంది. తరవాత కాస్తకాస్త విస్తరిస్తూ – చేతులు జాస్తూ దాటశక్యం కానంత పెద్ద నది అవుతుంది. కొంచెం గాలివేస్తే ఎగిరిపోయేటంత అల్పంగా ఉండే ఒక విత్తనం భూమిలో నాటాక పెరిగి పెద్దదై వృక్షమై ఎన్నోశాఖోపశాఖలతో విస్తరించి బాటసారులకి నీడ నిస్తుంది. పక్షులకు నివాస స్థానమవుతుంది. పూలిస్తుంది. కాయల నిస్తుంది. పళ్ల నిస్తుంది.

అత్యంత ఖరీదైన ముత్యం మొదట సాధారణ ఇసుకరేణువుకదా! మనకి ఎదురయ్యే పనులు కూడా ఇలాంటివే! ముఖ్యమైనవి, విలువైనవి అవబోయే పనులు ఆరంభంలో చిన్నగానే ఉంటాయి. కర్మవీరులు ఏకాగ్రతతో వాటిని ఆరంభించి కొనసాగిస్తే అవి మహత్తరమైన అద్భుతమైన పరిణామాల్ని ఇస్తాయి.

గొప్ప శాస్త్రవేత్త ఎడిసన్ తెలుసుకదా! చదువు నేర్చుకోడం కోసం ఆయన ఒక విద్యావేత్త దగ్గరకి వెడితే ఆయన అవును–కాదు అని చెప్పకుండా – చీపురుకట్ట ఇచ్చి ఇల్లు ఊడవమన్నాడు. ఎడిసన్ ఏమాత్రం సంకోచించకుండా శ్రద్ధగా ఊడ్చి ఇల్లు శుభ్రం చేశాడు. ఇంత చిన్న పని అయినా – పద్ధతిగా, జాగ్రత్తగా చేయడం చూసి ఈ పిల్లవానిలో శ్రద్ధ ఉంది. ఓర్పు ఉంది. చిన్న పెద్ద పనులకి గౌరవం ఇచ్చే సద్భావం ఉంది. అధ్యయనానికి అనుమతి ఇచ్చాడు. ఏ పనులయితే అధ్యాపకుని మనసుని కట్టివేశాయో వాటిలోని శ్రద్ధను చిత్తశుద్ధిని, ఓర్పుని పెంచుకొని అభ్యాసం చేసి ఎడిసన్ శాస్త్రవేత్త అయి ఖ్యాతి పొందాడు.

ఈ చిన్నపనా! ఇది చేస్తే భవిష్యత్తు బాగుపడుతుందా! నేను నమ్మను అని ఏ పనులను మనం నిర్లక్ష్యం చేసి తోసి వేస్తామో అలాంటి చిన్నచిన్న పనులు చేసి మహోన్నత స్థానానికి ఎదుగుతారు కర్మవీరులు. వాటిపైన జీవన హర్మ్యాన్ని నిర్మించుకొంటారు. విధాయకమైన పనులతో పరిశ్రమ పురుషార్థం అనే అగ్నిలో మనల్ని మనం తపింప చేస్తే – మనలోనే మనకు తెలియకుండా నిద్రించే నేత గాని, సమాజసేవకుడు కాని, రచయిత కాని, ధర్మ ప్రచారకుడుకాని, శాస్త్రవేత్తకాని, వ్యాపారస్థుడు కాని తప్పక మేల్కొని పైకి ప్రకటితమయి పేరు ప్రఖ్యాతులు తెస్తాడు.

అమూల్యమైన శక్తి సంపద మనిషికి మేధస్సు, మస్తిష్కం. మస్తిష్కంలో చెలరేగే విరోధ భావాలను తరిమికొట్టాలి. వివేకం సద్బుద్ధి అనే దీపాలు వెలిగించుకోవాలి. ఒక కార్యనిర్వహణ వైపు దానిని ప్రోత్సహించాలి. అప్పుడు ఆ ధీశక్తి ఎన్నెన్ని నిర్మాణాత్మక కార్యక్రమాలను రూపొందించి చేతికందిస్తుందో! మార్గదర్శకత్వం వహించి మిమ్మల్ని ముందుకు నడిపిస్తుంది. రక్షణ కోసం నిర్మించిన ప్రహరీగోడ లాగా నిలబడి మిమ్మల్ని కాపాడుతుంది.

ఒక కార్యక్రమం ప్రారంభిస్తే అది ఉత్తమమైన కార్యక్రమమైతే – ఎన్నో విఘ్నాలు ఎదురై అడ్డగిస్తాయి. వాటితో భయపడి భీరువులై వెనుకకు తిరగకూడదు. పిరికితనం ఉన్న వాడిదగ్గరకు విజయలక్ష్మి రాదు, నిలవదు. బాధల శిలలను పగుల కొట్టే వాడే నిజమైన మనిషి. కర్తవ్యాలు బాధాయుతమైనవే. కాని బాధారహితమైనవి రావు. అలాంటి పనులు చేసి బాధని ఎదుర్కొని నిలబడితే ఆ బాధలే అతనిని విజయ ద్వారంలోనికి నెట్టివేస్తాయి. విజయ రహస్యాలను విశదపరుస్తాయి.

**మనల్ని నాశనం చేసేందుకు పొంచి ఉన్న బ్రహ్మరాక్షసి - నిరాశావాదం.**

సూర్యుడు, చంద్రుడు, తారలు వాళ్ళ ప్రయాణంలో విఘ్నాలు రానిస్తారా! ఉదయించడం, అస్తమించడం ఈకృషిలోనే వారి అస్తిత్వం–సార్థకత ఋజువుచేసు కుంటున్నారు. ఒక నది ప్రవహిస్తోందంటే దాని కర్తవ్య మేమిటి? తన దోవలో వచ్చే భూములన్నిటిని తడపడం – పచ్చదనం నింపడం కోసం నిరంతరం ప్రవహించడం. అంటే ప్రకృతి భిన్న భిన్న రూపాలతో నియమబద్ధంగా నడుస్తుంటే చైతన్యమూర్తి అయిన మనిషి అందుకు భిన్నంగా ఎందుకుండాలి, కర్మ హీనుడెందుకవ్వాలి? "కర్మ ప్రధానంగానే ప్రకృతిని సృష్టించాడు భగవంతుడు"– అన్నాడొక కవి. కర్మ నాచరించడమే జీవన ధర్మం. కర్మనిష్ఠ కోసమే భగవంతుడు ప్రపంచాన్ని సృష్టించాడు.

కర్మ చేయకుండా దాక్కునే మానవుడు నిండు సుఖానికి అర్హుడు కాలేడు. కర్మవీరుడే అధికారి అవుతాడు. సామెత ఏమిటంటే – "నడిచే వాడే గమ్యం చేరుతాడు. కూర్చున్నవాడు కూర్చున్న చోటనే ఉంటాడు." సముద్రంలో అట్టడగుకు మునిగినవాడే ముత్యాలను మూటకట్టుకు పైకి తెచ్చుకోగలడు. ఆత్మబలాన్ని నమ్మనివాడు, సాధనలను లక్ష్యపెట్టనివాడు సంసారంలో ఏపనీ చేయగలడని నమ్మలేము.

స్వామి అయ్యరు చిన్నవాడు. తండ్రి అంధుడు. సంపాదన లేదు. తల్లి కష్టపడి తిరగలితో పిండి విసిరి కూలి డబ్బులు సంపాదించేది. వాటితోనే జీవనం సాగించేవారు. అయ్యరు కొంచెం పెద్దవాడు కాగానే చదువుతోపాటు ఉద్యోగం చేసి నెలకి ఒక రూపాయి సంపాదించేవాడు. చదువు ఓపక్క నడుస్తూ ఉండేది. బాగా చదవడం వల్ల అయిదువందల రూపాయల పారితోషికం లభించింది. తాసీల్దారు ఆఫీసులో క్లర్కుగా చేస్తే నెలకి పదిరూపాయల జీతం వచ్చేది. అయ్యరు చాలా కష్టపడి చదువుతూ పనిచేస్తూ చివరికి హైకోర్టు జడ్జి అయ్యాడు. పురుషార్థం చేయడం వలన ఎలాంటి ప్రగతి సాధించగలరన్న దానికి అయ్యరు జీవితం చక్కటి ఉదాహరణ.

ఇది ఒక దృఢమైన సత్యమని తెలిసినా– చేతులు కట్టుకొని కూర్చోవడం మంచిదా! నడుము కట్టుకొని కర్మక్షేత్రంలో ఉరికి పనిచేయి. చదువో– కవిత్వమో – శిల్పిగానో ఏదో ఒక పని చిత్తశుద్ధితో ఏకాగ్రతతో చేయి. విజయం నిన్నే వెతుక్కుంటూ వస్తుంది.

నాలుగేళ్ళ అమ్మాయికి పక్షవాతం వచ్చింది. చేతికర్ర సహాయంతో అతి కష్టం మీద నడుస్తుండేది. ధైర్యం వదలలేదు. నడవడం కష్టంగా ఉందని పరుగెత్తడం అభ్యాసం చేసింది. ఎంత విచిత్రమో చూడండి! ఒకనాటికి ఈపిల్ల ఒలింపిక్ ఆటలలో పరుగు పందెంలో పాల్గొని మూడు పతకాలని గెల్చుకొంది. నమ్మగలరా! ఆశ్చర్యంగా లేదూ? ఆ అమ్మాయి పేరేమిటో తెలుసా! గోల్టిన్ రూలాఫా. ఆ అమ్మాయి అమెరికాలోని టెనిస్ ప్రాంతంలో ఉండేది.

కర్మనిష్ఠులూ, కర్మయోగుల కోసం గెలుపు కన్యలు చేతిలో విజయమాలలు ధరించి దారిలో ఎదురు చూస్తూంటారు. కర్మభూమి అయిన భారతదేశంలో జన్మించిన కర్మవీరులు మీరందరూ. కాలు కదిపి ముందుకు నడిచి ఆ విజయమాలలను మీ కంఠాన ధరించడానికి ఎందుకు ప్రయత్నించరు? జీవన లక్ష్యం ఇదే! లేవండి–మేల్కొండి, ఆగకండి. లక్ష్యం పూర్తి అయ్యేదాక విశ్రమించకండి.

★★★

## తిరిగివచ్చిన యుగశక్తి గాయత్రి జూలైనెల సంచికలు

జి.ఎన్.రామయ్య, నాగోలు, హైదరాబాదు.
మారుతి కమ్యూనికేషన్స్, కొత్తపేట, హైదరాబాదు.
శ్యామ్, కొత్తపేట, హైదరాబాదు.
పి.ఏ.చౌదరి, ఐ.టి. క్వార్టర్స్, హైదరాబాదు.
ఓ.కుటుంబరావు, బాగ్ లింగంపల్లి, హైదరాబాదు.

★★★

**గ్రంథాలయం గురువు. గ్రంథాలయం తల్లి.**

మనం - మన ఆరోగ్యం

# ఆహార విహారాలకు పది నియమాలు

సృష్టిలోని సమస్త జీవజాలం రోగరహితంగా జీవిస్తాయి. నేల మీద సంచరించే జంతువులు, విశాలాకాశంలో ఎగిరే పక్షులు మొదలుకొని పురుగూ పుట్రా, క్రిమి కీటకాలు కూడా కాలం తీరిన తర్వాత మరణిస్తాయి తప్ప రోగాలతో తీసుకుని చనిపోవు. మనిషి ఇతర ప్రాణికోటిని తన అధికారంలో బంధించి ప్రకృతి విరుద్ధమైన జీవనానికి ఎంత వివశులను చేస్తున్నాడో అతడు అంత అస్వస్థతకు గురిఅవుతున్నాడు. అంతేతప్ప మరోవిధంగా ఈ ప్రపంచంలో వ్యాధులు, దుర్బలతలనేవి లేనేలేవు. స్వేచ్ఛాచారంగా వ్యవహరించి స్వయంగా మనమే వాటిని ఆహ్వానిస్తున్నాము. మన ఆలోచనా విధానంలో మార్పు తెచ్చుకుంటే, సంయమ నియమాలను పాటించుతున్నట్లయితే ఈ వ్యాధులూ-బాధలూ ఉండనే ఉండవు. ఔషధాల వల్ల రోగ బాధలకు తాత్కాలిక ఉపశాంతి దొరకే మాట నిజమే అయినప్పటికీ దాని మూలకారణమైన అసంయమం నిలిచిపోవటం వల్ల కొన్నాళ్ల తర్వాత అదే వ్యాధిగాని అది మరో రూపంలో గాని మరల ఉత్పన్నమౌతూ ఉంటుంది. అందువల్ల సంపూర్ణ ఆరోగ్యానందం అనుభవించాలంటే దానికి నిర్ణయించిన మూల్యం, అనగా 'సంయమం', చెల్లించడానికి ప్రతి వారూ సిద్ధంగా ఉండాలి.

బలహీనమైన శరీరం గల వ్యక్తి మనసుతో, మేధస్సుతో ఎన్నో ఆలోచించగలడు. ఎంతో గొప్ప పథకాలను వేయగలడు, కానీ ఆచరించలేడు. లడ్లు తింటున్నట్లు ఊహించుకున్నంత మాత్రాన ఆకలి తీరదు కదా! పొట్ట నిండాలంటే బియ్యం సంపాదించాలి. వండుకొనాలి. తినాలి. ఈ శ్రమంతా పడడానికి శరీరం సహకరించాలి. ఆరోగ్యంగా ఉన్నప్పుడు మాత్రమే శరీరం ఏపనినైనా చేయగలుగుతుంది.

ఆరోగ్యం సరిగా ఉన్నప్పుడు మాత్రమే మనిషికి సరైన ఆలోచనలు వస్తాయి. కనుక ఆరోగ్యం కలిగి ఉండడం అన్నది ప్రతిదానికీ అవసరం. వ్యాధులు రాకుండా ఉండడానికి కొద్దిరోజులు సంయమనం పాటిస్తే చాలదన్న విషయం కూడా ఇక్కడ తెలుసుకోవాలి. తమ అలవాట్లలో, ఆహార విహారాలలో సంయమశీలత వ్యవస్థీకరించుకొనేటట్లు చేసుకోవాలి. ఈ విధానంలో ఎవరు ఎంత విజయం సాధించ గలిగితే వారు అంత ఆరోగ్యమనే మహాభాగ్యానికి అధికారులు కాగలుగుతారు.

వ్యక్తిగత జీవితంలో మనం కొన్ని అలవాట్లను జాగ్రత్త కోసమని వదిలి పెట్టవలసి వస్తే మరికొన్ని అలవాట్లను అంతే శ్రద్ధ, తత్పరతలతో స్వీకరించవలసి ఉంటుంది. అవి ఏవనగా -

### 1. రోజుకు రెండు పూటల భోజనం

మధ్యాహ్నం ఒకసారి మరల రాత్రికి మాత్రమే భోజనం చేయాలి. ప్రాతః కాలంలో పాలులేదా తేలికపాటి ద్రవ పదార్థాలు తీసుకుంటే చాలు, మాటిమాటికి ఏదో ఒకటి తింటూ ఉండే అలవాటును పూర్తిగా మానివేయాలి.

### 2. ఆహారాన్ని బాగా నమిలి తినాలి

భోజనం చేసేటప్పుడు తరుముకువస్తున్నట్లు హడావుడి, కంగారు, కోపం ఉండరాదు. మనసును ప్రశాంతంగా, సంతోషంగా ఉంచుకోవాలి. పదార్థాల రుచిని అనుభవిస్తూ బాగా నమిలి నిదానంగా భోజనం చేయాలి.

### 3. ఆహారం మితంగా ఉండాలి

పొట్టనిండుగా కూరినట్లు భోజనం చేయరాదు. సగం పొట్ట ఆహారంతో, పావువంతు నీళ్లతో, పావు వంతు శ్వాస ఆడడానికి గాలికోసం కాళీగా ఉంచాలి.

**పారే కాలువకు పట్టదు నాచు. శ్రమించే దేహానికి లేదు రోగపు చేటు.**

### 4. రుచుల మీద మోహాన్ని వదిలి పెట్టాలి

ఊరగాయలు, మురబ్బాలు, సిరప్పులు, మసాలాలు, పులుపు, తీపి మొదలైనవి అతిగా తింటే జీర్ణకోశం పాడవడమే కాక రక్తం కలుషితమవడానికి కారణ మవుతుంది. కనుక వాటిని తగుపాళ్లలో తీసుకొనడమో లేదా అసలు మానివేయడమో చేయాలి. ఉప్పు, ధనియాలు, జీలకర్రపొడిని సువాసన కొరకు వాడుకొనవచ్చు. కొన్ని రోజులు ఉప్పు-తీపి పూర్తిగా వదిలిపెట్టి అస్వాదు వ్రతాన్ని ఆచరించితే, నాలుక రుచులను మర్చిపోయి - ఎలా ఉన్నా తినే అలవాటు వస్తుంది. ఉప్పు, నిమ్మరసం, ఉసిరికాయ కలిపి నోటికి హితకరంగా రుచికరంగా చేసుకొనవచ్చు. మసాలా పొడిని ఆరోగ్యానికి శత్రువుగా భావించాలి. తీపి కోసం పంచదార బదులు బెల్లము లేదా తేనె వాడటం మంచిది.

### 5. కూరగాయలు పండ్లు ఎక్కువగా వాడాలి

ఆరోగ్య రక్షణలో శాకాహారానికి ప్రముఖ స్థాన మున్నది. మనం తినే భోజనం సగము అన్నం, మిగిలిన భాగం కూరలు, పండ్లు, పాలు, మజ్జిగ మొదలైనవి ఉండాలి. ఏ ఋతువులో దొరికే పండ్లు ఆయా ఋతువుల్లో విరివిగాను, చౌకగాను దొరుకుతాయి. మామిడి, జామ, రేగు, సీమరేగు, నేరేడు, బొప్పాయి, అరటి, కర్జూర వగైరా పండ్లు; సొర, బీర, దోస, దొండ, కీరదోస, టమాటా, తోటకూర, పాలకూర, మెంతికూర మొదలైన శాకాలు ఎక్కువగా వాడుతూ ఉండాలి. గోధుమ, శెనగ, పెసలు మొదలైన వాటిని మొలకెత్తించి తింటే బాదం పప్పులో ఉన్నన్ని పోషక విలువలు లభిస్తాయి. కొన్ని కూరలు, పండ్ల పైనున్న చెక్కులో విటమిన్లు అత్యధికంగా ఉంటాయి. కనుక అటువంటి వాటిని పైచెక్కుతో సహా తినటం లాభదాయకం.

### 6. హానికారక పదార్థాలకు దూరంగా ఉండాలి

మాంసం, చేపలు, గ్రుడ్లు, మిఠాయిల వంటి హానికారక పదార్థాలకు దూరంగా ఉండాలి. కల్లు, సారాయి, గంజాయి, కాఫీ, టీల వంటి నిషా పదార్థాలనైతే ఆరోగ్యానికి శత్రువులుగా భావించాలి. చుట్ట, బీడీలు కాల్చడం, నస్యం పీల్చడం, పొగాకును తమలపాకులతోపాటు నమలడం మొదలగు అలవాట్లు ఆర్థికంగా, శారీరికంగా రెండు విధాల నష్టం కలిగిస్తాయి. నిలువ ఉన్న పదార్థాలను, కుళ్ళిన పాచిన పదార్థాలను ఎట్టిపరిస్థితులలోను తినరాదు.

### 7. ఆవిరి మీద వండిన భోజనం శ్రేష్ఠమైనది

అన్నం - పప్పు - కూరలు వండడానికి ఆవిరి పద్ధతి ఎంతో మేలైనది. మూతలేని పాత్రలలో పొయ్యిమీద వండిన వాటిలో 70 శాతం విటమిన్లు నష్ట మవుతాయి. ఈ నష్టం నుండి తప్పించుకొనడానికి కుక్కరువంటి సాధనాలను ఎంచుకోవడం లాభదాయకం. ఇదే విధంగా తిరుగలితో విసిరిన పిండినే వాడాలి. మరపట్టించిన పిండిలో ఎక్కువ శాతం విటమిన్లు నష్ట మవుతాయి.

### 8. ఆరోగ్యరక్షణకు పరిశుభ్రత

పరిశుభ్రత మీద పూర్తి ధ్యాన ముంచాలి. ప్రతిరోజూ రెండు పూటలా స్నానం చేయాలి. రోజూ ఉతికిన దుస్తులనే ధరించాలి. దుప్పట్లను, తువ్వాళ్లను ఉతికిన వాటినే వాడుకొనాలి. ఇంట్లో ఈగలు, దోమలు, చీమలు, నల్లులు, బొద్దింకలు, బల్లులు చేరకుండా చూసుకొనాలి. స్నానాల గదులు, మలమూత్రశాలలు ఎప్పటికప్పుడు కడిగిస్తూ పరిశుభ్రంగా ఉండేలా ఫినాయిలు వంటివి చల్లిస్తూ ఉండాలి. నీళ్ళుపోయే కాలువల్లో మురుగు, దోమలు చేరకుండా కడిగించాలి. తినే పదార్థాల పై మూతలు ఉంచాలి. పాత్రలను శుభ్రపరచడమే కాక, వాటినుంచే స్థలం కూడా శుభ్రంగా ఉండాలి. గాలి, వెలుతురు వచ్చేలా కిటికీలు,

**రుచులే రోగానికి కారణమన్నది సత్యం.**

తలుపులు తెరచి ఉంచుకొనాలి. ఇంటికి పట్టిన బూజును, గోడలపై దుమ్మును ఎప్పటికప్పుడు దులిపించుకొనాలి. భోజనం తర్వాత నోరు బాగా పుక్కిలించి నీటితో కడుగుకొనాలి. పడుకునేముందు దంతాలను శుభ్రం చేసుకొనాలి. అతివేడి, అతిచల్లని పదార్థాలను తినరాదు. వాటివలన దంతాలు పుచ్చిపోవడం లేదా త్వరగా ఊడిపోవడం జరుగుతుంది. నిదురించే సమయంలో ముఖం మీద కప్పుకొనరాదు.

### 9. ఆరుబయటగాలి మంచిది

రాత్రులు ప్రొద్దుపోకుండా నిద్రించడం, ఉదయం పెందలకడనే లేచే అలవాటు చేసుకొనాలి. దీని వలన ఆరోగ్యం మీద మంచి ప్రభావం పడుతుంది. అంతేకాక ఆరోజు ఏపని చేసినా విజయవంతంగా, సమర్థవంతంగా పూర్తి చేయగల ఉత్సాహం ఉంటుంది. ప్రాతఃకాలపు నడక, వ్యాయామం, మాలిష్ వంటివి చేసిన తర్వాత శుభ్రంగా స్నానం చేసే అలవాటు అత్యంతావశ్యకం. నూలు దుస్తులు, వదులుగా ఉన్నవి ధరించటం సర్వశ్రేష్టమైనది. ఉదయం ఆరుబయట తిరిగేవారికి, వ్యాయామం చేసేవారికి ఆరోగ్యం చెడటమన్నది జరగదు. స్త్రీలకు బయట తిరిగే అవకాశం ఉండదు కనుక వారు ఇంటి పనులు స్వయంగా చేసుకోవటం ఆరోగ్యకరం.

### 10. బ్రహ్మచర్య పాలన

బ్రహ్మచర్యంపై సముచిత ధ్యాన ముంచాలి. వివాహితులు, అవివాహితులు కట్టుబాట్లను, ఆచారాలను విధిగా పాటించాలి. ఇవి ఎంత నియమంగా పాటించితే ఆరోగ్యం అంత పటిష్టంగా ఉంటుంది. విద్యార్థులకు ఇవి పాటించటం మరింత అవసరం. ఎందుకంటే ఇంద్రియాలను అదుపులో ఉంచుకొనక పోయినట్లయితే మానసిక దుర్బలత కలుగుతుంది. అది వారి లక్ష్యాలను చేరటానికి అడ్డంకిగా మారుతుంది. చీకూ చింతలకు మనసులో తావ్వికుండా ఎప్పుడూ సంతోషంగా ఉండేలా చూసుకోవాలి.

### దయగల బాలుడు థామస్ ఫిష్

*క్రిమియాకూ రష్యాకూ యుద్ధం జరుగుతున్న రోజులు అవి. అప్పటి సంఘటన ఇది. థామస్ ఫిష్ గ్రెనెడియర్ దళంలో బ్యాండులో వంశీవాదకుడు. ఘోరమయిన యుద్ధం జరుగుతోంది. యుద్ధభూమిలో గాయపడ్డ సైనికుడొకడు మూలుగుతుంటే ఫిష్ చూశాడు. ఆ సైనికుడు అత్యంత దీన స్వరంతో అడుగుతున్నాడు – 'నాకు ఒక కప్పు టీ త్రాగించండి'. బాలుని కోమల హృదయం ద్రవించి పోయింది. సైనికుడి ఆఖరి కోరిక తీర్చాలని తహతహలాడాడు. సైనికునివద్దనే టీ తయారుచే యటానికి అవసరమయిన పాత్రసామాగ్రి వస్తువులు ఉన్నాయి. గుండ్ల వర్షం కురుస్తుంటే వాటి నడుమనే ఆ బాలుడు దగ్గరే ఉన్న కట్టెలు ప్రోగుచేశాడు. తన ప్రాణాలకు లెక్కచేయకుండా టీ తయారుచేయటం మొదలుపెట్టాడు. ఇంతలో ఒక గుండు వచ్చి అతని టోపీ మీదుగా వెళ్ళింది. ఇంకొక గుండు అతని కోటు చేతుల గుండా రాచుకుంటూపోయింది.*

*బాలుడు చెదరలేదు, బెదరలేదు, పట్టుదలతో టీ తయారుచేసి గాయపడ్డ ఆ సైనికుడి వద్దకు వచ్చి, అతని చేత వేడివేడి టీ త్రాగించాడు. సైనికుడు బాలుని వీరత్వాన్ని ఆర్ద్రతను చూసి అతనిని మనస్సులోనే ఆశీర్వదించాడు. సుఖంగా అంతిమ శ్వాస వదలి శాశ్వతంగా లోకం నుండి సెలవు గైకొన్నాడు.*

ఈ పది నియమాలూ సాధారణ నియమాలు. వీటిని తమ జీవితంలో ఆచరించడానికి ప్రతి ఒక్కరూ అత్యధిక ప్రయత్నం చేయాలి. ఈ సూత్రాలను పాటించేలా కుటుంబ సభ్యులకు శిక్షణ ఇవ్వాలి. అమృత సమానమైన ఈ నియమాలను అవలంబించేలా తమ తోటివారిని కూడా ప్రేరేపించాలి. వీటి ద్వారా అనారోగ్య సమస్యలు అత్యధిక శాతం పరిష్కరింపబడతాయి.

★★★

**రోగానికి అసలయిన మందు పథ్యం.**

గాయత్రి మహిమ

# నేయిగా మారిన గంగనీరు

ఉత్తర ప్రదేశ్‌లోని కాన్పూరు జిల్లాలో ఖాండేవాల్ అనే సంత్ ఉండేవారు. బిఠూర్‌లోని పటకాపూర్ గ్రామంలో ఆయన ఆశ్రమం ఉండేది. సంత్ ఖాండేవాల్ ఆ ఆశ్రమంలో ఉండి, చాలా కాలం గాయత్రీ సాధన చేశారు. గురు పూర్ణిమ సందర్భంగా ఆశ్రమంలోనే భారీయెత్తున భోజనాలు తలపెట్టారు. పరిసర గ్రామాల ప్రజలకు తెలిసింది.

గురుపూర్ణిమ రోజు రానే వచ్చింది. ఉదయం నుండే ప్రజలు తండోపతండాలుగా రాసాగారు. చూస్తూ ఉండగానే, ఆశ్రమమంతా ప్రజలతో క్రిక్కిరిసిపోయింది. జనం పెరిగారు. స్థలం కొద్దిపాటిది. కనుక, ఉదయం నుంచే వంటలు ప్రారంభించారు. ఎంతో వైభవంగా రోజంతా భోజనాలు సాగాయి. అయినా ఇంకా జనం వస్తూనే ఉన్నారు.

సాయంత్రం దాటింది. రాత్రి అయింది. జనం ఇంకా వస్తూనే ఉన్నారు. భోజనాలు సాగుతూనే ఉన్నాయి. జనం అంచనాలను మించి వస్తున్నారు. ఆ పరిస్థితిలో సామాను కొరత ఏర్పడడం సహజమే. ఆ రాత్రి అదే జరిగింది. అనేక అవసర వస్తువులు కొరవడ్డాయి. ఇతర వస్తువుల కొరతను ఏదోవిధంగా భర్తీ చేయగలిగారు. కానీ, నేయి ఎక్కడా దొరకలేదు.

ఆ స్థితిలో నిర్వాహకులు మరో దారి లేక సమస్యను ఖాండేవాల్‌జీ ముందుంచారు. నాలుగు డబ్బాల నేయి అవసరం అయిందనీ, అది లేకపోతే వంట వండడం సాధ్యపడదనీ వారు ఆయనకు నివేదించారు. ఖాండేవాల్‌జీ కొద్దిసేపు ప్రశాంతంగా ధ్యానంలో కూర్చున్నారు. తర్వాత నిర్వాహకులతో ఇలా అన్నారు –

“వెళ్లండి. గంగానదినుండి గంగనీరు తీసుకురండి. దాన్ని నేయిగా ఉపయోగించండి.”

నిర్వాహకులు విస్తుపోయి చూస్తున్నారు. గురువుగారు మళ్లీ మళ్లీ అదే మాట చెప్పారు. నలుగురు మనుషులు వెళ్లి నాలుగు డబ్బాల గంగనీరు తెచ్చారు. ఆ నీటితోనే పూరీలూ, కూరలూ తయారయినాయి. వాటిని అందరికీ వడ్డించారు. అంత రుచికరమైన భోజనం తాము ఎన్నడూ చేయలేదని అంతా సంతోషాన్ని వెలిబుచ్చారు.

మరునాడు గురువుగారి ఆదేశం ప్రకారం నిర్వాహకులు నాలుగు డబ్బాల నేతిని గంగానదిలో పోశారు. అందుకు కారణం అడగగా– “నిన్న మనం గంగానదినుండి నాలుగు డబ్బాల నేయి అరువు తీసుకున్నాము. దాన్ని తిరిగి ఇవ్వాలి” అని గురువుగారు వివరించారు.

గాయత్రీ సాధనలో ఉన్న శక్తి అపారమైనది. అది పాత్రత కలిగినవారికే లభిస్తుంది. అలాంటి వ్యక్తులు ఒకోసారి ప్రకృతి విధానాన్ని సమయోచితంగా మలచి అద్భుతాలు చూపుతారు. అయితే పరబ్రహ్మయొక్క వ్యవస్థకు ఎన్నడూ భంగం కలుగనీయరు.

★★★

*ఈ పత్రికను మీరు చదివిన తర్వాత ఈ నెలలో అయిదుగురిచేత చదివించండి.*

**శరీరం పాంచ భౌతికం. చికిత్సా పాంచ భౌతికమే.**

బోధకథ

# నిరాశ్రయుల ప్రవక్త

విశ్వ విఖ్యాతి గాంచిన ఫాదర్ ఆపేరియర్ ఫ్రాన్స్ రాజధాని పారిస్‌లో ఉండేవారు. అది గడగడ వణికించే చలికాలం. ఒకరోజు రాత్రి ఆయన మంచి నిద్రలో ఉండగా, బయటనుండి తలుపుకొట్టిన చప్పుడు వినిపించింది.

ఇది అర్ధరాత్రి తలుపెవరు కొడుతున్నారు అని ఆయనకు సందేహం వచ్చింది. తనకు తానే సమాధానం చెప్పుకొని, ఎవరో ఆపదలో ఉన్న వ్యక్తి అయి ఉంటాడు అని అనుకుంటూ, తలుపు తీసాడు. ఆయన ఊహించినట్లుగానే, బయట నామమాత్రం బట్టలతో దీనంగా నుంచున్న వ్యక్తి కనిపించాడు. ఫాదర్ ఆ వ్యక్తిని "నాయనా ! నువ్వు ఇంత అర్ధరాత్రి, ఇంత చలిలో నా దగ్గరికి ఎందుకు వచ్చావు?" అని అడిగారు. ఆ వ్యక్తి– "ఫాదర్ ! నాకు చలి వేస్తోంది. ఈ రాత్రి మీ ఇంట్లో నాకు ఆశ్రయం ఇవ్వండి"– అని దీనంగా అర్థించాడు.

భగవంతుని సేవ కోసం తన జీవిత సర్వస్వాన్ని సమర్పించిన ఫాదర్ ఆ అభాగ్యుడికి ఆశ్రయం ఇవ్వకుండా ఎలా ఉండగలడు. "నా దగ్గరకు రావటానికి ఇంత ఆలస్యం ఎందుకు చేశావు? ఇంకా ముందరే వచ్చి ఉండాల్సింది కాదా"– అంటూ ప్రేమగా అతన్ని మందలించి ఇంట్లోకి తీసుకువెళ్ళాడు. మంచం మీద చక్కటి దుప్పటి పరిచి, కప్పుకోవటానికి మందపాటి రజాయి ఇచ్చాడు. ఆ వ్యక్తి రాత్రంతా కమ్మగా నిద్ర పోయాడు.

తెల్లవారింది. రోజంతా మామూలుగా గడిచి పోయింది. ఒక రాత్రి గడవడం కోసం వచ్చిన ఆ అపరిచిత వ్యక్తికి తిరిగి వెళ్ళటానికి మనస్కరించలేదు. ఒకటి, రెండు, మూడు, నాల్గు– ఇలా వారం రోజులు గడిచిపోయాయి. వచ్చిన వ్యక్తి వెళతానని అనలేదు. ఫాదర్ అతన్ని వెళ్ళమనీ అనలేదు.

పడిపోతున్న ఉష్ణోగ్రతలు కారణంగా ఇలాంటి వాళ్ళే మరికొంతమంది చలిబారి నుండి తమనుతాము కాపాడు కోవటం కోసం ఫాదర్ దగ్గరకి వచ్చి ఉండడం మొదలుపెట్టారు. ఇలా ఆశ్రయం కోసం వచ్చేవాళ్ళ సంఖ్య రోజురోజుకీ పెరుగుతుండటంతో, ఫాదర్ దృష్టి వాళ్ళ మీదకు మళ్ళింది. ఒకసారి ఫాదర్ వాళ్ళందరినీ పిలిచి, ''మీలాంటి వాళ్ళు ఈ నగరంలో ఎంతమంది ఉన్నారు"–అని అడిగాడు. "చాలామంది ఉన్నారండి"– అని వాళ్ళు సమాధానం చెప్పారు. బాగా ఆలోచించి– "అయితే వాళ్ళందరినీ సాయంత్రం చర్చికి రమ్మని చెప్పండి"– అంటూ వాళ్ళకి ఆదేశం ఇచ్చాడు.

సాయంత్రం వాళ్ళందరూ చర్చిలోకి రాగానే, "నేను ఈ చలిబారినుండి మిమ్మల్ని కాపాడటం కోసం ఒక శాశ్వత పరిష్కారాన్ని ఆలోచించాను. దీని కోసం మనం ఒక పెద్ద ఇల్లు కట్టుకుందాం"– అంటూ ఫాదర్ తన మనసులోని మాటను వాళ్ళతో చెప్పాడు. ఈ మాటలు విని, దీన్ని నమ్మశక్యం గాని నిజంగా భావించి నోట మాట లేకుండా ఆశ్చర్యంగా ఆయనకేసి చూస్తూ ఉండిపోయారు వాళ్ళంతా. కాని వాళ్ళలో ఒక వ్యక్తి ధైర్యం చేసి లేచి నిలబడి, ''ఫాదర్ ! మాతో ఎందుకు హాస్యాలాడుతున్నారు? రెండు పూటలా తినడానికి తిండి,

ఏకాదశికొక ఉపవాస దీక్ష. ఆరోగ్యాని కది శ్రీరామరక్ష.

కట్టుకోవటానికి బట్టలు సంపాదించటానికే మేము అష్టకష్టాలు పడుతూఉంటే, ఇల్లు ఎలా కడతాం"– అని ఎదురు ప్రశ్న వేశాడు. ఫాదర్ అతన్ని ప్రోత్సహిస్తూ, "సామూహికంగా చేసే పనికి ఎంత శక్తి ఉంటుందో నీకు తెలియదు. సామూహికంగా అందరూ కలిసి పనిచేస్తే ఎన్నో అసాధ్యాలను సుసాధ్యాలు చేయవచ్చు. మనం అందరం కలిసికట్టుగా పనిచేసి సామూహికశక్తికి గల సామర్థ్యాన్ని అందరికీ రుజువు చేద్దాం"– అని అన్నాడు. "నేను చెప్పేది జాగ్రత్తగా వినండి. కష్టించి పనిచెయ్యడానికి కంకణబద్ధులుకండి"– అంటూ తన ప్రణాళికను వివరంగా వాళ్ళకు చెప్పాడు. ఫాదర్ చెప్పిన ప్రణాళిక ప్రకారం ఇల్లులేని వాళ్ళందరూ ఆ నగరంలోని చెత్తకుప్పలన్నీ వెతికి పగిలిన గాజు సామాను, విరిగి ముక్కలయిన కలప సామాను, పనికిరాని గిన్నెలు ప్రోగుచేసారు. ఎందుకూ పనికిరావని పడవేసినవాటిని మరమ్మతు చేసి బజారులో తక్కువధరకి అమ్మటం మొదలుపెట్టారు.

వచ్చిన డబ్బులతో మళ్ళీ అదే వ్యాపారం కొనసాగించారు. క్రమంగా డబ్బు ప్రోగవుతోంది. వ్యాపారం బాగా పుంజుకుంది. ఒక చక్కటి బస్తీని నిర్మించటానికి కావలిసిన డబ్బు సమకూరగానే, ఈ వార్త నగరమంతా ప్రాకిపోయింది. పారిస్‌లోని వార్తా పత్రికలేకాక; మొత్తం ఫ్రాన్సు దేశానికి చెందిన అన్ని వార్తా పత్రిలూ ఫాదర్ ఆపేరియర్ కుశాగ్రబుద్ధిని, ఇళ్లులేని ఆ శ్రామికుల కష్టంచే పనిచేసే నైజాన్ని వేనోళ్ళ కీర్తించాయి. ప్రజలు బస్తీ నిర్మాణానికి తమవంతు సహాయాన్ని అందించారు. కుశాగ్రబుద్ధికి, శ్రమకి ప్రేరణగా నిలిచిన కారణంగా ఆ బస్తీకి 'చెత్త ఏరుకునే వాళ్ళ బస్తీ' (Ran Pickers Colony) అనే పేరు పెట్టారు.

ఫాదర్ ఆపేపియర్ లాంటి సాధకులు ఎందరున్నారో ఈ విశాల ప్రపంచంలో.

★★★

## ఆత్మసౌందర్యం

*విక్రమాదిత్య మహారాజు, కాళిదాస మహాకవి ఇరువురూ ఉద్యానవనంలో విహరిస్తున్నారు. విక్రమాదిత్యుడు కాళిదాసుతో ఇలా అన్నాడు– 'కవివర్యా, మీరు గొప్ప మేధావులు, ప్రతిభాశాలురు. భగవంతుడు ఎందుకు చేశాడో తెలియదు. మీకు అందమైన శరీరాన్ని ఇవ్వలేదు. అద్వితీయమైన మీ బుద్ధి కౌశల్యంతో పోల్చి చూస్తే మీది అందవిహీనమైన రూపం.' కాళిదాసుకు వ్యవహార కౌశల్యం ఎక్కువ. వెంటనే సమాధానం చెప్పటం భావ్యం కాదని ఆయన ఊరుకున్నాడు.*

*రాజభవనానికి తిరిగి వచ్చిన తరువాత కాళిదాసు రెండు పాత్రలు తెప్పించాడు. ఒకటి మట్టిపాత్ర. ఇంకొకటి బంగారుపాత్ర. రెంటినీ మంచినీటితో నింపారు. కొంతసేపైన తరువాత కాళిదాసు విక్రమాదిత్యుడిని అడిగాడు – 'రాజా! రెండు పాత్రల నుండి నీరు త్రాగి చూడండి. ఏ పాత్రలో నీరు ఎక్కువ చల్లగా ఉంది?' రెండింటిలో నుండి ఒక గుక్క త్రాగి విక్రమాదిత్యుడు చెప్పాడు – 'మట్టిపాత్రలో నీరే చల్లగా ఉంది.' కాళిదాసు మందహాసం చేస్తూ ఇలా అన్నాడు– 'నీటి చల్లదనం పాత్ర పైఆకారం మీద ఆధారపడి ఉండదు. అలాగే మహారాజా! ప్రతిభ అనేది కూడా శరీరాకృతి మీద ఆధారపడి ఉండదు. అది ఆత్మకు సంబంధించిన విషయం.' ఇది విన్న మహారాజుకు తన పొరపాటు తెలిసింది. ఆయన కాళిదాసు గొప్పతనానికి, సమయస్ఫూర్తికి జేజేలు పలికాడు. అటు తరువాత ఎన్నడూ కాళిదాసు అందవిహీనమైన శరీరాన్ని గురించి వ్యంగ్యంగా మాట్లాడలేదు.*

**చీపురు చేయు ఇంటిని శుభ్రం. ఉపవాసం చేయు ఒంటిని శుభ్రం.**

సాధన విజ్ఞానం

# పంచీకరణ విద్య

## శరీరంలోని పంచభూతాలను విడదీసే విద్య

అధ్యాత్మ సాధనలోని పంచీకరణ విద్య ఎంతో వికాసం పొందిన విద్య, అతి వైజ్ఞానికం అయిన విద్య. అది సిద్ధాంతం మాత్రమే కాదు. ఆ విద్య తెలిసిన వ్యక్తులు దాని ప్రయోగ విధానాన్ని కూడ తెలుసుకుని ఉంటారు. దాన్ని సద్వినియోగపరచి ప్రయోజనం పొందుతారు కూడా. ఆ విద్య ద్వారా ఇతరులకు కూడా సహాయపడతారు. పాత్రత లోపించడంవల్ల ఈ గుహ్య విద్య అంతగా కనిపించడం లేదు. అయితే, ఆధ్యాత్మిక రంగంలో దీన్ని తెలుసుకుని ప్రయోగించేవారికి ఎన్నడూ కొదువ లేదు.

పంచీకరణ అంటే అర్థం పంచ భూతాలతో నిర్మించబడిన స్థూల శరీరాన్ని పంచ భూతాల సూక్ష్మ శక్తులుగా రూపాంతరం చెందించడం. పృథివి, జలం, వాయువు, అగ్ని, ఆకాశములలో ఏదో ఒక భూతంగా ఈ శక్తి కానరావచ్చు.

ఒక యోగి ఒక పెద్ద కడవలోని నీరుగా తనను తాను మార్చుకున్నాడు. ఆ కడవనుండి ఒక లోటా నీటిని బయటకు తీశారు. ఆ తర్వాత ఆ యోగి తన స్థూల శరీరంలోనికి తిరిగి వచ్చారు. అప్పుడు ఆయనకు ఒక చెయ్యి లేదు. అంటే – ఆయన చేతికి సంబంధించిన జల భూతానికి చెందిన భాగం ఆ లోటాలోనికి వెళ్లిపోయింది. ఇది ఒక యథార్థ సంఘటన.

ఈ సిద్ధి యొక్క సంపూర్ణ స్వరూపం తైలింగ స్వామి జీవితంలోని ఒక సంఘటనలో కానవస్తుంది. ఆ సంఘటనలో ఆయన తన శరీరాన్ని గంగా జలంగా రూపాంతరం చేశారు.

## పాలలా తెల్లబడ్డ నదీజలం

మహాయోగి తైలింగ స్వామి గురువు గజానంద్ మహారాజ్ జీవితంలోని ఒక సంఘటన ఈ పంచీకరణ విద్యకు సంబంధించినదే.

టిబెట్‌లోని మానస సరోవరంలో యోగ సాధన చేసిన తర్వాత 1726లో ఆయన నర్మదా నది ఒడ్డున ఉన్న మార్కండేయ ఋషి ఆశ్రమానికి వచ్చారు. అక్కడ సాధన సాగించారు. ఆ ఆశ్రమంలో 'ఖాకీ బాబా' అనే సంత్ నివసించేవారు. ఒక రోజున ఖాకీ బాబా నర్మదా నది నీటిని చూచి ఆశ్చర్యంలో మునిగిపోయారు. ఆ నది నీరు పాలవలె తెల్లగా ఉంది. నురుగులతో ఉంది. గజానంద్ మహారాజ్ ఆ పాలను దోసిట్లోకి తీసుకుని త్రాగుతున్నారు.

## అదృశ్యం అయిన తైలింగ స్వామి

సిద్ధ యోగి తైలింగ స్వామి ఈ విద్యలో నిష్ణాతులు. ఆయన లెక్కలేనన్ని సార్లు తమ శరీరాన్ని పంచ భూతాలలో విలీనం చేసేవారు; వాటిని కలిపి తిరిగి తమ శరీరంలోనికి వచ్చేవారు.

ఒకసారి కాశీలో ఆయన నగ్నంగా తిరగడంవల్ల ఆంగ్లేయ న్యాయాధిపతి ఆయనను జైలులో బంధించాలని ఆదేశించాడు. ఆయనను పట్టుకోవడానికి పోలీసులు ముందుకువచ్చారు. అకస్మాత్తుగా తైలింగ స్వామి అదృశ్యం అయిపోయారు. న్యాయ స్థానం ఆశ్చర్యచకితం అయింది.

## ఆదిశంకరుల ఆకాశ యానం

జగద్గురువు శంకరాచార్యులుకూడ ఈ విద్యలో పారంగతులు. ఒక రోజున ఆయనకు తమ నాలుకతో తల్లి పాలను త్రాగుతూన్న అనుభూతి కలిగింది. తమ తల్లి తమను స్మరిస్తూన్నదనీ, ఆమెకు చివరి గడియలు సమీపించాయనీ ఆయన గ్రహించారు. మరణ సమయంలో దగ్గర ఉంటాననీ, ఆమెకు అంత్య సంస్కారాలు చేస్తాననీ ఆయన మాట ఇచ్చి ఉన్నారు. శంకరాచార్యులు తమ శరీరాన్ని ఆకాశ రూపంలోకి మార్చుకున్నారు. ఆకాశ మార్గంలో తల్లివద్దకు చేరుకున్నారు. మామూలు దారినే రమ్మని తమ శిష్యులకు చెప్పారు.

**దాచుకున్న మలమే వేచి ఉన్న రోగం.**

## వరద నీరంతా కలశంలోనికి

శంకరాచార్యుల జీవితంలోని మరో సంఘటన. తుంగానది ఒడ్డున ఒక గుహలో శంకరులు నివసించసాగారు. ఆ గుహలో వారి గురువు గోవిందపాదులు తపస్సు చేస్తున్నారు. అది వర్షా కాలం. తుంగానదికి ఉధృతంగా వరద వచ్చింది. నది గుహవద్దకు వచ్చింది. అపుడు శంకరులు ఒక కలశాన్ని గుహ ద్వారంవద్ద పెట్టారు. ఆ వరదనీరంతా ఆ కలశంలో ఇమిడిపోయింది.

## వాయు మార్గంలో ఇంగ్లాండు యాత్ర

యోగి రాజు శ్యామాచరణ్ లాహిరీ దానాపూర్ లోని పబ్లిక్ వర్క్స్ శాఖ మిలిటరీ ఇంజనీరింగ్ వర్క్స్ ఆఫీసులో గుమస్తాగా పని చేసేవారు. అయినా సాధనా శిఖరాగ్రాన్ని అందుకున్నారు.తన బ్రిటిషు ఆఫీసరు భార్య ఇంగ్లాండులో జబ్బుతో చావు బ్రతుకుల్లో ఉన్నదని ఆయనకు తెలిసింది. ఆ తర్వాత 20-25 రోజులకు ఆమె ఆరోగ్యంగా భారత్‌కు వచ్చింది. తన భర్తతోపాటు లాహిరీగారిని చూచి ఆమె ఆశ్చర్యంలో మునిగిపోయి, "మీరు ఇంగ్లాండునుండి ఎపుడు వచ్చారు?" అని ఆయనను అడిగింది. ఆమె ఇంకా ఇలా చెప్పింది-"నేను జబ్బుతో ఉండగా, ఒక రోజున ఈ వ్యక్తి నా తల దగ్గర నిలబడి, ఎంతో ప్రేమగా నా తల నిమురుతున్నారు. నాకు ఏమాత్రం పరిచయం లేని వ్యక్తి నా ఇంటిలోకి, నా గదిలోకి ఎలా రాగలిగారో అని నేను ఆశ్చర్యపోయాను. పడుకుని ఉన్న నన్ను ఆయన కూర్చోబెట్టారు. కూర్చొనగానే నా జబ్బు నయమయిపోయింది. నేను గాబరాపడ్డాను. ఆయన ఇలా అన్నారు-'తల్లీ! నీ జబ్బు పూర్తిగా నయమయింది. నీకింక ఎలాంటి బాధా ఉండదు. భారత్‌లో నీ భర్త ఎంతో ఆందోళనగా ఉన్నారు. ఆయనకు ఇపుడే ఉత్తరం వ్రాసి పోస్టు చెయ్యి. రేపు నౌక కంపెనీకి వెళ్లి సీటు బుక్ చేసుకో. త్వరగా భారత్‌కు వెళ్లు. లేకపోతే నీ భర్త ఉద్యోగం వదిలిపెట్టి ఇంగ్లాండు వస్తాడు. ఇలా చెప్పి, ఆ వ్యక్తి అదృశ్యం అయిపోయాడు."

లాహిరీ మహాశయుని పంచీకరణ విద్యకు ఒక ఉదాహరణ ఈ సంఘటన. కష్టాలలో ఉన్నవారిని ఆదుకోవడానికై ఆయన సాధారణంగా ఈ విద్యను ప్రయోగించేవారు.

## అణువణువులో రమణ మహర్షి

రమణ మహర్షి పరమ శ్రేష్ఠులైన జీవన్ముక్తులు. ఆయన కూడ ఒకే సమయంలో అనేక రూపాలలో కనిపించేవారు. రుద్రరాజ్ పాండే అలాంటి ఒక సంఘటనను ప్రత్యక్షంగా దర్శించారు. అరుణాచలేశ్వర ఆలయాన్ని దర్శించడానికై ఆయన తిరువన్నామలై వెళ్లారు. శివ లింగంపై దృష్టి నిలపగానే, ఆయనకు అక్కడ రమణ మహర్షి కూర్చొని ఉన్నట్లు కానవచ్చింది. కళ్లు మూసుకొని తెరిచేసరికి, కనిపించిన దృశ్యం ఆయనను ఆశ్చర్యంలో ముంచివేసింది. ఆయనకు ఏవైపు చూచినా రమణ మహర్షి కానవచ్చారు. కణ కణంలో రమణమహర్షి వ్యాపించి ఉండడం ఆయనకు కనిపించింది.

## సర్వత్రా బ్రహ్మ దర్శనం

స్వామి వివేకానందుని జీవితంలో కూడ ఇలాంటి సంఘటన జరిగింది. మహాగురువు శ్రీరామకృష్ణ పరమహంస ఆయనను స్పర్శించేసరికి, ఆయనకు సర్వత్రా బ్రహ్మ దర్శనం జరిగింది.

## శ్రీమాత మహిమ

అలాగే - శ్రీ అరవింద ఆశ్రమం శ్రీమాత చంద్రదీప తల నిమిరేసరికి, ఆయనకు పాండిచెరిలోని అన్ని వస్తువులలో నీల జ్యోతితో ఆవరించబడిన బ్రహ్మయొక్క దర్శనం కలిగింది. ఆ అనుభూతి ఆయనలో పెక్కు రోజులు నిలచిపోయింది.

## రాసలీలలో పంచీకరణ విద్య

శ్రీకృష్ణుడు రాసలీలలో ప్రతి గోపికతో నృత్యం చేయడం అనే మహా ప్రక్రియ వట్టి కపోల కల్పన కాదు. ఆ ప్రక్రియలో పంచీకరణ మహావిద్య ఇమిడి ఉంది.

★★★

**ఈ నెలలో కనీసం అయిదుగురు వ్యక్తులను పత్రిక చందాదారులుగా చేర్పించండి.**

**రుచులవెంట పరుగులు తీయకు. ఆరోగ్యపుటంచులు దాటకు.**

ధారావాహిక : గాయత్రీ మహా విజ్ఞానం -22

# తన్మాత్ర సాధన

మన శరీరంలోని సమస్త సంచార యంత్రములు పంచ తత్వములచే తయారుచేయబడినవి. పృధ్వి, జలము, వాయువు, అగ్ని, ఆకాశము అనే పంచ తత్వములు కావలసిన పరిమాణములో లోపల ఉండడం వలన వివిధ ఆకారములు, గుణ ధర్మములు గల వస్తువులు తయారవుతాయి.

ఈ పంచ తత్వముల యొక్క సూక్ష్మశక్తుల అనుభూతినే పంచ తన్మాత్రలు అని పిలుస్తాము. శబ్ద, స్పర్శ, రూప, రస, గంధములని వీని పేర్లు.

ఆకాశముయొక్క తన్మాత్ర శబ్దము; దానిని చెవిద్వారా మనం అనుభవం పొందుతున్నాము. చెవి ఆకాశతత్వం ప్రధానంగా గల ఇంద్రియము. అగ్ని తత్వముయొక్క తన్మాత్ర రూపము. ఇది నేత్రముద్వారా అనుభవములోనికి వస్తుంది. రూపమును కండ్లు మాత్రమే చూడ గలుగుతాయి. జల తత్వం యొక్క తన్మాత్ర రసము. రసమును జిహ్వద్వారా అనుభవిస్తాము. చేదు, తీపి, వగరు, పులుపు, కారము, ఉప్పు అను రసముల రుచిని జిహ్వ తీసుకుంటుంది. పృధ్వీ తత్వము యొక్క తన్మాత్ర గంధము. అది ముక్కు ద్వారా గ్రహింప బడుతుంది. ఈ విధంగానే వాయువు యొక్క తన్మాత్ర స్పర్శ యొక్క ఎరుక, చర్మము ద్వారా తెలుస్తుంది. చర్మము నందు వ్యాపించి యున్న జ్ఞాన తంతువులు ఇతర వస్తువుల యొక్క తాపము, భారము, ప్రమాణము మొదలైన వానిని చర్మయొక్క ప్రతిక్రియగా అనుభవిస్తాయి.

ఇంద్రియముల యందు తన్మాత్రలను అనుభవించు శక్తి లేనిచో- ప్రపంచమునకు, శరీరమునకు గల సంబంధం తెగిపోతుంది. ప్రపంచమందు జీవన రూపమున కుపకరించు వ్యవస్థ సక్రమంగా ఉంటే జీవుడు పూర్తిగా ఆనందాన్ని అనుభవించవచ్చును. విశ్వమందలి వివిధ పదార్థములయందు ఆకర్షణగా మనం దేనిని భావిస్తామో దాని ఏకైక కారణము తన్మాత్ర శక్తి. మనం ప్రపంచంలో ఏ పదార్థాన్నీ చూడలేమని భావిస్తా మనుకోండి. అప్పుడు సర్వత్రా నీరవత్వం నిండి ఉంటుంది. రుచిని గ్రహించలేమని అనుకోండి. అప్పుడు ఏది తిన్నా తినక పోయినా ఒకటే. గంధముయొక్క అనుభవము పొందలేమని అనుకోండి. కుళ్ళు కాలువకు, ఉపవనానికి తేడా ఉండదు. చర్మమునకు స్పర్శశక్తి లేదనుకోండి. చలి, వేడి, వాహ్యాళి, కోమల శయ్య మొదలైన వాని ప్రయోజనం ఉండదు.

పరమాత్మ పంచ తత్వముల యందు తన్మాత్రలను ఉత్పన్నంచేసి వాని అనుభవము కొరకు శరీరమందు జ్ఞానేంద్రియములను సృష్టించి ప్రపంచమందు సౌభ్రాతృత్వమును ఆకర్షణతో సంబద్ధం చేశాడు. పంచ తత్వములు కేవలం స్థూలములే అయితే వానిలో తన్మాత్రలు లేకపోతే ఇంద్రియములకు ప్రపంచములోని ఏ పదార్థమువలన నయినా ఆనందము కలుగదు. అంతా కేవలము నీరసం, నిరర్థకం, వ్యర్థం. తత్వము నందు తన్మాత్రలు ఉన్నను, శరీరమందు జ్ఞానేంద్రియములు లేకున్న - గాలిలో ఎగురుతున్న కీటాణువుల రీతి రసానుభూతి కలుగక మానవుని జీవితం నీరస మవుతుంది. ఇంద్రియముల యందు సంవేదనా శక్తి, తత్వముల యొక్క తన్మాత్రలు కలియుడం ద్వారా ప్రాణులకు అనేక శారీరిక మానసిక, రసములు అనుభవము లోనికి వస్తాయి. అవి లభించటం వలన అవి జీవనధారణ చేయగలుగుతున్నాయి. వాటికి ఈ ప్రపంచమును వదిలిపెట్ట బుద్ధికాదు. వారు ఈ జన్మ-మరణ చక్రమున భవ బంధములచే బంధితులై ఉంటారు.

**పరగడుపున సేవించే పవిత్ర జలపానం స్వస్థత చేకూర్చే ప్రప్రథమ సోపానం.**

ఆత్మవంక చూడక, ఆత్మ కళ్యాణము నందు ప్రవృత్తులు కాక - ప్రాపంచిక వస్తు సంగ్రహణమునందు, వానిపై అధికారమునందు, వాని సంపర్కము వలన రసానుభూతిలో మనిగియుండవలెనను లాలస యందును మనుష్యుడు తత్పరుడై యున్నాడు. రంగు రంగుల బొమ్మలతో ఆడుకోవడంలో పిల్లలు ఏవిధంగా తన్మయులై అన్న పానీయములను మరచిపోతారో - ఆవిధంగా తన్మాత్రల యందలి తన్మయత్వంతో మానవుడు కష్టాలు పడుతూనే మృత్యువునకు భయపడతాడు. మరణించటానికి తయారుకాడు. మృత్యువు పేరు వింటూనే కంపిస్తాడు. దీనికి ఒకే కారణం ఉన్నది - ప్రాపంచిక విషయముల యందు భ్రాంతి.

వానియందు తన్మాత్రలయందు ఏ మోహజనక ఆకర్షణ యున్నదో అది కష్టము అభావము అనే వానితో పోలిస్తే ఆకర్షవంతంగా సులభంగా ఉంటుంది. కష్టాలు సహిస్తూ గూడ వానిని వదిలిపెట్టటానికి తయారుగా ఉండరు మనుషులు.

పంచేంద్రియములనే గుంజకు, పంచతన్మాత్రలనే తంతువులతో జీవుడు బంధితుడై యున్నాడు. ఆ తంతువులు బహుఆకర్షవంతములు. అవి రంగు రంగుల చమత్కారముతో చేయబడ్డాయి. వానికి రత్నాలు, పట్టుత్రాళ్ళు, గుంజలు, వెండి బంగారాలతో మాణిక్యాలు పొదగబడి ఉంటాయి. జీవ రూప హయము ఈ తంతువులతోనే బంధింపబడి యున్నది. బంధనము తోడి దుఃఖమును మరచి, తంతువుల యొక్క గుంజ యొక్క లావణ్యమును జూచి, త్రెంపుకుపోవలననే కోరికను గూడ అది వదిలివేసింది. దానికి ఆ బంధనమే హాయిగా ఉన్నది. రోజంతా బండి లాగుతూ, కొరడా దెబ్బలు తింటూ కూడ, త్రాళ్ళమీద గుంజలమీద వ్యామోహం వదలుట లేదు. ఈ బుద్ధి యొక్క దూరదృష్టి శూన్యతను, వాస్తవాన్ని తెలుసుకోలేక పోవడాన్ని శాస్త్రముల యందు అవిద్య, మాయ, భ్రాంతి అనే పేర్లతో పిలుస్తారు. ఈ మాయనుండి రక్షింపబడటానికి అనేక ప్రకారములైన ధార్మిక కథలు, గాథలు, ఉపాసనలు, సాధనల విధానం చెప్పబడినది.

ఇంద్రియముల, తన్మాత్రల మిశ్రమం వల్ల ఉత్పన్నమైన దురదవల్ల రాత్రింబవళ్ళు మానవులు గోళ్ళకు విశ్రాంతి లేకుండా గోకుతూనేఉన్నారు. మనసును వశంచేసుకోవడంలో అన్నింటికన్నా హెచ్చు బాధ ఈ దురద కలిగిస్తుంది. రెండవ వంకకు చిత్తాన్ని పోనీయనంత మజాగా ఉంటుంది గోక్కోవడం. దీనితో పోలిస్తే ఇతర విషయములు పట్టవు. అందువలన ఏకాగ్రతా సాధన పైకి తరచుగా మనస్సు పోదు.

★★★

## సమయ పాలన

*అమెరికా రాష్ట్రపతి వాషింగ్టన్ భోజనం చేయటానికి ఒక నిర్ణీత సమయం ఉంది. నాలుగు గంటలకు ఖచ్చితంగా ఆయన భోజనం చేస్తారు. ఒకనాడు ఆయన కాంగ్రెసుకు ఎన్నికయిన నూతన సభ్యులను విందుకు ఆహ్వానించారు. వారు రావటం కొద్దిగా ఆలస్యమయింది. రాష్ట్రపతి సరిగ్గా సమయానికి భోజనం చేయటం ఆరంభించారు. ఆహ్వానించబడిన సభ్యులు వచ్చి ఇది చూసి బాధపడ్డారు. వారిని చూచి వాషింగ్టన్ ఇలా చెప్పారు - నా వంటవాడు అతిథులు వచ్చారా లేదా అని నన్ను అడుగడు. భోజనానికి సమయం అయిందా లేదా అని మాత్రమే అడుగుతాడు'.*

*వాషింగ్టన్ తన ఆచరణ ద్వారానే తన దేశీయులకు సమయ పాలన విషయంలో పాఠం నేర్పారు.*

**బాహ్య శుద్ధికి జన స్నానం. అంతశ్శుద్ధికి జలపానం.**

ఆచరణలో అధ్యాత్మ

# శుభ ఆకాంక్ష ద్వారా సద్బుద్ధి

**యే యథా మాం ప్రపద్యంతే**
**తాంస్తథైవ భజామ్యహమ్ ।**
**- భగవద్గీత 4-11**

అనగా-

ఎవరు నన్ను ఏవిధంగా భజిస్తారో, వారిని నేను ఆవిధంగా భజిస్తాను. అంటే - నన్ను ఎలా కొలిస్తే నేను అలాంటి ఫలితం ఇస్తాను.

నన్ను ఉత్తమ భావంతో చూచేవారికి నేను ఉత్తమ ఫలితాలను ఇస్తాను; మధ్యమ భావంతో చూచేవారికి మధ్యమ ఫలితం ఇస్తాను; అధమ భావంతో చూచేవారికి అధమ ఫలితాలను ఇస్తాను- అని పరమాత్మ చెపుతున్నాడు. నిర్ణయం తీసుకోవలసింది నీవేనని ఆ విధంగా పరమాత్మ బోధిస్తున్నాడు. నీవు మంచి ఫలితాన్ని కోరుకుంటే, దానినే పొందగలుగుతావు. చెడు ఫలితాన్ని కోరుకుంటే, దాన్నీ పొందగలుగుతావు. నీకు మంచి ఫలితాలను ఇవ్వడం నా ఇష్టప్రకారం జరగదు. నీ భావనకు అనుగుణంగా, నీ ఆలోచనకు అనుగుణంగా, నీ కోరికకు అనుగుణంగా, నీ పనికి అనుగుణంగా నేను నీకు ఫలితాన్ని ఇస్తాను.

నీ కోరికా, నీ ఆలోచనా, నీ పనీ మంచివి అయితే- నీకు మంచి ఫలితం వస్తుంది. నీ కోరికా, నీ ఆలోచనా, నీ పనీ చెడ్డవి అయితే - నీకు చెడు ఫలితం వస్తుంది. ఎందుకంటే - మంచి ఫలితాన్ని కాని, చెడ్డ ఫలితాన్ని కాని పరమాత్మ తన ఇష్ట ప్రకారం ఇవ్వడు, మన భావన ప్రకారం ఇస్తాడు.

కనుక మనం మన భావనను సంస్కరించుకోవాలి. మన భావనను సంస్కరించుకోవడమే మన అదృష్టాన్ని మార్చుకునే తాళపు చెవి అని మనం గుర్తించాలి.

కనుకనే జ్ఞానం ఏడు విధములనీ, వాటిలో మొదటిది శుభ ఇచ్ఛ - మంచి కోరిక - అనీ వశిష్ఠ మహర్షి శ్రీరామునికి ఉపదేశించారు. శుభేచ్ఛ కలిగిన తర్వాతనే జ్ఞానపు రెండవ మెట్టు ఎక్కగలుగుతామని గుర్తించాలి. ఎందుకంటే - శుభేచ్ఛయే స్వర్గానికి మార్గం; శుభేచ్ఛయే మన అదృష్టాన్ని మార్చే తాళపు చెవి.

కనుకనే - పూర్వపు పవిత్ర పురుషులు సదా ఉదయం నిద్ర లేవగానే పరమాత్మను శుభేచ్ఛ ఇవ్వమని ప్రార్థించేవారు.

**సర్వే భవంతు సుఖినః**
**సర్వే సంతు నిరామ యాః ।**
**సర్వే భద్రాణి పశ్యంతు**
**మా కశ్చిత్ దుఃఖ మాప్నుయాత్ ॥**

అనగా-

జీవులంతా సుఖంగా ఉండాలి. ఏ జీవికీ ఎలాంటి దుఃఖమూ కలుగకూడదు. అందరికీ కళ్యాణం జరగాలి. ఎవ్వరూ దుఃఖించ కూడదు.

ఈ విధంగా మహాత్ములందరూ సదా అందరి కళ్యాణాన్నీ కోరేవారు, మాకు సద్బుద్ధి ఇవ్వమని పరమాత్మను ప్రార్థించేవారు.

ఋషులు ప్రసాదించిన మంత్రాలలో అన్నింటినీ మించినది గాయత్రీ మంత్రం. ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం రోజుకు మూడుసార్లు ఆ మంత్రాన్ని జపించాలని శాస్త్రం ఆదేశించింది.

ఈ గాయత్రీ మంత్రంలోని అర్థం ఏమిటి? పరమేశ్వరుని గుణాలను మనం ధారణ చేయాలి, మనం మనలోనికి తెచ్చుకోవాలి. పరమేశ్వరుడు మనకు సద్బుద్ధిని ఇవ్వాలి- ఇదీ ఆ మంత్రంలోని సారాంశం.

త్రికాలదర్శులూ, పరమ పవిత్రులూ, మహా మనీషులూ అయిన మన పూర్వజులు పరమేశ్వరుణ్ణి మరేమీ కోరలేదు. సద్బుద్ధిని ఇవ్వమని మాత్రమే కోరారు. ఎందుకంటే- సద్బుద్ధి అదృష్టాన్ని మార్చే తాళపుచెవి. సద్బుద్ధిలో అన్నివిధములైన అభ్యున్నతీ ఉన్నది. సద్బుద్ధిలో స్వర్గం ఉన్నది. సద్బుద్ధిలో దేవత్వం ఉన్నది. సద్బుద్ధిలో కళలన్నీ ఉన్నాయి. సద్బుద్ధిలో పరమేశ్వరుడు ఉన్నాడు. పరమేశ్వరుడు జ్ఞాన స్వరూపుడు.

కనుక - సద్బుద్ధి అన్నింటినీ మించిన శక్తి. అందరికీ మంచి జరగాలనే శుభేచ్ఛ కలిగి ఉండడంవల్లనే సద్బుద్ధి లభిస్తుంది. కనుకనే - శుభేచ్ఛ మన ధర్మానికి తొలిమెట్టు. శుభేచ్ఛ జ్ఞానానికి ద్వారం. శుభేచ్ఛ కలిగి ఉండడాన్ని నేర్చుకోవాలి.

మోసగించడం ప్రపంచంలో అన్నింటికన్నా పెద్ద బలహీనత. దగా చేయడం ప్రపంచంలో అన్నింటికన్నా పెద్ద మూర్ఖత్వం. ఎందుకంటే - మోసగించడంలో వ్యక్తి ఆశించే లాభంకన్న ఎన్నోరెట్లు హానిని అతడు పొందవలసివస్తుంది.

★★★

**ఉప్పు తెచ్చే ముప్పుతిప్పలు చెప్పలేమవి కుప్పతెప్పలు.**

బోధ కథ

# పాదుషాకు ప్రాణ భిక్ష

భక్తుని భక్తి పరమేశ్వరుని శక్తితో ఏకమయితే, అద్భుతాలు జరుగుతాయి. ఎంతటి కష్టాలయినా గట్టెక్కుతాయి. ప్రాణం తీసే ఆపద సైతం వ్యక్తికి హాని కలిగించదు. అతడు విజయ దుందుభి మోగిస్తాడు.

ఢిల్లీలో అగ్బరు పాలిస్తూన్న రోజులలో జరిగిన సంఘటన ఇది. అగ్బరు ప్రతినిధిగా జహంగీరు లాహోర్‌ను పాలిస్తున్నాడు.

జహంగీరుకు వేటపై మక్కువ ఎక్కువ. అతడు దాదాపు ప్రతి వారం వేటకు వెళ్లేవాడు. ఒక రోజున అతడు కొద్దిమంది సహచరులతో గురుదాస్‌పూర్ వెళ్లాడు. ఆ రోజుల్లో గురుదాస్‌పూర్‌లో వ్యాసనదీ తీర ప్రాంతంలో మురగాబీలు అనే నీటిపిట్టలు విరివిగా దొరికేవి. ఆ నీటిపిట్ట మాంసం జహంగీరుకు చాలా ఇష్టం. కనుక అతడు వారం రోజులపాటు వేటాడడానికి తగిన సరంజామాతో బయలుదేరాడు. అతడివెంట వంటవాళ్లు కూడ ఉన్నారు. ప్రతి రోజూ వారు నీటిపిట్ట మాంసంతో కూరలు వండేవారు. అంతా కలసి విందు చేసేవారు.

అపుడా ప్రాంతమంతా దట్టమైన అడవి. ఒక రోజున జహంగీరు. అతడి సహచరులు ఆ కారడవిలో దారి తప్పారు. వారు రెండు జట్లుగా విడిపోయారు. ఈ జట్లు తిరిగి కలుసుకోలేక పోయాయి. ఒక జట్టు ఉత్తర దిశగా వెళ్లింది. రెండవ జట్టు పడమర దిశగా వెళ్లింది. ఉత్తర దిశగా వెళ్లిన జట్టు సాధువుల కుటీరాలు ఉన్న ఒక స్థలానికి చేరింది. అక్కడ దారి తెలుసుకోవచ్చుననీ, త్వరలో తమ గమ్యాన్ని చేరుకోగలమనీ వారు భావించారు.

అది సన్యాసి భగవాన్ దాస్ ఆశ్రమం. ఆయన ఆ అడవిలో కొద్దిమంది శిష్యులతోపాటు భగవద్ భజన, సాధన చేస్తున్నారు. జహంగీరు మనుషులు ఆ ఆశ్రమానికి చేరే సమయానికి కుటీరంలో నారాయణదాస్ అనే శిష్యుడు ఒక్కడే ఉన్నాడు. గురువు గారూ, ఇతర శిష్యులూ మరోచోటికి వెళ్లారు. తాను తిరిగివచ్చేవరకు మౌనవ్రతాన్ని పాటించవలసిందని గురువుగారు అతడిని ఆదేశించి వెళ్లారు.

శిష్యుడు నారాయణదాస్ మౌనవ్రతంలో ఉన్నాడు. జహంగీరు సిపాయిలు త్రోవ అడిగితే, అతడు ఎలా చెప్పగలుగుతాడు. అతడు మాట్లాడకపోవడం చూచి, సిపాయిలు అతడు నాటకం ఆడుతున్నాడని భావించారు. అతడిని పట్టుకుని జహంగీరువద్దకు తీసుకువెళ్లాలని నిర్ణయించారు. అతడిని తమతోపాటు గురుదాస్‌పూర్ తీసుకువెళ్లారు. అక్కడ జహంగీరు కొద్ది సమయం తర్వాత గుడారానికి వచ్చాడు. సాధువుకు సంబంధించిన వివరమంతా సిపాయిలు ఆయనకు చెప్పారు. అతడు అలసి సొలసి ఉన్నాడు. కనుక– 'ఈ విషయం రేపు ఆలోచిద్దాం. ఇవాళ అందరూ నిద్రపోండి'–అని అతడు అన్నాడు.

మరునాడు నారాయణదాస్‌ను జహంగీరు ఎదుట హాజరుపరచారు. కానీ, ఆయన మౌన వ్రతంలో ఉన్నారు. ఎలా మాట్లాడతారు. అధ్యాత్మ జగత్తులో గురువు ఆదేశం సర్వోపరి అవుతుంది. దానిని సంకల్పపూర్వకంగా పాటించవలసి ఉంటుంది. భౌతిక జగత్తులో సైతం ఏదీ ఉచితంగా దొరకదు. మరి అధ్యాత్మ మరింత ఉన్నతమైన విషయం. అందులో ఒకొక్క వరం కఠోర పరీక్షల తర్వాతనే పొందవలసి ఉంటుంది. కనుక– ప్రాణం పోయినా మౌనవ్రతాన్ని భంగం చేయనని నారాయణదాస్ ప్రతిన పూనారు. ఆయనను చిత్రహింసలకు గురిచేశారు. అయినా ఆయన ఏమాత్రం చలించలేదు.

**ప్రశంస ఒకవిధమైన ప్రోత్సాహం.**

జహంగీరు ఇదంతా చూస్తున్నాడు. అతడికి కోపం వచ్చింది. ఆయనను లాహోరు తీసుకువెళ్లవలసిందని అతడు ఆదేశించాడు. అక్కడ మరిన్ని చిత్రహింసలు జరిపి ఆయన చేత మాట్లాడించాలని అతడు నిర్ణయించాడు.

లాహోరులో నారాయణదాస్‌ను మరిన్ని యమ యాతనలకు గురిచేశారు. అయినా అవి ఆయన వ్రతాన్ని భంగం చేయలేకపోయాయి. జహంగీరు క్రోధం కట్టలు త్రెంచుకున్నది. నారాయణదాస్‌కు విషం ఇవ్వమని అతడు ఆజ్ఞ ఇచ్చాడు.

వెంటనే విషంతో నిండిన పాత్ర తెచ్చారు. విషపాన భయంవల్ల ఆయన నోరు తెరుచుకుంటుందని జహంగీరు భావించాడు. కానీ జరిగింది మరొకటి. నారాయణదాస్ భగవంతుణ్ణి స్మరించి, ఆ విషం త్రాగారు. ఆయన ముఖంపై చిరునవ్వు చిందులాడుతోంది. రెండవ పాత్ర ఇచ్చారు. ఆ విషమూ త్రాగారు. మూడవ పాత్ర ఇచ్చారు. ఈసారికూడ ఆయనకు ఏమీ కాలేదు.

విషం నకిలీదేమోనని జహంగీరుకు అనుమానం వచ్చింది. వెంటనే దాన్ని పరీక్షించారు. పాలతోపాటు ఆ విషాన్ని ఒక పిల్లికి ఇచ్చారు. అది వెంటనే చనిపోయింది.

ఇంత తీవ్రమైన విషాన్ని త్రాగిన వ్యక్తి సామాన్యుడు కాదని జహంగీరుకు అర్థమయింది. మరోవైపు – ఈ సాధువు ఎంత విషం త్రాగగలడో తెలుసుకోవాలన్న ఉత్కంఠ అతడిలో చెలరేగింది. ఆ తర్వాత నాలుగో పాత్ర ఇచ్చారు. ఆయన అదీ త్రాగారు – ఎలాంటి ఇబ్బందీ పడకుండా. ఈ విధంగా ఏడు పాత్రల విషం ఇచ్చారు. భగవంతుణ్ణి స్మరించి, ఆయన అన్నింటి విషమూ త్రాగారు.

ఆయన ఏడవ పాత్ర విషం త్రాగగానే, జహంగీరుకు కడుపులో నొప్పి మొదలయింది. నొప్పి బాగా పెరిగింది. అతడు స్పృహతప్పి క్రింద పడిపోయాడు.

దర్బారు సిబ్బంది గాబరా పడ్డారు. క్షణాలమీద రాజవైద్యుణ్ణి పిలిపించారు. అయితే అప్పటికే జహంగీరు శరీరం నల్లబడింది. వైద్యులు విశ్వప్రయత్నం చేశారు. ప్రయోజనం లేకపోయింది. శరీరంలో చలనం లేదు. ప్రాణం ఉన్నట్లు కనపడడం లేదు. జహంగీరు చనిపోయాడు. రాజమహాలులో హాహాకారాలు చెలరేగాయి.

అక్కడ నారాయణ దాస్ గురువుగారు భగవాన్ దాస్‌కు సమాధిలో విషయమంతా తెలిసింది. ఆయన మరుక్షణమే సూక్ష్మ శరీరంలో రాజ దర్బారుకు చేరారు. తనను పరిచయం చేసుకున్నారు. ఇలా అన్నారు–

నారాయణదాస్ నా శిష్యుడు. ఆ రోజుల్లో అతడు మౌనంగా భగవద్భజన చేస్తున్నాడు. మీరు అనవసరంగా అతడిని హింసించారు. దయచేసి ఇపుడు ఇతడిని విడిచిపెట్టండి. లేకపోతే – పరిణామాలు మరింత తీవ్రంగా ఉంటాయి.

వారు నారాయణదాస్‌ను వదలివేశారు.

మహామంత్రితో సహా దర్బారు అధికారులంతా భయంతో కంపించిపోయారు. అందరూ గురువు భగవాన్ దాస్‌ను ప్రార్థించారు–

పొరపాటు జరిగిపోయింది. అందుకు మేము చాలా బాధపడుతున్నాం. మమ్మల్ని క్షమించండి. మరో ప్రార్థన. మా పాదుషాను బ్రతికించండి.

ఇలా చెపుతూ అధికారులు గురువుగారి కాళ్లమీద పడ్డారు. మహాత్మా ! మమ్ము కరుణించండి–అంటూ మొరపెట్టుకున్నారు.

కరుణతో నిండిన భగవాన్ దాస్ తక్షణం కళ్లు మూసుకున్నారు. చేతులు జోడించారు. భగవానునికి ప్రార్థన చేయసాగారు. అయిదు నిమిషాలు ప్రార్థన చేసిన తర్వాత ఆయన కళ్లు తెరిచారు. ఆవెంటనే జహంగీరు శరీరంలో కదలిక ప్రారంభమయింది.

భగవాన్ దాస్ రాజవైద్యునితో ఇలా అన్నారు–

"వైద్య శ్రేష్ఠుడా ! విషప్రభావం నారాయణ దాస్‌పై కాక పాదుషాపై పడింది. ఆ విషానికి వైద్యం చేయండి. ఆయనకు నయమవుతుంది."

**తనను తాను సంస్కరించుకున్న వ్యక్తికి ఇతరులను సంస్కరించే అధికారం అందుతుంది.**

ఆ తర్వాత గురు శిష్యులు అక్కడనుండి వెళ్లిపోయారు. వైద్యుల చికిత్సవల్ల జహంగీరు క్రమంగా కోలుకున్నాడు. వెళ్లి భగవాన్ దాస్ కాళ్లమీద పడి క్షమించమని ఇలా ప్రార్థించాడు–

"బాబా ! అజ్ఞానంవల్ల జరిగిన పొరపాటుకు మమ్మల్ని క్షమించండి. ఈ పాపానికి ప్రాయశ్చిత్తం ఏమిటో సెలవీయండి."

జహంగీరు ముస్లిం. ముస్లిం సంప్రదాయంలో ప్రాయశ్చిత్తానికి స్థానం లేదు. అయినా మరణ భయం అతడికి మరోదారి లేకుండా చేసింది. సాధువులనుండి మరోమారు ప్రమాదం రాకుండా చూడాలని అతడికి అనిపించింది. ప్రాయశ్చిత్తంతో వారిని మంచి చేసుకోవాలని అతడు అనుకున్నాడు.

భగవాన్ దాస్ ఇలా అన్నాడు–

"నాయనా ! మేము నిండు మనసుతో నిన్ను క్షమించాము. నీవు వెళ్లు. సుఖంగా రాజ్య వ్యవహారాలు చూచుకో."

కానీ, జహంగీరు ప్రాయశ్చిత్తం చేసుకుంటానని మళ్లీ మళ్లీ చెప్పాడు. అందుకు బాబా ఇలా అన్నారు–

"నాయనా ! వెళ్లు. ఇకముందు ఏ సాధువునూ ఇబ్బందిపెట్టకు. ఇదీ నీకు అసలైన ప్రాయశ్చిత్తం. ఈ నిర్ణయానికి కట్టుబడి ఉంటే నీకు అన్నివిధాలా మేలు జరుగుతుంది."

ఈ మాట విని జహంగీరు సంతోషించాడు. ధనరాశులను భగవాన్ దాస్ కాళ్లముందు పోశాడు. బాబా ఇలా అన్నారు–

"నాయనా ! సాధువులకు డబ్బుతో పనేముంటుంది ! దాన్ని తీసుకువెళ్లు. పేదలకు పంచిపెట్టు. వారు నీకు ఆశీస్సులు ఇస్తారు. అందువల్ల నీకు మేలు జరుగుతుంది."

జహంగీరు తిరిగివెళ్లాడు. ఆ ధనాన్ని దరిద్ర నారాయణులకు పంచిపెట్టాడు.

పరమేశ్వరుడు సర్వ సమర్థుడు. భగవద్ భక్తివల్ల సాధకుని లోపలి దైవ శక్తి వ్యక్త మవుతుంది. అది అతడిని అడుగడుగునా రక్షిస్తుంది. అది చూచి మనం ఆశ్చర్య చకితులం అవుతాం.

మనం ఆస్తికులం కావాలి. పరమేశ్వరునిపై విశ్వాసం ఉంచాలి. అపుడు ఎంతటి కఠోర పరిస్థితులయినా మనల్ని ఇబ్బందిపెట్టలేవు.

★★★

## అనుభూతి, అభ్యాసం అవసరం

*ఆరుణి మహామేధావి. విధేయుడైన శిష్యుడు. గురువు ఉద్దాలకుడు ఈ శిష్యునిపైన ఎంతో వాత్సల్యం చూపిస్తుండేవాడు. ఆరుణిని గొప్ప తత్త్వజ్ఞానిగా చూడాలని ఆయన ఆకాంక్ష. తగిన ప్రయత్నం చేయకుండా ఎవ్వరూ ఇంతవరకూ తత్త్వజ్ఞాని కాలేదు, కాలేరు కూడా. అందుచేత ఆస్థాయిని అందుకోవడం కోసం ఆరుణి కూడా కఠోర సాధన చేయవలసి వచ్చింది.*

*గురువు ఆరుణికి 100గోవులను అప్పగించి ఇలా చెప్పాడు– 'వీనిని అడవికి తీసికొనివెళ్ళు. ఇవి వేయి ఆవులు కానంత వరకు ఇక్కడికి తిరిగి రావద్దు. తిరిగి వచ్చిన తరువాతనే దీక్ష ఇవ్వడం జరుగుతుంది.' ఆరుణి మందను తోలుకొని వెళ్ళాడు. అభ్యాసం చేసి వాటి గడ్డి, నీరు, పోషణ మొదలైన విషయాల్లో పరిజ్ఞానం సంపాదించాడు. అతని సంరక్షణలో ఆవుల సంఖ్య వృద్ధి అవుతోంది. ఆవులు ఆరోగ్యంగా కూడా ఉన్నాయి. ఈవిధంగా కొంతకాలం సాగింది. 10.సం.లలో ఆవులు 100 నుండి 1000 ఐనాయి. వానిని తీసుకొని అతడు గురుకులానికి తిరిగివచ్చాడు. అతడు అత్యంత ప్రసన్న చిత్తంతో ఉన్నాడు. అతని ముఖమండలం బ్రహ్మతేజస్సుతో ప్రకాశిస్తోంది. ఆరుణి ముఖం పైన గల తేజస్సును చూసి ఉద్దాలకుడు ఆనందభరితుడైపోయాడు. శిష్యునిలోగల పురుషార్థం, విధేయత, సాధనలను మిక్కిలి ప్రశంసించారు. కొద్ది రోజులు గురుసన్నిధిలో వసించి ఆరుణి అద్వితీయమైన బ్రహ్మజ్ఞాని ఐనాడు. ఇతర విద్యార్థులకు ఈ విషయంలో ఆశ్చర్యం వేసింది. వారు చాలా కాలం నుండి అక్కడ ఉంటున్నారు. ఐనా ఆరుణికి సిద్ధించిన పదవి వారికి లభించలేదు. కులపతి ఉద్దాలకుడు చెప్పాడు – 'అనుభూతి, అభ్యాసం, ఆదర్శ జీవనం వలన మాత్రమే ఎవరైనా తత్వజ్ఞాని అవుతారు. అభిమానము, అధ్యయన – అధ్యాపనాదులు తత్త్వజ్ఞాన ప్రాప్తికి సరిపోవు.' దీనితో విద్యార్థులకు సమాధానం లభించింది.*

★★★

**కష్టాలు విజ్ఞతను పెంచుతాయి. తనవాళ్లెవరో పరాయివాళ్లెవరో తెలుపుతాయి.**

ధారావాహిక : నా స్మృతి పథంలో గురుదేవులు-13

# ఆలోచనను మార్చిన గురుదేవులు

ఒక పర్యాయం గురూజీతో కలసి గుజరాత్ పర్యటనకు వెళ్లాను. అప్పట్లో ఆ ప్రాంతంలో గాయత్రీ పరివార్ శాఖలు చాలా తక్కువగా ఉండేవి. అహమదాబాద్‌లో మిస్రీలాల్‌జీ అనే కార్యకర్త ఉండేవారు. ఆయన అవివాహితుడు, ఒంటరివాడు. ఆయనతోనే మేము బసచేశాము. ఆయనది చాలా చిన్న గది. రాత్రికి ఆ గదిలో ముగ్గురం మా పరుపు చుట్టలపై పడుకున్నాము. మా మూడు పరుపులు ఆ గదిలో బొటా బొటిగా సరిపోయాయి. గురుదేవులు తెల్లవారుజామున 3 గంటలకు లేచేవారు. ఈ గదితప్ప అక్కడ ఇంకేమీ లేవు. ఒక మామూలు లెట్రిన్ ఉంది. గదికి దగ్గరగా ఒక రాయి పరచిఉంది స్నానానికి. మేము ఆ రాతిపైనే స్నానాలు చేశాము. గురుదేవులు అక్కడే బట్టలు ఉతికి ఆరవేశారు. ఆ ఊరిలో ఒక వ్యక్తి నూతన గృహప్రవేశం ఉంది. అక్కడ మేము యజ్ఞంజేయాల్సిఉందని మిస్రీలాల్‌జీ చెప్పారు. మేము అక్కడకు చేరాము. అది ఒక పెద్ద భవనం. చాలామంది కలసి ఒక గృహసముదాయం నిర్మించుకున్నారు. మేము వెళ్లేసరికి అక్కడ ఒక వ్యక్తి పంచకుండీ యజ్ఞం ఆ మరురోజు ఆ కాలనీలో చేయాలని చెప్పారు. ఆ కాలనీ ప్రారంభోత్సవం కూడా జరగాలి.

ఆ మరునాడు మిస్రీలాల్‌జీ మరో వ్యక్తిని పరిచయం చేశారు. ఆయన పేరు బల్వంత్‌భాయ్. ఆయనే ఆ కాలనీని నిర్మించారు. యజ్ఞం అనంతరం గురూజీ ప్రవచనం ఉంది. ఆ రాత్రికి అక్కడే మేము బసచేయాలని చెప్పారు. పైఅంతస్థులో ఒక గది మాకు కేటాయించారు. ఆ గది చాలా పెద్దది. ఆ గదిని గురుదేవులకూ, ప్రక్కనే ఉన్న చిన్నగదిని నాకూ కేటాయించారు. ఆ గదులు చాలా ఆడంబరంగా ఉన్నాయి. పాశ్చాత్య పద్ధతిలో ఉన్న లెట్రిన్ ఉంది. గురూజీ తాను ఆ గదిలో ఉండలేనన్నారు. క్రిందభాగంలో మామూలు గది, మామూలు లెట్రిన్ ఉన్న చోటికి మకాం మార్చాము. ఆ రోజుల్లో బల్వంత్‌భాయ్ దుస్తులు ఒక మంత్రిగారికి ఉండేవిలా కనుపించేయి. సాదాసీదాగా జీవించడం, ఉన్నతంగా ఆలోచించడం గురుదేవులకు ఇష్టం. బల్వంత్‌భాయ్ ఆలోచనలలో మార్పు తీసికొనిరాబడింది గురుదేవుల సాన్నిహిత్యంతో. భాగ్యవంతుడైనా మామూలుగా కనిపిస్తాడు ఇప్పుడు. ఆయన ఆలోచనలను గురూజీ మార్చారు.

## మన పని మనమే చేయాలి

గురూజీతో అహమదాబాద్ నుండి మథుర వచ్చాను. స్టేషనులో దిగినవెంటనే, కూలీకొరకు కేకవేశాను. కూలి రాకకోసం చూస్తున్నాను. ఆ సమయంలో గురూజీ తన సామానూ, నా సామానూ తనే తీసికొని నడక ప్రారంభించారు. ఇది చూసి సామాను నాకివ్వమని కోరాను. కాని గురూజీ 'నీవు చాలా పెద్దవాడివి కదా. సామాను ఎలా మోస్తావు. ఒక కూలీ కావాలి కదా'- అంటూ రిక్షాదాకా తానే సామాన్లు తెచ్చారు. ఈ విధంగా నాకు కనివిప్పు కలిగింది - ఆడంబర జీవితం ఆధ్యాత్మిక జీవనానికి వ్యతిరేకమని. మన పని మనమే చేసికోవాలని నాకు గురూజీ చెప్పకనే చెప్పారు. మనం ఎంత సామాను మోయగలమో అంతే సామాను ప్రయాణాల్లో తీసికొనివెళ్లాలి. విదేశాల్లో కూలీలు ఉండరు. మనమే మన సామాను మోయాలి. గురు దేవులు తన ఆచరణతో మనకు పాఠాలు చెబుతారు.

## ఛత్తీస్‌గఢ్ పర్యటన

ఒక పర్యాయం ఛత్తీస్‌గఢ్‌లో పంచకుండీ యజ్ఞానికి వెళ్లాను. రాయపూరు మొదట వెళ్లాను. అక్కడ పంచకుండీ యజ్ఞం ఏర్పాటు చేశారు. ఆ కార్యక్రమం మూడు రోజులు జరుగుతుంది. ఆఖరు రోజు గురుదక్షిణగా యజ్ఞంలో పాల్గొన్నవారికి, ఒక చెడు అలవాటు వదిలివేయాలి అని చెప్పేవారం. యజ్ఞంతో బాటు జ్ఞాన యజ్ఞంను గురుదేవులు జరిపించేవారు;

**బాధ్యతా నిర్వహణలో మనిషిలో శౌర్యం వెలికివస్తుంది.**

మానవుడు శరీరం, ఆత్మల కలయిక. శరీరానికి ఆహారం కావాలి, నివాసం కావాలి. ఆత్మకు 'జ్ఞానం' అనే ఆహారం కావాలి. యజ్ఞం ద్వారా వాతావరణం శుద్ధమవుతుంది. పూర్వపు రోజులలో యజ్ఞాల ద్వారా జబ్బులు నయంచేసేవారు. యజ్ఞాలు విరివిగా జరుగుతూఉంటే ఇన్నిరకాల జబ్బులు రావు. శరీర ఆరోగ్యానికి యజ్ఞం అవసరం. అదే సమయంలో ఆత్మను మరువకూడదు. జ్ఞాన యజ్ఞం కావాలి. మన అజ్ఞానం కారణంగానే ఇన్నిరకముల కష్టాలు వస్తున్నాయి. విద్యుత్ బల్బు వెలగాలంటే, ధన, ఋణ తీగలు (పాజిటివ్, నెగెటివ్ వైర్లు) కలియాలి. అలాగే 'యజ్ఞం', 'జ్ఞానయజ్ఞం'ల ద్వయం కూడా ఉండాలి.

రాయపూర్‌లో సాయంత్రం నాలుగు గంటలకు యజ్ఞం పూర్తయింది. అదే రోజు గురుదేవులు రాయగఢ్ వెళ్ళాల్సిఉంది. భోజనం పూర్తిచేసుకొని, రాయగఢ్ బయలుదేరాము. బండి విలాస్‌పూర్ జేరగానే, అక్కడి కార్యకర్తలు గుంపుగా గురుదేవుల దర్శనానికి వచ్చారు. ప్రతివారు ఒక దండ, చేతిలో తిను బండారాలతో వచ్చారు. గురూజీకి స్వాగతం జెప్పి, తెచ్చిన పదార్థాలను అక్కడ ఉంచారు. గురూజీ ప్రతి వ్యక్తి చేతిలోని ఫలహారం కొంచం కొంచం రుచి చూశారు. నేను మాత్రం అవి తిరస్కరించాను. గురూజీ సంజ్ఞ చేశారు తినమని. నాకు తినక తప్పలేదు– ఆకలి లేకపోయినా. బండి బయలుదేరగానే అందరూ దిగి వెళ్లిపోయారు. రాయగఢ్ చేరగానే చాలామంది కార్యకర్తలు స్వాగతం పలికారు. మేము బసచేసే ప్రదేశానికి తీసికొనివెళ్లారు. తర్వాత గురూజీని భోజనానికి పిలిచారు. గురూజీ బయలుదేరారు. నేను వద్దని చెపుదామనుకుంటే, గురూజీ నన్నుకూడా బయలుదేరమని సైగ చేసారు. తప్పనిసరిగా భోజనం చేయాల్సివచ్చింది. బసకు తిరిగి వచ్చాము. పండుకుందా మనుకుంటుండగా పాలు తెచ్చారు. గురూజీ ఒక గ్లాసుతో పాలు త్రాగారు. నేను పాలు త్రాగితే వాంతి చేసుకోవాల్సిందే. పాలు తెచ్చినవారితో, నేను మందు వేసుకున్నాను. దానికి పాలు త్రాగకూడదు– అని చెప్పి తప్పించుకున్నాను. తెల్లవారిన తర్వాత మేము చాలా గృహాలకు వెళ్లవలసివచ్చింది. ప్రతి ఇంటిలో గురూజీ కొంచం కొంచం పదార్థాలు తిన్నారు. యజ్ఞం పూర్తి చేసి మథురకు ప్రయాణమైనాము. ప్రయాణంలో గురూజీతో, "ఇలా అయితే మనం జబ్బుపడాల్సివస్తుంది. ప్రతిచోటా ఏదోఒకటి తింటే అజీర్తి చేస్తుందికదా. మీరు సైగ చేసినందున, నాకు తీసికొనక తప్పలేదు"–అన్నాను. దానికి వారు, 'ప్రతి కార్యకర్తా తన ఇంటినుండి ఏదోఒకటి తీసికొనివచ్చాడు మనపై అభిమానంతో. మనం తిరస్కరిస్తే వారు బాధపడతారు. వారి అభిమానాన్ని గౌరవించాలి. అవతలి వారి అభిప్రాయాలను గౌరవించాలి. అదే ఆధ్యాత్మికత. మన పొట్టలో నాలుగు గదులు ఏర్పరచాలి. ప్రతిచోట కొంతకొంత నింపాలి. ప్రతివారి అభిమానాన్ని మనం గౌరవించాలి గదా'– అన్నారు.

నాకు బాగా అర్థమైంది. ప్రతిచోట కొంచం తీసికొని వారిని అభినందించాలి. అప్పుడే అవతలి వారికి తృప్తి కలుగుతుంది. ఒక అరలో భోజనం, మరొక అరలో నీరు. మూడవది గాలి. అలా అయితేనే మనం ఆరోగ్యంగా ఉంటాము. రుచిగా ఉందిగదా అని, ఎక్కువగా తినరాదు.

★★★

## పండుగలు

**ఆగస్టు :**

| | |
|---|---|
| **15** | స్వాతంత్ర్య దినోత్సవం |
| | **శ్రీ అరవిందుల జయంతి** |
| **18** | నాగపంచమి |
| **24** | వరలక్ష్మి వ్రతం |
| **28** | శ్రావణపూర్ణిమ |

**సెప్టెంబరు :**

| | |
|---|---|
| **3** | కృష్ణాష్టమి |
| **15** | వినాయక చవితి |
| **17** | విశ్వకర్మ జయంతి |
| **23** | వామన జయంతి |
| **30** | మాతాజీ జయంతి |

**స్వార్థం, సంకుచితత్వం, పిరికితనం అవినీతికి పుట్టిళ్లు.**

ధారావాహిక : దివ్య జీవన దర్శనం-42

# విశ్వానికి ఆశ్రయం ఆ ఆశ్రమం-2

### 'సైనిక్' పత్రిక బాధ్యత

శాంతి నికేతన్‌లో మూడు రోజులు ఉన్న తర్వాత, శ్రీరామ్ తన కార్య రంగానికి తిరిగివచ్చారు. ఆగ్రాలో 'సైనిక్' పత్రికను తిరిగి క్రమబద్ధం చేసే పథకం అమలు జరుగుతోంది. స్వరాజ్య సేనానులు ఇందుకోసం నియమబద్ధంగా అంశదానాలు ఇవ్వడం ప్రారంభించారు. శ్రీరామ్ తిరిగివచ్చారని పాలీవాల్‌జీకి తెలిసింది. ఆయన వెంటనే శ్రీరామ్‌ను పిలిపించారు. 'సైనిక్' పత్రిక సంపాదకత్వ, నిర్వహణ బాధ్యతలను స్వీకరించవలసిందిగా ఆయనను కోరారు. శ్రీరామ్ ఇలా అన్నారు- "అందువల్ల నేను పత్రిక పనిలోనే మునిగిపోవలసివస్తుంది. ఉద్యమంలో పాల్గొనడానికి సమయం దొరకదు."

పాలీవాల్‌జీ ఇలా అన్నారు- "దీన్ని గురించిన ఆలోచన పదలిపెట్టు. 'సైనిక్' పత్రిక దానికదిగా ఒక ఉద్యమం. భారత మాత వ్యధకు అక్షర రూపం ఇవ్వడం తక్కువ పనా?"

ఆ తర్వాత ఆయన శ్రీరామ్‌ను ఒక గదిలోకి తీసుకువెళ్లారు. ఆ గదిలో వారిద్దరూ తప్ప మరెవరూ లేరు. అక్కడ పాలీవాల్‌జీ ఇలా చెప్పారు- 'సైనిక్ పత్రిక కార్యాలయం రాబోయే రోజుల్లో స్వరాజ్య ఉద్యమానికి ఆయుధాగారం అవుతుంది; ఈ కార్యాలయం ద్వారా ఉద్యమకారులు పరస్పర సమన్వయాన్ని ఏర్పరచుకుంటారు; కనుక, ఇది తపాలా కార్యాలయంగా పనిచేస్తుంది.' వారిద్దరూ సుమారు అరగంటసేపు చర్చించారు. 'సైనిక్' పత్రిక పక్షాన జరుగుతూన్న కార్యకలాపాలను పాలీవాల్‌జీ శ్రీరామ్‌కు వివరించారు. ఈ ఏర్పాట్లన్నీ చూచే సామర్థ్యం నీకే ఉంది - అని ఆయన స్పష్టం చేశారు.

చర్చ ఫలితంగా మరో విషయం నిర్ణయమయింది. పాలీవాల్‌జీ ఇలా అన్నారు- "ఉద్యమకారులకు నిన్ను శ్రీరామ్‌గా పరిచయంచేయడం అరుదుగా జరుగుతుంది. నీ కలం పేరు 'మత్త'ను ఇందుకు వాడదామని అనుకుంటున్నాము. అలా చేస్తే సౌకర్యంగా ఉంటుంది." "శ్రీరామ్ 'మత్త' అనే కలం పేరుతో కవితలూ, కథలూ వ్రాసేవారు. తన కలం పేరు విప్లవోద్యమానికి విస్తరించడం శ్రీరామ్‌కు ఇష్టమే. అయితే, 'సైనిక్' బాధ్యతను చేపట్టడం విషయంలో ఆయన ఇలా చెప్పారు- "సైనిక్ పత్రిక విప్లవానికి ఆశ్రయమన్నది స్పష్ట మయింది. అది రోజూ ప్రచురించబడుతుంది. అయితే, ఉద్యమం తీవ్ర రూపం ధరించే రోజులలో ఈ బాధ్యతను స్వతంత్రంగా నిర్వహించే అవకాశం నాకు ఉంటుందా?"

శ్రీరామ్ అభిప్రాయాన్ని పాలీవాల్‌జీ గ్రహించారు. శ్రీరామ్ బాధ్యతను స్వీకరిస్తారు. కాని అందులోనే మునిగిపోవడానికీ అంగీకరించరు. అయితే- 'మత్త' ఒకసారి బాధ్యతను స్వీకరిస్తే, ప్రాణాలు ఒడ్డి దాన్ని పూర్తి చేస్తారని ఆయనకు తెలుసు. ప్రజా ఉద్యమంలో క్రియాశీలంగా పాల్గొనడానికి తనకు అవకాశం ఉండాలని శ్రీరామ్ కోరుతున్నారనీ ఆయనకు తెలుసు. ఒక సహాయకుణ్ణి నియమించడంద్వారా ఇందుకు పరిష్కారాన్ని సాధించారు. ప్రభుదయాల్ అగ్రవాల్‌ను సహాయకునిగా నియమించారు.

ఆ రోజుల్లో రేడియోలో విని, దేశ విదేశాల వార్తలను వ్రాసుకునేవారు. ప్రధాన విలేఖరి కాని నగరవార్తలకోసం ప్రత్యేకవిలేఖరికాని ఉండేవాడు కాదు. ఉపసంపాదకులూ, విలేఖరులూ వేర్వేరుగా ఉండేవారు కారు. పెద్ద పత్రికలలో కొద్దిమంది విలేఖరులు ఉండేవారు. ఏజెన్సీల వార్తలతో, రేడియో వార్తా ప్రసారాలతో పని జరుపుకునేవారు. ప్రభుదయాళ్ అగ్రవాల్ ప్రూఫులు చూచేవారు, ఒకోసారి రేడియో వార్తలను వ్రాసేవారు.

ఉద్యమ నిర్వహణ, రచన, పాత్రికేయ రచనలతో పాటు 'మత్తజీ' ఆ రోజుల్లో లోతయిన తపో సాధన జరిపేవారు, సుదీర్ఘంగా ఆత్మ చింతన జరిపేవారు. శాంతి నికేతన్‌ను చూచివచ్చిన తరువాత ఆయన మనస్సులో ఒక ఆలోచన ఉదయించింది. కొద్ది సంవత్సరాలలో స్వరాజ్యం ఎలాగూ వస్తుంది; ఆ తర్వాత తన పాత్ర ఏమిటి? టాగూర్‌పట్ల తాను వ్యక్తంచేసిన అభ్యంతరం ఆయనకు గుర్తువచ్చింది. విశ్వ భారతి అధికారితో కూడ ఆయన దానిని ప్రస్తావించారు. స్వరాజ్య ఉద్యమంలో ఆయన

**నిరాశవల్ల అమూల్య అవకాశాలు చేజారిపోతాయి.**

క్రియాశీలంగా ఎందుకు పాల్గొనలేదన్నదే ఆ అభ్యంతరం. నవ సమాజ నిర్మాణం కోసం పనిచేయడం కూడ జాతీయ సాధనయే. నవ తరానికి సంస్కారాలను ఇవ్వడంకూడ దేశ సేవయే. జాతీయ ఉద్యమంలో పాల్గొనడంకన్న తక్కువేమీ కాదు దాని ప్రాధాన్యం.

1933 జూలై నెలలో ఒకనాటి ఉదయం. తెల్లవారుజామునుండి పట్టణంలో సందడి కానవస్తోంది. ఆలయాలలో ఉత్సవానికి సన్నాహాలు జరుగుతున్నాయి. శ్రావణ మాసంలో శుక్ల పక్షం నడుస్తోంది. ఈ రోజుల్లో ప్రజలు శివుడికి ప్రత్యేక పూజలు చేస్తారు. శివునికి సంబంధించిన ఏదో ఉత్సవం జరుగుతోందని శ్రీరామ్‌కు అనిపించింది. కొంచం ఆలోచించగా తెలిసింది - ఆ రోజు శ్రావణ మాసంలోని చివరి సోమవారమనీ, నిన్నటినుంచి కనిపించిన సందడి ఆ ఉత్సవానికి సన్నాహమనీ. ఆ రోజున సంధ్య పూజలో శ్రీరామ్ ఉపనిషత్తులను అధ్యయనం చేస్తున్నారు.

కఠోపనిషత్తులోని నచికేతుని కథపై ఆయన చింతన చేస్తున్నారు. ఉద్దాలక మహర్షి యజ్ఞం పూర్తయిన తర్వాత ముసలి ఆవులను దానం ఇస్తున్నారు. దాన్ని చూచి, నచికేతుడు ఇలా ప్రశ్నించాడు- "తండ్రిగారూ ! నేనుకూడా మీ సంపత్తియే కదా. నన్ను ఎవరికి దానం ఇస్తారు?" ఉద్దాలకుడు ఆ ప్రశ్నను పట్టించుకోలేదు. నచికేతుడు మళ్లీ ప్రశ్నించాడు. తండ్రికి ఈసారి కొంచం అయిష్టం కలిగింది. రెండవ సారి అడిగిన ప్రశ్నలో ఆయనకు వ్యంగ్యం ధ్వనించింది. వాస్తవానికి అందులో వ్యంగ్యం లేదు. యజ్ఞం తర్వాత ఆ ముసలి ఆవులను దానం ఇవ్వడంవల్ల పుణ్యం రాదనేదే నచికేతుని అభిప్రాయం. ఆ పని శాస్త్ర విరుద్ధం కూడా. కనుక తండ్రికి దాన్ని గురించి హెచ్చరించాలి; ఆవులకు బదులుగా తనను దానం ఇవ్వాలని కోరాలి; ఆరోగ్యవంతుడూ, బలిష్టుడూ అయిన తనలాంటి బ్రహ్మచారిని దానం ఇస్తే శుభం కలుగుతుంది - ఇదీ అతడి ఉద్దేశ్యం. జవాబు రాకపోయేసరికి, నచికేతుడు మూడవసారి ప్రశ్నించాడు. ఆ ప్రశ్నకు ఉద్దాలక మహర్షి సహనం కోల్పోయారు. ఆయనకు కోపం వచ్చింది. "నేను నిన్ను యమునికి దానం ఇస్తాను" - అని ఆయన అన్నారు.

ఉద్దాలకుని నోటినుండి ఆ మాట వెలువడగానే, నచికేతుని శరీరం ప్రాణరహితం అయింది. అతడు యముని ద్వారంవద్దకు చేరాడు. యముడు వచ్చేవరకు నచికేతుడు ఎదురుచూడవలసివచ్చింది. మూడు రోజులు ఎదురుచూచిన తర్వాత యమునితో సమావేశం జరిగింది. ఇద్దరిమధ్యా సంభాషణ ప్రారంభమయింది.

ఈ సంఘటన ముందుకు సాగిన తర్వాత, శ్రీరామ్ స్పృహ కోల్పోయారు. ఆయన కళ్ల ఎదుట మరో లోకం ఆవిర్భవించింది. తాను నచికేతుడు. యముడు తనను మూడు వరాలు కోరుకోమని చెపుతున్నాడు. మూడు వరాలు ఎందుకంటే-బ్రాహ్మణ కుమారుడు మూడు రోజులు ఎదురుచూడవలసివచ్చింది. యముడు ఇలా అంటున్నాడు- "అగ్నిదేవతా ! మీరు అతిథిగా వచ్చారు. మీరు మా గుమ్మంవద్దకు వచ్చారు. మీరు ఇక్కడ మూడు రాత్రులు ఎదురుచూడవసివచ్చింది. ఇది నాకు కష్టం కలిగిస్తోంది. ఒక్కొక్క రాత్రికి బదులుగా ఒక్కొక్క వరం కోరుకోండి. మీకు మూడు వరాలు ఇవ్వడానికి నేను కట్టుబడి ఉన్నాను."

## తానే నచికేతుడిననే అనుభూతి

శ్రీరామ్ ఆలోచించసాగారు. ఆయన తనను తాను చూస్తున్నారు- ఎదురుగా నాటకం ప్రదర్శించబడుతున్నట్లు, చలనచిత్రం చూపబడుతున్నట్లు, అందులో తాను స్వయంగా నచికేతునిగా పాల్గొన్నట్లు. ఏయే వరాలు కోరాలని శ్రీరామ్ ఆలోచిస్తున్నారు. మూడు ఆకాంక్షలు ఆయన మనస్సులో సంచలనం కలిగిస్తున్నాయి. ముందుకు రావాలని పరస్పరం పోటీపడుతున్నాయి. యమధర్మరాజు ఇలా అన్నాడు- "బ్రాహ్మణ కుమారుడా ! ఎలాంటి సంకోచమూ వద్దు. నీవు ఏది కోరితే అది ఇవ్వబడుతుంది."

శ్రీరామ్ నోటినుండి సహజంగా ఈ మాటలు వెలువడ్డాయి- "నా ఈ మాతృభూమిని అసుర శక్తులు పాలిస్తున్నాయి. ఈ పాలన అంతం కావాలి. దేవ భూమి భారత్ స్వతంత్రంకావాలి."

"తథాస్తు". యముని గుమ్మం నుండి తిరిగివెళ్లి నీవు చూస్తావు- దేవభూమి బంధనాలు సడలి పోతున్నాయని, అది శక్తిమంతం అవుతూన్నదని, అది తన కాళ్లపై నిలబడుతూన్నదని, అంతా సహజంగా జరిగిపోతున్నదని. ఒక దైవ యోజనలో అంతర్భాగంగా భారత్‌కు స్వాతంత్ర్యం లభిస్తూన్నదని ఎవ్వరికీ తెలియదు. ఇక రెండవ వరం కోరుకో" - అని యముడు అన్నాడు.

**ఆంతరిక బలం లేనివాడే దరిద్రుడు.**

శ్రీరామ్ ఇలా అన్నారు - "స్వర్గలోకంలో ఎవరికీ ఏ కొంచమూ భయం ఉండదు. అక్కడ మీ భయం కూడ ఉండదు. అక్కడ నివసించేవారికి ఆకలీ, దప్పికా ఉండవు. వారు ఆనందాన్ని పొందుతారు. ఈ స్థితిని పొందడానికి సాధనం అగ్ని అని మీకు తెలుసు. నాకు అగ్ని విద్యను ఉపదేశించండి."

స్వర్గంవంటి స్థితిని కలిగించే విద్యను యమధర్మరాజు ఆయనకు ఉపదేశించాడు. ధర్మ, అర్థ, కామ, మోక్షములకు సాధనం అయిన ఈ విద్య విస్తరించడంవల్ల మనిషిలో దేవత్వం ఉదయిస్తుంది. స్వర్గం భూమిపై దిగివస్తుంది. మృత్యు దేవత ఈ సూత్రాలను ఉపదేశించాడు. శ్రీరామ్ వాటిని వల్లించారు. యముడు ఇలా అన్నాడు- "ఈ సూత్రాల ద్వారా భవిష్యత్తులో ఏర్పడే ఏ సమస్యల నయినా పరిష్కరించగలుగుతావు. చిమ్మ చీకటిలో సైతం వెలుగును సృష్టించే సామర్థ్యం జనిస్తుంది."

కాలానికి అధిపతి అయిన యముడు ఇలా అన్నాడు - "ఇక మూడవ వరం కోరుకో." శ్రీరామ్ ఇలా అన్నారు- "అన్ని సంశయాలనూ తీర్చే ఆత్మవిద్యను మూడవ ఆశీస్సుగా నేను కోరుతున్నాను. జగత్తుయొక్క సత్యం ఏమిటి? అస్తిత్వం ఏమిటి? పదార్థానికీ, చేతనకూ మధ్య గల తేడా ఏమిటి?"

యముడు ఇలా అన్నాడు- "అతి నిగూఢమూ, అతి సూక్ష్మమూ అయిన విషయం ఇది. ఇది తప్ప-మరేదయినా కోరుకో. వైభవాన్ని కోరుకో. అధికార సుఖాన్ని కోరుకో. పేరు ప్రతిష్ఠలను కోరుకో."

శ్రీరామ్ ఇలా అన్నారు - "నాకు అవేవీ వద్దు. ఆత్మ విద్యయొక్క ఉపదేశమే కావాలి. ఆ విద్యను పొందే అర్హత నాకు లేకపోతే - నేను దాన్ని సంపాదిస్తాను. నా పాత్రతను పెంచుకుంటాను."

యముడు ఇలా అన్నాడు- "బ్రాహ్మణ కుమారా! ఈ విద్య లేకుండానే నీవు మోక్షాన్ని పొందగలుగుతావు. మోక్షం కావాలంటే చెప్పు. కానీ, ఈ విద్య కావాలని పట్టుపట్టకు."

శ్రీరామ్ ఏమాత్రం మెత్తబడలేదు. ఆయన దృఢంగా నిలచారు. ఆయన ఇలా అన్నారు- "మోక్షం లభించక పోయినా- నాకీ విద్య మాత్రమే కావాలి. ఈ విద్యను సమాజంలో ప్రచారం చేస్తాను. ఎన్నెన్నో సంవత్సరాలుగా ఈ విద్యను పండితులు తమవరకే పరిమితం చేసుకున్నారు. దీన్ని బంధించి ఉంచారు. దీన్ని సామాన్య ప్రజలకు అందకుండా చేశారు. నేను దీన్ని విముక్తి చేస్తాను."

శ్రీరామ్ యొక్క ఈ సంకల్పాన్ని విన్న తర్వాత బిగుసుకున్న యముని ముఖ కండరాలు సడలిపోయాయి. క్షణం క్రితం ఆ ముఖంలో వెనుకాడే లక్షణం, సంకోచం ఉన్నాయి. ఇప్పుడు సంతోషం, ఉల్లాసం ఉప్పొంగు తున్నాయి. ఆయన ఇలా అన్నాడు - "నేను నీ నోటిద్వారానే ఆ విద్యను, సంజీవనీ విద్యను, ఉపదేశం ఇస్తాను. అందరి కోసం. అందరి మంచి కోసం."

## తాఈజీ నుండి కబురు

దృశ్యం పూర్తయింది. శ్రీరామ్ ఎదుట కఠోపనిషత్తు పుటలు తెరచి ఉన్నాయి. కానీ, ఆయన వాటిని చదవడం లేదు. ఆయన కళ్లు నులుముకున్నారు. ఏదో ఆలోచిస్తూ పుస్తకాన్ని మూయసాగారు. ఆసనంలో కూర్చొని ఉండగానే, ఎవరో తలుపు తట్టారు. ఆయన తలుపు తెరిచారు. గ్రామంనుంచి మేనమామ వచ్చారు. మేనమామ ఇలా అన్నారు - "మీ తల్లి నిన్ను గుర్తుచేసుకుంటోంది. ఈ ఉద్యమాలను ఎందుకు వదలవు?"

శ్రీరామ్ ఇలా అన్నారు - "ఇపుడు చాలా దూరం వచ్చాను మామయ్యా. ఇక వదలకూడదు. వదలాలని అనుకున్నా, వదలలేను."

మేనమామ ఏదో పనిమీద ఆగ్రా వచ్చారు. ఈ మొండివాడి సంగతికూడ కనుక్కోవలసిందని తాఈజీ ఆయనకు చెప్పారు. అందువల్లనే ఆయన శ్రీరామ్ వద్దకు వచ్చారు. ఆయన మాటలు పొడిగించారు. ఓంప్రకాశ్‌కు ఏడాది నిండింది. అతడి భవిష్యత్తు గురించి ఆలోచించనక్కర లేదా? - అని ఆయన అడిగారు.

తాఈజీ తనకు ఇష్టమైనంత కాలం ఓంప్రకాశ్‌ను తనవద్దనే ఉంచుకోవాలని నిర్ణయం జరిగింది. ఓంప్రకాశ్ చదువు సంధ్యలు పట్టణంలో జరగాలని ఆమె కోరితే- అలాంటి ఏర్పాటు కూడ జరుగుతుందని నిర్ణయం జరిగింది.

★★★

**అవహేళనకూ, ప్రతిఘటనకూ భయపడేవాడు సంస్కర్త కాలేడు, కాబోడు.**

# ఈ నాటి అవసరం - పర్యావరణ విప్లవం

ప్రపంచ ఉష్ణోగ్రత పెరుగుతోంది. గత వంద సంవత్సరాలలోనే అది ఒక డిగ్రీ పెరిగింది. ఫలితంగా – గ్లేశియర్‌లు (మంచు రాళ్లు) కరిగిపోతున్నాయి. హిమాలయాలు నగ్నంగా మారుతున్నాయి. అడవులు నరికివేయబడుతున్నాయి. అకాలంలో వర్షాలు కురుస్తున్నాయి. వడగళ్ల వానలు పెరుగుతున్నాయి. ఋతువులు అస్తవ్యస్తం అవుతున్నాయి. ప్రకృతి ప్రకోపిస్తోంది. రకరకాల రోగాలు పెరుగుతున్నాయి. వేసవి కాలాలు మరింత వేడిగా ఉండే అవకాశం, వరదలు వచ్చే అవకాశం, అనావృష్టి ఏర్పడే అవకాశం కనిపిస్తోంది. మంచు కొండలు కరగడంవల్ల సముద్ర తలాలు పెరగవచ్చు. సముద్ర తీరాలలో ఉండే నగరాలు మునిగిపోవచ్చు. ఇదంతా 2050 నాటికి కాక – 2015 నాటికే జరిగే అవకాశం ఉంది.

## ప్రకృతి భోగ వస్తువు కాదు-మాత

మాత అయిన ప్రకృతిని భోగ వస్తువుగా పరిగణించినందువల్ల కలిగిన విష ఫలితం ఇది. నగరీకరణ పెరుగుతోంది. గ్రామాలు మహానగరాలలో విలీనం అవుతున్నాయి. నగరాలలో మూమూలు సౌకర్యాలు తరిగిపోతున్నాయి. మంచినీటి సమస్య తీవ్రతరం అవుతోంది. నదులన్నీ కలుషితం అయిపోయాయి. నగరాలలో మురికి వాడలు పెరుగుతున్నాయి. విద్యుత్ సంక్షోభం ముంచుకువస్తోంది. పారిశ్రామికీకరణ వేగంగా జరిగింది. విద్యుచ్ఛక్తి లేకపోతే – పరిశ్రమలు ఎలా నడుస్తాయి. జీవన సరళిలో విలాసాలు పెరిగాయి. మధ్య తరగతివారి సంపద వేగంగా పెరుగుతోంది. అయితే ఇదంతా మేడిపండు ప్రగతి. జీవితంలో వెలితి, ఉద్రిక్తత, విక్షోభం పెరుగుతున్నాయి. ఇలాంటి సమృద్ధి ఎందుకు పనికివస్తుంది?

## అడవుల నరికివేత సమస్య

మన గృహాలలో ఫర్నిచర్ అలంకరణ పెరుగుతోంది. అందుకోసం అడవులను మనం నరికివేస్తున్నాం. వన మూలికలుకూడ క్రమంగా నశించిపోతున్నాయి. ప్లాస్టిక్. పాలిథిన్‌ల వాడకం పెరిగి పోయింది. దీనికి పరిష్కారం కానరావడం లేదు. చెత్త చెదారాలను తిరిగి వినియోగించే ప్రక్రియలు అంతంతమాత్రంగానే పనిచేస్తున్నాయి. జనాభా పెరుగుదల అన్నింటినీ మించిన సమస్య. నగరీకరణ ఒక శాపమై కూర్చున్నది. గ్రామాలలోని సామరస్యం, సౌందర్యం, ప్రకృతి వాతావరణం నశించిపోతున్నాయి. మనది వ్యవసాయ ప్రధానమైన దేశం. అయినా, మన భూసారం తరిగిపోతోంది.

మరి మనం ఎప్పుడు మేలుకుంటాం? భావి తరాలకు మనం ఇలాంటి భూమినే వారసత్వంగా ఇస్తామా?

## విషమిస్తూన్న జల సమస్య

అన్నింటినీ మించినది జల సమస్య. ఎటు చూచినా మంచినీళ్ల సీసాలే కనిపిస్తున్నాయి. బోర్లు ఎండిపోయాయి. చెరువులూ నదులూ మురుగుతో నిండిపోతున్నాయి. భూగర్భ జలం రోజు రోజుకూ మరింత లోతుకు పోతోంది. నీళ్ల పొదుపు మనకు లేదు. దూరదృష్టి మనకు లేదు. జల సంరక్షణ, వర్షపు నీటి నిలువ, దానితో సేద్యం, ఇంధనపు పొదుపు అమలు జరగకపోతే – మనకు వినాశనం తప్పదు.

## పర్యావరణ వాహిని ఏర్పాటు

యుగ నిర్మాణ యోజన, అఖిల విశ్వ గాయత్రీ పరివార్, అఖండ జ్యోతి పరివార్ ఈ విషయమై యుద్ధ ప్రాతిపదికపై జన జాగరణ ఉద్యమాన్ని నిర్వహించవలసిన తరుణం వచ్చింది. దేశమంతటిలో వర్ష జల సంరక్షణకూ, మొక్కలు నాటి వాటిని రక్షించడానికీ ఒక యంత్రాంగాన్ని నిర్మించడానికై మనం ఒక పర్యావరణ వాహినిని ఏర్పాటుచేయాలి. ఔషధాలకు పనికివచ్చే, బహుళార్థసాధకంగా ఉండే, భూసారాన్ని నిలిపే, అందరికీ

**జాతిశ్రేయస్సును పెంచడమే దేవతల ఆరాధన.**

ఉపయోగించే మొక్కలను నాటాలి. మన పిల్లలను పెంచినట్లు వాటిని పెంచాలి. జన్మదినం, వివాహ దినం, పితృ దినం, రక్షాబంధన్ మున్నగు సందర్భాలలో మొక్కలు నాటే సంప్రదాయం బలపడాలి. వాటిని రక్షించేందుకు మరో వాహిని ఏర్పాటు కావాలి. గృహ నిర్మాణంలో మార్పులు తెచ్చి వర్ష జలాన్ని నిల్వచేయడంలో ప్రజలకు శిక్షణ ఇవ్వాలి. ప్రతి పౌరుడూ ఇందులో అభిరుచి చూపాలి. ఇలా నీరు నిల్వ అవుతున్న కొలదీ మన బావుల, జలాశయాల నీటి మట్టం పెరుగుతుంది. మన నీటి సమస్య పరిష్కారం అవుతుంది.

మన పర్యావరణ వాహిని అడవుల మాఫియాలతో సంఘర్షణ జరపవలసి ఉంటుంది. 'చిప్కో' ఉద్యమం తరహాలో గాంధేయ ఉద్యమాన్ని వేగవంతం చేయాలి. యువతీ యువకులలో ప్రతి ఒక్కరూ ఇందుకోసం క్రియాశీలం కావాలి. ప్రకృతి ప్రకోపాల సమయాలలో ప్రజలను ఆదుకునే ఉద్యమాన్ని ఈ ఉద్యమానికి జోడించాలి. ఈ దిశలో కూడ శిక్షణ గరపబడాలి. పూజా, ఉపాసనా అవసరమే. విశ్వ వారసత్వాన్ని రక్షించడం మరింత అవసరం.

తిరిగి ఉపయోగపరచగలిగేదీ, ఉపయోగ పరచలేనిదీ, ఇతరమూ అనే మూడు భాగాలుగా చెత్తను విడదీసేందుకై ప్రభుత్వేతర స్థాయిలో యంత్రాంగాన్ని నిర్మాణం చేయాలి. కంపోస్టు ఎరువు తయారీ పెక్కు స్థలాలలో జరుగుతోంది. సేంద్రియ ఎరువులను, వర్మీ కంపోస్టును సేంద్రియ వ్యవసాయానికి వాడితే, అద్భుత ప్రయోజనం ఉంటుంది. ప్లాస్టిక్, పాలిథిన్ సంచులను, వాడిన వస్తువులను ఇష్టం వచ్చినట్లు పారవేయకపోతే – దేశ స్వరూపమే మారిపోతుంది.

మన నదుల జలాల నుండి కాలుష్యాన్ని తొలగించడం అన్నింటికన్న పెద్ద సమస్య. దీన్ని ప్రభుత్వానికి వదిలివేస్తే సరిపోదు. ఈ భగీరథ కృషి కోసం ఒక సంస్థ నిర్మాణమవుతుందనే నమ్మకం ఉంది.

## సూర్య సాధన ద్వారా కవచ నిర్మాణం

సూర్యుడు మన ఆరాధ్య దైవం. గాయత్రీ మంత్రానికి దేవత సవితయే. మనందరి ప్రాణాలకూ, ప్రేరణలకూ జన్మస్థలంకూడ సూర్యుడే. పర్యావరణ క్షాళన కోసమై మనం సూర్యుడి కోపాన్ని శాంతింపజేయాలి. పెరుగుతూన్న సూర్య కళంకాలను తగ్గించాలి. సూర్య కిరణాలను మధువిద్య ద్వారా తగువిధంగా పానం చేయాలి. ఓజోన్ పొర పలచబడడంవల్ల మనం సూర్య ప్రకోపాన్ని దర్శిస్తున్నాం. సూర్యుడు ఈ జగత్తుకు ఆత్మ. ప్రకృతి ప్రకోపం అతడి ప్రకోపంతో ముడిపడి ఉంది. మనం గాయత్రీ సాధన ద్వారా సూర్య శక్తిని ఆధ్యాత్మిక తేజస్సుగా ఆకర్షించాలి. సూర్య దేవత మన పొరపాట్లకు మనల్ని క్షమించాలనీ, మన రక్షణ కోసం ఏర్పరచిన కవచాన్ని సుదృఢం చేయాలనీ మనం ప్రార్థన చేయాలి. ఆయన శక్తి అతి మానస జ్యోతిగా మనకు సద్బుద్ధి అనే వెలుగును ప్రదానం చేయాలని మనం ప్రార్థన చేయాలి. ఈ ప్రార్థన 14 సంవత్సరాలపాటు కొనసాగాలి. మత సంప్రదాయాలకు అతీతంగా జరగాలి ఈ ప్రార్థన. అప్పుడు ప్రకృతి ప్రకోపం శాంతించడం నిశ్చయం.

## యువ శక్తికి ఆహ్వానం

యువ శక్తికి ఒక పిలుపు. ఈ విపత్ సమయంలో యువజనులు పర్యావరణ వాహినిలో, ప్రకృతి ప్రకోపాల నిర్వహణ వాహినిలో చేరాలి. శిక్షణ పొందాలి. గాయత్రీ పరివార్ నిర్వహించే ప్రతి యువ సమ్మేళనంలో ఈ విషయం వివరించబడుతోంది. మన యువ శక్తి విశ్వాన్నీ, భారతవర్షాన్నీ రానున్న ప్రమాదంనుండి రక్షించగలుగుతుంది; భూమాతకు ఆకుపచ్చ దుప్పటి కప్పగలుగుతుంది, పర్యావరణ సంతులనాన్ని తిరిగి నెలకొల్పగలుగుతుంది.

★★★

### గమనిక

*పత్రికను మనియార్డరు ద్వారా చందా పంపేవారు ఆ ఫారమ్ ( ) పిన్ కోడు నంబరుతోసహా తమ పూర్తి చిరునామాను, నంబరును తప్పక వ్రాయగలరు. చందాను పొడిగించేవారు తమ కంప్యూటర్ నంబరును కూడ వ్రాయగలరు. మనియార్డరులు పంపేవారు ఆ పైకాన్ని దేనికోసం పంపుతున్నారో స్పష్టంగా వ్రాయవలసి ఉంటుంది.*

**విశుద్ధమైన బుద్ధితో చేసే స్వార్థరహిత కార్యం యజ్ఞమే.**

పాఠకుల స్పందన

# సాధకులకు స్ఫూర్తినిచ్చే వ్యాసాలు

మీరు నెలనెలా పంపుచున్న యుగశక్తి గాయత్రి మాసపత్రికలు శ్రద్ధగా చదివి ప్రజ్ఞ విశేషాలతోపాటు సాధన క్రమమును తెలుసుకొనుచున్నాము. తెలుగులో పదిరోజుల ప్రత్యేక సాధనా శిబిరము ఆగస్టులో నిర్వహించుచున్నట్లు గాయత్రి జయంతి పత్రికలో చూచినాము. ఇతర భాషాప్రవీణత లేని మాబోటి వారికి చాలా ఉపయోగము. మా అబ్బాయితోపాటు కొందరు సాధకులు సాధనా శిబిరమునకు హరిద్వార్ వెళ్ళాలంటున్నారు.

మీరు ప్రచురించుచున్న సాధకుల అత్యద్భుత అనుభవాలను చదువుతుంటే అంతటి ఫలితాలను పొందే సాధనను మేము కూడా చెయ్యాలనే పట్టుదల ప్రతి పాఠకునికీ తప్పక కలుగుతుంది. గాయత్రి మంత్ర సిద్ధిలోని వైజ్ఞానిక రహస్యం, అంతరిక్షయాత్ర, గుండెజబ్బులకు గాయత్రిమంత్ర చికిత్స– డాక్టరుగారి పరిశోధన, గురుదేవుల అమృతవాణి– ఒకటేమిటి, అన్నీ తెలుసుకోవలసిన విశేషములే. ఈ సంచికలో మహిళా జాగరణ లేదు, ఎందుకనో. మేనెల సంచికలో సాధనా విప్లవం అంశంక్రింద ఛత్తీస్‌గఢ్ పరిజనులకు ఒక పథకాన్ని ఇచ్చినట్లు మీరు పేర్కొన్నారు. ఆ అద్భుత అంశం చాలా సులువుగా అందరూ చేయగలిగిందిగా ఉంది.

దేశవ్యాప్తంగా విజృంభించిఉన్న క్రూరత్వం, కుతంత్రం, స్వార్థపరత్వం మారి , ప్రజల శక్తులు నిర్మాణాత్మక కార్యక్రమాలకు ఉపయోగపడాలని మనమంతా దేవసత్తాలకు నివేదన పంపుకుని, త్వరలో గురుదేవులు ఆశించిన సత్యయుగం, శాంతియుగం స్థాపించబడాలని నేనూ ఆశిస్తూ, ఈ విషయాన్ని నేను చేస్తూ, వీలున్నంత ప్రచారం చేస్తూ చేయించటానికి ప్రయత్నిస్తున్నాను. ఆపై గాయత్రి మాత దయ.

*గుంటూరు.* పి.ఎన్. సూర్యకుమారి

*(జాతీయ యోగ బహుమతి గ్రహీత)*

## ఆణిముత్యాలూ రత్నాలూ ఉన్నాయీసంచికలో

గాయత్రీ జయంతి ప్రత్యేక సంచికలోని నిజాలు, ఎన్నో తెలియని విషయాలు, వేదమాత గాయత్రీదేవి యొక్క మహత్తు మరపురానివి. జీవితంలో తెలుసుకోదగ్గ విషయాలు, ఎన్నో ఆణిముత్యాలు ఉన్నవి. నా సందేహాలు అన్నింటినీ గురువుగారు తీర్చినారు. నాకు చాలా భయాలు ఉన్నవి. అవి అన్నీ ఆ సంచిక చదివిన తర్వాత తీరినవి. నా మనస్సు చాలా తేలికగా ఉన్నది. 24 గంటలు మాతాజీని, గురువుగారిని స్మరించుకొంటూనే ఉండునట్లు మంచి రత్నాలలాంటి మాటలు అందులో ఉన్నవి. నా అనుభవాలు కూడ ఆ సంచికలో వ్రాసినట్లే ఉన్నవి.

ఇంత అమూల్యమైన పుస్తకం మరల ఎప్పుడు వస్తుందో అని ఎదురుచూస్తూ ఉంటాను. పుస్తకం చదివినంతసేపు మాత నా దగ్గర ఉన్నట్టే అయినది.

*కాకుపల్లి బ్రహ్మదేవం, నెల్లూరు.* ఎస్. సుజాత

★★★

## స్వామి రామతీర్థ

*స్వామి రామతీర్థ ఒక పర్యాయం విదేశాలకు వెళ్ళారు. అక్కడ వారికి ఒక విదేశీయ భక్తుడు కలిశాడు. ఆయన స్వామీజీని హిందూధర్మాన్ని గురించి, ఇతర మతాలగురించి అనేక ప్రశ్నలు అడిగారు. స్వామీజీ ఆ ప్రశ్నలన్నింటికీ సరియైన సమాధానాలిచ్చారు.*

*చివరకు ఆ విదేశీయ భక్తుడు అడిగాడు – 'మీ దేశ ప్రజలు కోట్లాది దేవతలను ఆరాధిస్తారు. ఆ దేవతలలో ఉన్న తేడా ఏమిటి? చెప్పండి.' దీనికి స్వామి రామతీర్థ ఇలా చెప్పారు. – 'మొదట నేను ఒక ప్రశ్న అడుగుతాను. దానికి సమాధానం చెప్పండి– 1 /2,2/4,4/8,8/16,16/32 వీనిలో తేడా ఏమిటి?' ఆ భక్తుడు చెప్పాడు, తేడా ఏమీలేదని. ఈ రకంగా ఆ భక్తునికి సరియైన సమాధానం లభించింది.*

**సన్మార్గంలో పయనించు. ఆత్మ బలాన్ని పెంచు.**

# శాంతికుంజ్ సమాచారం

పరమపూజ్య గురుదేవుల శతజయంతి ఉత్సవం (2011-12లో) మానవ చేతనయొక్క విప్లవాత్మక అతిమానస ఆవిర్భావంలో ఒక విశిష్టమైన సోపానం అవుతుందన్నది మన విశ్వాసం. ఈ మహా పరివర్తనలో భారతదేశానికి కీలక పాత్ర ఉన్నది.

ఈ మహా పరివర్తనకు భూమికను నిర్మాణం చేయడానికై విశిష్ట సాధనా పురశ్చరణను శాంతికుంజ్‌లోని సాధకులు ప్రారంభించారు. ఈ పురశ్చరణ శతజయంతి సంవత్సరం 2011-12 వరకు కొనసాగుతుంది. 24 గురు సాధకుల బృందం 40 రోజులపాటు సాధన జరుపుతోంది. ఆ తర్వాత మరో బృందం సాధన జరుపుతుంది. ఈ సాధన ఇలా శతజయంతి సంవత్సరం 2011-12 వరకు అఖండంగా కొనసాగుతుంది.

## పోలీసు సిబ్బందికి యోగ శిక్షణ శిబిరం

దేవ సంస్కృతి విశ్వవిద్యాలయం పోలీసు సిబ్బంది కోసం దేశంలోని వివిధ రాష్ట్రాలలో యోగ శిక్షణ శిబిరాలను నిర్వహిస్తోంది.

ఇటీవల ఉత్తర ప్రదేశ్‌లోని హర్‌దోయీలో 3 రోజులపాటు, మొరాదాబాద్‌లో 5 రోజులపాటు ఈ శిబిరాలు నిర్వహించబడ్డాయి. 600 మందికిపైగా పోలీసులు, పోలీసు శాఖ అధికారులు శిబిరాలలో పాల్గొన్నారు. ఇకముందుకూడ ఇటువంటి అవకాశాలను వినియోగించుకోవడం కోసం ఆతురతతో ఎదురుచూస్తూ ఉంటామని శిక్షణలో పాల్గొన్న తర్వాత పోలీసు అధికారులు ఎంతో ఉత్సాహంతో ఉత్తేజంతో చెప్పారు. ఆ శిక్షణవల్ల తమలో శక్తి సామర్థ్యాలు ఇనుమడించాయని వారు తెలిపారు.

## తిలక్ పట్టుదల

*బాల గంగాధర తిలక్ బాల్యం నుండి నిర్భయుడు, తెలివితేటలు కలవాడు. ఆయన ఎప్పుడూ బలహీనతకు లొంగి తప్పుడు పనులుచేసేవాడు కాదు. బాల్యంలో అతని తరగతిలో ఒక సంఘటన జరిగింది. చదువుకునే సమయంలో కొందరు బాలురు ఏదో ఒకటి తింటూండేవారు. అలాగే ఒకనాడు ఒక విద్యార్థి వేరుశనగకాయలు తిని వాటి తొక్కలు తరగతిలో విసిరివేశాడు. అతను తింటున్న సమయంలో ఉపాధ్యాయుడు చూడలేదు. రెండవ ఉపాధ్యాయుడు తరగతిలోకి వచ్చాడు. తరగతిలోకి రాగానే అక్కడ చెత్త పడిఉండటం చూశాడు. ఆయనకు అసహ్యం వేసింది. ఉపాధ్యాయుడు విద్యార్థుల నందరిని అడిగాడు. కాని ఎవరూ ఏమీ చెప్పలేదు. ఉపాధ్యాయుడు విద్యార్థులనందరినీ దండించాలని నిశ్చయించుకున్నాడు. 'తరగతిలో అందరూ వేరుశనగకాయలుతిన్నారు, అందరూ దోషులే'- అని చెప్పాడు. తిలక్ మాత్రం స్పష్టంగా చెప్పారు- 'నేను వేరుశనగకాయలు తినలేదు.' 'నీవు నేరాన్ని ఒప్పుకో, లేకపోతే దెబ్బలు పడతాయి'- గురువు అన్నాడు. తిలక్ దెబ్బలను గురించి లెక్క చేయకుండా ఇలా చెప్పాడు- 'నేను ఈ తప్పు చేయలేదు. దెబ్బలకు భయపడి నేనెందుకు ఒప్పుకోవాలి?' తరువాత ఉపాధ్యాయుడికి తెలిసింది. తిలక్ తప్పు చేయలేదు. అతని సాహసాన్ని ఆయన మెచ్చుకున్నారు. పెద్దవాడైన పిదప స్వాతంత్ర్య ప్రాప్తి కొరకు తిలక్ గొప్పగొప్ప పనులు చేశాడు. ఆయన తన జీవిత సర్వస్వాన్ని దేశసేవకై అర్పించాడు.*

## శాంతికుంజ్ బృందం ఆస్ట్రేలియా పర్యటన

శాంతికుంజ్ సాధకుల బృందం ఇటీవల మూడు నెలలపాటు ఆస్ట్రేలియాలో పర్యటించింది. ప్రొఫెసర్ ప్రమోద్ భట్నగర్, శ్రీ రమేష్ తివారీ, శ్రీ ప్రజ్ఞేశ్వర్ ఆ బృందంలో సభ్యులు. వీరు సిడ్నీ, పెర్తె, బ్రిస్టేన్, మెల్బోర్న్‌లలో సభలు నిర్వహించి, ముఖ్యంగా ప్రవాస భారతీయులకు దేవ సంస్కృతి సందేశాన్ని అందించారు. యువ సమ్మేళనంలో ఆస్ట్రేలియా, నూజిలాండ్, ఫిజీల నుండి వందలాదిగా యువజనులు పాల్గొన్నారు.

★★★

**మనం ఎంత ప్రశాంతంగా ఉంటే, మన పని అంత ఉత్తమంగా ఉంటుంది.**

వార్తలు

# రాష్ట్రంలో వైభవంగా గాయత్రీ జయంతి ఉత్సవాలు

## హైదరాబాదులో

హైదరాబాదులోని గాయత్రీ చేతనా కేంద్రంలో గాయత్రీ జయంతి సందర్భంగా జూన్ 16 నుండి 25 వరకు వివిధ కార్యక్రమాలు జరిగాయి. 16 నుండి 23 వరకు ఉదయం 5 గం॥ల నుండి సాయంత్రం 5 గం॥ల వరకు అఖండ గాయత్రీ జపం జరిగింది. 500 మంది సాధకులు పాల్గొన్నారు. 24 ఉదయం 12 కుండముల గాయత్రీ యజ్ఞం జరిగింది. 200 మంది పాల్గొన్నారు. నాటి సాయంత్రం జరిగిన దీప యజ్ఞంలో 200 మంది పాల్గొన్నారు. శ్రీహీర్‌సింగ్ రాజపురోహిత్, శ్రీమతులు హైమవతి, ధనలక్ష్మి పై కార్యక్రమాలను సంచాలన చేశారు. శ్రీ అశ్విని సుబ్బారావు, వారి సతీమణి శ్రీమతి మహేశ్వరి కార్యక్రమాలకు ఆధ్వర్యం వహించారు.

## భీమిలిలో

భీమిలిలో శ్రీదుర్గా గాయత్రి శక్తిపీఠంలో జూన్ 25న గాయత్రీ జయంతి వైభవంగా జరిగింది. ఉదయం త్రిపద గాయత్రి ఆలయంలో అమ్మవార్లకు శ్రీమతి భారతి అష్టోత్తర పూజలు జరిపారు. అనంతరం జరిగిన గాయత్రీ యజ్ఞంలో పరిసర గ్రామాల భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. శ్రీరామకృష్ణ, జ్యోతి దంపతులు విశేష పూజలు నిర్వహించారు. డా॥ జి.చంద్రశేఖరం ప్రసంగించారు.

## రాష్ట్రమంతటా 24 కుండముల గాయత్రీ యజ్ఞాల నిర్వహణ

శక్తిపీఠాల రజత జయంతి సందర్భంగా రాష్ట్రంలో 24 కుండముల గాయత్రీ యజ్ఞాల పరంపరలో అయిదవ ఘట్టం పూర్తయింది. శాంతికుంజ్ ప్రతినిధి శ్రీ సురేంద్ర వర్మ నాయకత్వంలో ప్రజ్ఞాపుత్రులు శ్రీయుతులు హీర్‌సింగ్ రాజపురోహిత్, ఫూల్ సింగ్, సంగ్రామ్‌సింగ్, జి.వి.ఆర్.మూర్తి, సంతోష్ శర్మ, వెంకటనారాయణ, డి.వి.ఆర్.మూర్తిలతో కూడిన బృందం యజ్ఞాలను నిర్వహించింది. అనంతపురం, కడప, కర్నూలు, నెల్లూరు, తిరుపతి, ఒంగోలు, బాపట్ల, చీరాల, మంగళగిరి, గుంటూరు, విజయవాడ, పిడుగురాళ్ల, అమలాపురం, రాజమండ్రి మున్నగు స్థలాలలో యజ్ఞాలు జరిగాయి. ఈ యజ్ఞాల సందర్భంగా– 18 వేల మంది సామూహిక గాయత్రీ మంత్ర దీక్ష తీసుకున్నారు. 150 పుంసవన సంస్కారాలు, 100 నామకరణ సంస్కారాలు, 500 విద్యారంభ సంస్కారాలు, 150 జన్మదిన సంస్కారాలు, 105 వివాహ దిన సంస్కారాలు, 58 ఉపనయన సంస్కారాలు నిర్వహించబడ్డాయి. భక్తులు వేలసంఖ్యలో మద్యపాన వ్యసన నిర్మూలనకూ, దేవ దక్షిణగా ఒక దుర్గుణాన్ని వదలడానికీ సంకల్పాలు చేశారు. ఈ యజ్ఞాలలో మేధావులూ, ప్రతిభావంతులూ పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గుంటూరులో 24 కుండముల గాయత్రీ మహాయజ్ఞం

గుంటూరులో మే 26,27 లలో 24 కుండముల గాయత్రీ మహాయజ్ఞం జరిగింది. 26న శోభాయమానంగా కలశ యాత్ర జరిగింది. 27 ఉదయం శ్రీ కోట వేంకటేశ్వర్లు దంపతుల జ్యోతి ప్రజ్వలనతో యజ్ఞం ప్రారంభమయింది. డాక్టర్ తుమ్మూరి ఆ సందర్భంగా ప్రసంగించారు. కార్యక్రమంలో 1500 మంది పాల్గొన్నారు. శ్రీయుతులు

**వ్యక్తిత్వమనే మొక్కకు సద్గుణాలు ఎరువులు, నిజాయితీ నీరు.**

జుజ్జూరు సాంబశివరావు, సురే వేంకటేశ్వర రావు, కోటా వేంకటేశ్వర్లు, కంకిపాటి శివశేఖర రావు, దొడ్డా వేంకట ప్రసాదరావు, దివ్వెల లక్ష్మీపతి, దేవీప్రసాద్ కార్యక్రమ నిర్వహణలో సహకరించారు. యజ్ఞంలో బ్రహ్మ భోజనంగా 'ధైర్యం విడువకండి' పుస్తకం వేయి ప్రతులను సగం ధరకే అనగా ఒక రూపాయికే విక్రయించారు. ఇందుకు శ్రీ వినాయకా బైండింగ్ వర్క్స్ , వెంకట శివ గాయత్రి బైండింగ్ వర్క్స్ సంస్థలు సహకరించాయి. కార్యక్రమానికి సహకరించిన వారందరికీ యుగశక్తి గాయత్రి పత్రిక గాయత్రీ జయంతి ప్రత్యేక సంచికను యజ్ఞ ప్రసాదంగా వితరణ చేయాలని నిర్వాహకులు నిర్ణయించారు.

## విజయవాడలో వివాహదిన స్వర్ణోత్సవం

విజయవాడలోని విశ్వహిందూ పరిషత్ కార్యాలయ ఆవరణలో జూన్ 7న కందర్ప రామచంద్రరావు, సీతామహాలక్ష్మి దంపతుల వివాహదిన స్వర్ణోత్సవం జరిగింది. ఆ సందర్భంగా శుభాకాంక్షలు తెలుపుతూ శాంతికుంజ్ నుండి ఆదరణీయ శైల దీదీ లేఖ వ్రాశారు. శాంతికుంజ్‌లో ఆ సందర్భంగా ప్రత్యేక ఆహుతులు ఇవ్వబడ్డాయని వారు తెలిపారు. శ్రీయుతులు కె.వి.వి.పంతులు, రామ శంకర్ యజ్ఞాన్నీ, వివాహదిన సంస్కారాన్నీ నిర్వహించారు. 50 సంవత్సరాల క్రితం ఆ దంపతుల వివాహానికి విచ్చేసిన మాన్యులు శ్రీ తూమూలూరి లక్ష్మీనారాయణ స్వర్ణోత్సవ సందర్భంగా ప్రసంగించడం విశేషం. శ్రీయుతులు దేవరకొండ విశ్వేశ్వర రావు, కాందూరి ఉమామహేశ్వరుడు, దివ్వెల పిచ్చయ్య, గొట్టిపాటి మురళీమోహన్, పులుసు గోపిరెడ్డి, కొరీ లక్ష్మణరావు, డా॥సామల రమేశ్ బాబు, జి.ఎన్.శంకరరావులతో సహా బంధు మిత్రులు పలువురు ఉత్సవంలో పాల్గొన్నారు. హైదరాబాదు గాయత్రీ చేతనా కేంద్రం తరఫున శ్రీ కె.వి.వి.పంతులు దంపతులను నూతన వస్త్రాలతో సత్కరించారు.

## అభ్యాసం కూసు విద్య

*ఐన్‌స్టీన్ చదువుకొనేటప్పుడు అందరూ అతనిని 'బుద్ధు' అని పిలుస్తూ ఏడిపించేవాళ్ళు. చాలా పర్యాయాలు కొందరు విద్యార్థులు అతని వీపు మీద 'బుద్ధూ' అని వ్రాసి అతికించారు. తరగతిలో లెక్కలు బోధించిన తరువాత ఉపాధ్యాయుడు ప్రశ్న అడిగితే ఐన్‌స్టీన్ దిక్కులు చూస్తుండేవాడు. అతని ఈ స్థితిని చూచి విసుగుచెందిన ఉపాధ్యాయుడు, 'నీకు ఏడు జన్మలు ఎత్తినప్పటికీ లెక్కలు మాత్రం రావు' అని అంటుండేవాడు. ఈమాట ఐన్‌స్టీన్‌కి గుచ్చుకుంది. 'నేను గణితశాస్త్రంలో ప్రావీణ్యం సంపాదించి తీరుతాను'– అని ఆయన ప్రతిజ్ఞ చేశాడు. ఈ బాలుడే పెద్దవాడై గొప్ప గణిత శాస్త్రజ్ఞుడుగా, విజ్ఞాన శాస్త్రవేత్తగా గణుతికెక్కాడు. ఒకసారి ఒక విద్యార్థి ఐన్‌స్టీన్‌ను ఆయన విజయరహస్యం ఏమిటని ప్రశ్నించాడు. ఆయన చెప్పాడు– 'చిన్న తరగతులలో ఎప్పుడూ వైఫల్యం పొందుతూ ఉండేవాణ్ణి. అయినప్పటికీ గణితశాస్త్రాన్ని అభ్యసిస్తూ వచ్చాను. ఇందువలననే నాకు అన్నింటికంటే కష్టంగా ఉన్న విషయం అన్నింటికంటే సులభతరమైపోయింది.'*

## హైదరాబాదులో 24 లక్షల గాయత్రీ మంత్ర జపం పూర్ణాహుతి

హైదరాబాదు గాయత్రీ చేతనా కేంద్రంలో జూన్ 15న శ్రీ జిల్లా వెంకటనారాయణ 24 లక్షల గాయత్రీ జపం పూర్ణాహుతి జరిగింది. శ్రీవెంకట నారాయణ (కృష్ణయ్యగారి కుమారుడు) జన్మదిన సంస్కారంకూడ ఆ రోజున నిర్వహించబడింది. కార్యక్రమంలో అశ్విని సుబ్బారావు దంపతులు పాల్గొన్నారు. శ్రీమతి అనసూయమ్మ దీపయజ్ఞాన్ని నిర్వహించారు. మరో 24 లక్షల గాయత్రీ జపాన్ని పూర్తిచేయడానికై ప్రతిరోజూ 20 మాలల జపం చేయాలని ఆ సందర్భంగా శ్రీవెంకటనారాయణ సంకల్పం చేశారు.

★★★

**విశ్వాసాన్ని కోల్పోవడం సిద్ధాంతపరమైన మరణం.**

సద్గురు లీలామృతం

# అడుగడుగునా గురుదేవుల ఆసరా

మా తండ్రిగారు జసీడీహ్(బీహారు)లో ఒక చిన్న ఆలయానికి పూజారిగా ఉండేవారు. అతి కష్టంమీద సంసారం గడిచేది. వారూ చనిపోయారు. నేను బాలుణ్ణి. కొంత కాలం ఆ ఆలయంలోనే పనిచేశాను. ఈలోగా గాయత్రీ సాహిత్యం చదివాను. గురుదేవులతో బంధం ఏర్పరచుకున్నాను.

చదువుకోవాలనే ఆసక్తి కలిగింది. ప్రయివేటుగా చదువుతూ, చదువుచెపుతూ బి.ఏ. ప్యాసయాను. బిర్లా కంపెనీలో 150 రూపాయల ఉద్యోగం దొరికింది. ప్రమోషన్ వచ్చింది. పెళ్లయింది. ఆ తర్వాత ఒక అల్యూమినియమ్ గని లీజ్‌హోల్డర్ నుండి 'సబ్‌లీజ్' తీసుకున్నాను. గనుల యజమానిని అయాను. నేడు 60 మంది నావద్ద పనిచేస్తున్నారు. మొన్ననే 500 టన్నుల కొత్త ఆర్డరు వచ్చింది. 8000 రూపాయల జుర్మానా మాఫీ అయింది.

అడుగడుగునా గురుదేవుల ఆసరా అభించింది.

నేను గురుదేవుల మనిషిని. వారి బాటలో నడుస్తున్నాను. జీవితాంతం వారి అడుగు జాడలలో నడుస్తాను.

*– భగవత్ ప్రసాద్ మిశ్ర, లోహర్‌దగా (బీహారు)*

## ఉత్తరమూ, జవాబూ ఒకే రోజున

1963లో నా భార్యకు సన్నిపాత జ్వరం వచ్చింది. జ్వరం 107 డిగ్రీలకు తగ్గడం లేదు. పరిస్థితి విషమిస్తోంది. డాక్టరు తన నిస్సహాయతను వ్యక్తం చేశాడు. మాకు నలుగురు చిన్న చిన్న పిల్లలు. నా భార్యకు ఏదైనా అయితే, ఈ పిల్లల గతి ఏమిటి?

నా వ్యాకులత హద్దులు దాటిపోయింది. గురుదేవులకు ఉత్తరం వ్రాశాను. మూడవ రోజున జవాబు వచ్చింది. ఆనందమూ, ఆశ్చర్యమూ కలిగాయి. మార్చి 18న నేను ఉత్తరం వ్రాశాను. ఉత్తరం కవరుమీద కూడ మార్చి 18 ముద్ర ఉంది. ఉత్తరం అందడానికి మూడు రోజులు పడుతుంది. టెలిగ్రాము అయినా ఆ రోజు అందదు. ఉదయం పోస్టులో నేను ఉత్తరం వేశాను. ఉదయం 10 గంటల మథుర పోస్టాపీసు ముద్ర నాకు వచ్చిన కవరుమీద ఉంది. నేను ఉత్తరం వ్రాస్తున్న సమయంలోనే జవాబు వ్రాయబడింది. అద్భుతం! నా భార్యకు నయమయింది. ఆరు నెలల తర్వాత ఆమెతోపాటు మథుర వెళ్లాను. నాకు జవాబు అందడంలోని రహస్యం ఏమిటని అడిగాను. గురుదేవులు నవ్వారు. నీ బాధ చూచి ఉత్తరం త్వరగా పంపాను– అన్నారు.

*–ఉమా శరణ్ నిచల్, షిల్లాంగ్ (అస్సాం)*

## భౌతిక సహాయానికి కారణాలు రెండు

తమ తపోబలాన్ని ఖర్చుచేసి ప్రజలకు భౌతిక సహాయాన్ని అందిస్తూ ఉండడంవల్ల కలిగే ప్రయోజనం గురించి ఒక రోజున అడిగాను. గురుదేవులు ఇలా అన్నారు–

ఇందుకు రెండు కారణాలు ఉన్నాయి.

ఒకటి. సమర్థుడైన వ్యక్తి ఇతరులకు సహాయపడడంలో అనుచితమైనది ఏదీ లేదు.

రెండవది. ఈనాడు అధ్యాత్మలోని జ్ఞాన భాగమే సజీవంగా కనిపిస్తోంది. ధర్మోపదేశాలే సాగుతున్నాయి. విజ్ఞాన భాగం లోపించిపోయింది. అధ్యాత్మ సహాయంతో ఆత్మిక ఉన్నతితోపాటు భౌతిక ప్రగతికూడ సాధ్యపడుతుంది. ఈ వాస్తవానికి ప్రమాణాలు ఈనాడు లభించడం లేదు. ఈ వాస్తవం స్పష్టమయితే– ప్రజల అభిరుచి ఇటువైపు మళ్లుతుంది; ప్రజలు దృఢంగా ఈ మార్గాన్ని స్వీకరిస్తారు. ప్రజలకు సహాయం చేస్తూఉండడం ద్వారా ఈ విశ్వాసాన్ని పరిపక్వం చేయడంకూడ ఒక బలమైన కారణం.

*– గిరిరాజ్ కిశోర్ పరాశర్, మీర్జాపూర్*

★★★

**విద్యా ధనం పంచితే పెరుగుతుంది.**